

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఖమ్మం

: fb.com/vaartha Digital

Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

16-2-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 16 పేజీలు: 8+16 వెల: 6.50



జాతీయ రహదారిపై బైక్ రైడర్ దుర్మరణం 3లో

ఆధార్‌తో మరింతగా వ్యక్తిగత భద్రత 5లో




# పాక్ చిత్తు చిత్తు

టి-20 వరల్డ్ కప్‌లో భారత్ ఘన విజయం

61 పరుగుల తేడాతో టీమిండియా గెలుపు

హ్యాట్రిక్ విజయాలతో సూపర్-8కి చేరిన భారత్ జట్టు

ఆట లో



ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన సంత్‌సేవాలాల్ కార్యక్రమంలో మాట్లాడుతున్న సిఎం రేవంత్

# పాలకులం కాదు.. సేవకులం

## నేనే రాజు..వ్యాఖ్యలను వక్రీకరించారు

మున్సిపల్ గెలుపు, ఓటములకు బాధ్యత నాదేనని చెప్పా

## రాష్ట్రంలో అన్ని తండాలకు బిటి రోడ్లు

సంత్ సేవాలాల్ జయంతి కార్యక్రమంలో సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఫిబ్రవరి15:**'మేం పాలకులం కాదు మేం సేవకులం అని నేను ఏ నాడో చెప్పాను. నేను పాలకుడిగా ఎప్పుడు ప్రవర్తించలేదు..సేవకుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్న..సేవ చేయడానికే ప్రజలు నాకు అవకాశం ఇచ్చారు..ఎప్పుడూ గుర్తు పెట్టుకుంటా, ఏ వర్గాలైతే నాకు అవకాశం ఇచ్చారో వాళ్లకు సేవ చేయాలన్నదే నా ప్రయత్నం' అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం బంజరా భవన్‌లో నిర్వహించిన సంత్ సేవాలాల్ జయంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'మానవ జాతి శాంతి మార్గంలో నడవాలని సంత్ సేవాలాల్ అందరిలో స్ఫూర్తిని నింపారు.దేశంలోని 15 కోట్ల మంది లంబాడీలకు మార్గదర్శిగా నిలబడ్డారు.సేవాలాల్ జయంతి అధికారికంగా జరపడం మా బాధ్యత' అని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో లంబాడీలు కీలక పాత్ర పోషించారని, సురేష్ నాయక్,కవిత నాయక్ ఆత్మ బలిదానం చేసుకున్నారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో దళితులతో పాటు గిరిజనలు ప్రాధాన్యత ఉండాలి ఈ వర్గాలకు సముచిత గౌరవం ఇవ్వాలి అని చెప్పారు. 'మిడ్జిల్‌లో నేను జెడ్పిటీసీ అభ్యర్థిగా పోటీ చేసినప్పుడు తండాల్లో ఉన్న యువకులు నా విజయంలో క్రియాశీలక పాత్ర పోషించారు..నా 20 ఏళ్ల రాజకీయ ప్రస్థానం లో ప్రతి సందర్భంలో లంబాడా సోదరులు అండగా నిలబడ్డారు. సీఎం హోదా రావడానికి లంబాడాల అండదండలు ఉన్నాయి' అని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని తండాలకు బీటీ రోడ్‌లు వేయాలని ఆదేశాలు ఇస్తున్నట్లు తెలిపారు.ప్రతి తండాలో ప్రభుత్వ పాఠశాల భవనాలను ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. అన్ని తండాలలో గ్రామ పంచాయతీ భవనాలు నిర్మించాలి..అన్ని తండాల్లో తాగునీటి కోసం ట్యాంకులు ఏర్పాటు చేయాలని సూచించారు.తండాలకు సోలార్ ప్లాంట్ల ద్వారా కరెంట్ ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుందన్నారు.పేదవాడి గౌరవం రేషన్ కార్డు..రేషన్ కార్డు దారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నాం.3.15 కోట్ల మంది పేదలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నాం నేను స్వయంగా ఒక గిరిజనుడి ఇంటికి వెళ్లి సన్న బియ్యంతో భోజనం >>2



ఆదివారం కీసరలో శివలింగానికి పూజలు చేస్తున్న డూడూ బసవన్నలు

# 'హరోం హర హర' స్మరణతో వైభవంగా మహాశివరాత్రి

ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు

2లో



మధిరలోని మృత్యుంజయ స్వామి ఆలయంలో అభిషేకం చేస్తున్న డి.సిఎం భట్టి దంపతులు





# రెండు రోజుల్లో రైతు భరోసా

## కోత లేకుండా గత ఖరీఫ్ రైతులందరికీ సాయం

**హైదరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని రైతులకు మరో రెండు, మూడు రోజుల్లో రైతు భరోసా ఆర్థిక సాయం అందనుంది. ప్రధానంగా ఈ యాసంగి సీజనులో కూడా ఎటువంటి కోత లేకుండా రైతులకు పెట్టుబడి సాయాన్ని అందించనుంది. గత ఖరీఫ్‌లో రైతు భరోసా నిధులు జమ చేసిన రైతుందరికీ ఈసారి కూడా అమలు చేయాలని నిర్ణయించినట్లు వ్యవసాయ శాఖ అధికారవర్గాల ద్వారా వెల్లడైంది. తెలంగాణ వ్యవసాయ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శాటిలైట్ సర్వేతో లింకు పెట్టకుండానే రైతు భరోసా పంపిణీ చేసేందుకు కసరత్తు చేస్తోంది. మునిసిపల్ ఎన్నికల ప్రక్రియ పూర్తిగా ముగియగానే కొత్త రైతుల నమోదుకు అవకాశం కల్పించి ఆ వెంటనే రైతులకు నగదు బదిలీ చేసే అవకా శాలున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 2025-26 ఖరీఫ్ సీజన్‌లో 69,39,548మంది >>2

# మేయర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్ల ఎన్నిక నేడే

## హంగ్ ఉన్నచోట తాయిలాల పర్వం

## వారికి డబ్బు, కార్లు, ఫ్లాట్లు

కరీంనగర్ కార్పొరేషన్‌లో నాటకీయ పరిణామాలు

మంత్రులతో సిఎం జూమ్ మీటింగ్



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఫిబ్రవరి15:** మున్సిపల్ పోరు చివరి అంకానికి చేరుకుంది. 116 మున్సిపాలిటీలు, ఏడు కార్పొరేషన్లలో గెలిచిన కౌన్సిలర్లు,కార్పొరేటర్లు సోమవారం ఉదయం 11 గంటలకు ప్రమాణం చేయనున్నారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్,వైస్ చైర్‌పర్సన్, మేయర్,డిప్యూటీ మేయర్ ఎన్నిక ప్రారంభమవుతుంది. కౌన్సిలర్లు, కార్పొరేటర్లలో సగం మంది హాజరైతేనే కోరం ఉన్నట్లు పరిగణించి చేయి ఎత్తే విధానంలో అధికారులు ఎన్నిక పూర్తి చేస్తారు. లేదంటే మరో రోజుకు వాయిదా వేస్తారు. కాగా, మున్సిపల్ ఎన్నికలు ముగిసినా డబ్బు,హామీల ప్రవాహం ఆగట్లేదు. 37 మున్సిపాలిటీలు,2 కార్పొరేషన్లలో హాంగ్ పరిస్థితి ఉంది. సోమవారం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్, మున్సిపాలిటీ చైర్మన్,వైస్ చైర్మన్ పదవుల రేసులో ఉన్న వారు ఇండిపెండెంట్ల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. ఇప్పటికే వారికి హైదరాబాద్‌లో ఫ్లాట్లు,ఖరీదైన కార్లు,భారీగా డబ్బు,బంగారు బహుమతులు అందించినట్లు సమాచారం. మరికొందరికి కాంట్రాక్టు పనుల హామీలు ఇచ్చారని ప్రచారం. కాగా, కరీంనగర్ కార్పొరేషన్ రాజకీయం నాటకీయ మలుపులు తిరుగుతోంది. ప్రధాన పార్టీల వ్యూహాలతో రసవత్తరంగా మారుతోంది. కరీంనగర్‌కు చెందిన ఇద్దరు ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కార్పొరేటర్లతో పాటు ముగ్గురు ఇండిపెండెంట్ కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరారు. మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ సమక్షంలో హైదరాబాద్‌లో కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు.ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీకి చెందిన సాయిజ్యోతి, శ్యామల, స్వతంత్ర కార్పొరేటర్లు కొమరయ్య, నందిని ఉదయ్,మల్లేశం సైతం కాంగ్రెస్ గూటికి చేరారు.ఎంఐఎంకు చెందిన ముగ్గురు కార్పొరేటర్లతో >>2

# కొత్త బడ్జెట్ రూ.3.25 లక్షల కోట్లు!

## ప్రస్తుత బడ్జెట్‌లో అంచనాకంటే తగ్గిన కేటాయింపులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:**ప్రస్తుత 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అంచనా బడ్జెట్ భారీగా ఉండబోతోంది. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చే ఆర్థిక సంవత్సరానికి మరింత పెద్ద రాష్ట్ర బడ్జెట్‌ను రూపొందిస్తోంది. ఇందులో భాగంగా తెలంగాణ బడ్జెట్ 2026-27 సంవత్సరానికి సంబంధించి రూ.3.25 లక్షల కోట్ల పై రాష్ట్ర సర్కార్ దృష్టి పెట్టింది. ఈ కొత్త వార్షిక బడ్జెట్ రూ.3.20 లక్షల కోట్ల నుండి రూ.3.25 లక్షల కోట్ల మధ్య ఉంటుందని అంచనా. దీనికి సంబంధించిన కసరత్తులో ఆర్థిక శాఖ అధికారవర్గాలు నిమగ్నమయ్యాయి. అయితే గత వార్షిక అంచనా బడ్జెట్‌లను చూస్తే ఆర్థిక సంవత్సరం చివరి నాటికి వాటి కేటాయింపులు పూర్తి స్థాయిలో ఉండటం లేదు. ఆర్థిక వాస్తవికతకు >>2

# దేశంలోనే తొలిసారి.. విత్తన సొసైటీలు

## తొలుత 97 సంఘాల ఏర్పాటు

ఆర్థిక సాయానికి నాబార్డు గ్రీన్ సిగ్నల్

వానాకాలం సీజన్ నుండి అందుబాటులోకి



**హైదరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న నకిలీ విత్తనాలకు చెక్ పెట్టడంతో పాటు, అధిక దిగుబడులు సాధించి అన్నదాతలకు అన్నివిధాల లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. నాణ్యత, అధిక ఉత్పాదకత, దిగుబడుల సాధన లక్ష్యాలతో దేశంలో మొదటిసారిగా విత్తన సహకార సంఘాలు (సీడ్ కోపరేటివ్ సొసైటీస్) ఏర్పాటు చేయాలని పతిపాదించింది. ఇందులో భాగంగా తొలి దశలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో 97 (జిల్లాకు 3 చొప్పున, ఒక జిల్లాలో నాలుగు) విత్తన సహకార సంఘాలను ఏర్పాటు చేయాలనే నిర్ణయానికొచ్చింది. ఒక్కో సంఘంలో 30 నుంచి 40 మంది ఆదర్శ రైతులు సభ్యులుగా ఉంటారు. అలాగే రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖలు భాగస్వాములుగా ఉంటారు. నాణ్యమైన విత్తనాలను ఉత్పత్తి, ప్యాకేజింగ్, పంపిణీ వంటి వాటిపై వారికి శిక్షణ ఇస్తారు. విత్తన సహకార సంఘాలు ఉత్పత్తి చేసే విత్తనాలకు తెలంగాణ సీడ్ పేరిట బ్రాండింగ్ ఇస్తారు. వాటిని వ్యవసాయ సహకార సంఘాల్లోని సభ్యులకు పంపిణీ చేస్తారు. మిగిలితే ఇతర రైతులకు రాయితీపై విక్రయిస్తారు. తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఏర్పాటయ్యే ఈ సంఘాలకు నాబార్డు ఆర్థిక సాయం అందించనుంది. ఈ విత్తన సహకార సంఘాల ద్వారా నాణ్యమైన విత్తనోత్పత్తి చేయించడం, వాటికి బ్రాండింగ్ ఇచ్చి రైతులకు నేరుగా పంపిణీ చేయడం ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. వానాకాలం సీజన్ నాటికి విత్తనాలను పంపిణీ చేసేలా కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. నకిలీ విత్తనాల వల్ల నష్టపోతున్న రైతులకు సరియైన న్యాయం కూడా జరగడం లేదు. విత్తన చట్టంలోని లోపాల కారణంగా రైతులకు తగిన పరిహారం కూడా అందడం లేదు. విత్తన కంపెనీల ఆధ్వర్యంలో కొందరు అన్నదాతలు విత్తనాల ఉత్పత్తి చేపడుతున్నప్పటికీ వారికి ఆశించిన లాభాలు రావడం లేదు. ఈ నేపథ్యంలో రాష్ట్రం లో విత్తన వ్యవస్థపై వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రత్యేకంగా అధ్యయనంచేసి రాష్ట్ర >>2

# ఎంఎంటిఎస్ రెండో ఫేజ్‌కు కేంద్రం రూ. 600కోట్లు మంజూరు

## భూసేకరణ పనులు రాష్ట్ర ప్రభుత్వం వేగవంతం చేయాలి: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** హైదరాబాద్ నుంచి యాదగిరిగుట వరకు ఎంఎంటీఎస్ సెకండ్ ఫేజ్‌కు కేంద్రప్రభుత్వం 600 కోట్లు మంజూరు చేసిందని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంఎంటీఎస్ సెకండ్ ఫేజ్‌కు వెంటనే భూసేకరణ పనులు వేగవంతం చేయాలని కోరారు. ఆదివారం బర్కత్‌పుర యాదాద్రిభవన్ నుంచి యాదగిరిగుట్ట వరకు నిర్వహించే శ్రీలక్ష్మీ నరసింహా స్వామి 32వ అఖండ జ్యోతి రథయాత్రను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ త్వరలో తెలంగాణలో పర్యటించనున్నాడని వెల్లడించారు. అప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ పూర్తి చేస్తే ప్రధాని మోదీ చేతుల మీదుగా ఎంఎంటీఎస్ సెకండ్ ఫేజ్‌కు భూమి పూజ నిర్వహిస్తామన్నారు. ఎంఎంటిఎస్ ఏర్పాటు చేస్తే హైదరాబాద్ నుంచి యాదగిరిగుట్టకు వెళ్లే భక్తులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. ప్రతి సంవత్సరం ఈ అఖండ జ్యోతి రదయాత్ర నిర్వహించడం అభినందనీయమన్నారు. నగరం, పట్టణాలు, గ్రామాల నుండి ఈ రథ యాత్ర కొనసాగడం వల్ల ప్రజల్లో భక్తిభావం బాగా పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో >>2

# పట్నంలో కమిలిన 'కమలం'

## ఎమ్మెల్యేల పరిధిలోని మున్సిపాలిటీల్లోనూ బోల్తా

## గతంలో కంటే కౌన్సిలర్లు, కార్పొరేటర్లు పెరిగినా మునిసిపాలిటీలో ఎగరని కాషాయ జెండా

## రెండు మునిసిపాలిటీలలో స్వతంత్రుల మద్దతు కోసం ఆశలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** మున్సిపల్ ఎన్నికల్లో భారీ అంచనాలతో బరిలోకి దిగిన బిజెపి ఆశించిన ఫలితాలు సాధించలేకపోయింది. పురపోరులో బిజెపి ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. రాష్ట్రంలో తామే ప్రత్యామ్నాయమని చెప్పుకుంటున్న బిజెపి రాష్ట్రనాయకత్వానికి తాజా మున్సిపల్ ఫలితాలు మింగుడుపడడం లేదు. గత మున్సిపోల్స్‌లో కంటే ఈసారి గెలిచిన కౌన్సిలర్లు, కార్పొరేటర్ల సంఖ్య పెరిగిన ఒక్క మున్సిపాలిటీ, కార్పోరేషన్ కూడా బీజేపీ ఖాతాలో పడలేదు. స్వతంత్రులు మద్దతు ఇస్తేనే ఒకటి రెండుచోట్ల మున్సిపాలిటీలపై కాషాయ జెండా ఎగిరే పరిస్థితి నెలకొంది. అదే సమయంలో పార్టీ ఢిల్లీ అధిష్టానం సైతం మున్సిపోల్స్ ఫలితాలపై తీవ్ర అసంతృప్తితో ఉంది. పార్టీ ప్రజాప్రతినిధులు ఉన్న చోట్లకూడా ఒక్క మున్సిపాలిటీ కూడా దక్కకపోవడంపై ఢిల్లీ కమలం పెద్దలు ఆగ్రహం వ్యక్తం చేస్తుండడంతో బీజేపీ తెలంగాణ నాయకత్వం ఆత్మరక్షణలో పడిందన్న చర్చ సాగుతోంది. రాష్ట్రంలో బిజెపికి పార్టీకి 8మంది ఎంపీలు, 8మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ఆ పార్టీ అన్నిచోట్ల పోటీ చేసింది. అయినప్పటికీ కరీంనగర్, నిజామాబాదన కార్పోరేషన్లు మినహా కమలం పార్టీ మిగతా కార్పోరేషన్లు, మున్సి పాలిటీల్లో ప్రభావం చూపలేకపోయింది. మేడ్చల్ మల్కాజిగిరి, చేవెళ్ల, మెదక్ లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని మున్సి పాలిటీలలో ఆ పార్టీ ఘోర ఓటమిని చవిచూసింది.బిజెపికి ఎమ్మెల్యేలు ఏడుగురు తమ నియోజకవర్గాల పరిధిలోని ఒక్క మున్సిపాలిటీనైనా సొంతం చేసుకోలేకపోవడం ఆ పార్టీ శ్రేణులను కుంగదీస్తోంది. పట్టణ ప్రాంతం ఎన్నికలు కావడంతో ప్రజలు ఆదరిస్తారని భావించిన కమలనాథులు ప్రచారానికి పార్టీ జాతీయ అధ్యక్షుడు నబీన్ నితీన్‌ను సైతం తీసుకొచ్చారు. దీంతో పార్టీకి కొంత ఊపు వచ్చినా ఎన్నికలఫలితాల్లో మాత్రం భంగపడ్డారు. రెండు కార్పొరే >>2



ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన సంత్ సేవాలాల్ కార్యక్రమానికి హాజరైన బంజారా మహిళలు

# పాలకులం కాదు..సేవకులం

>> చేశాను అని చెప్పారు. పేదల ఇళ్ళకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నాం..50 లక్షల పేదల ఇళ్లలకు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం అని చెప్పారు. 2 ఏళ్లలో రూ. 9000 కోట్ల రూపాయలు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కోసం ఖర్చు పెట్టామని తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ.1000 కోట్లతో సోలార్ విద్యుత్ ప్లాట్‌లు ఏర్పాటు చేయిస్తున్నాం. ఇందులో గిరిజన మహిళలు లబ్ది పొందుతున్నారు చెప్పారు. హాస్టల్స్‌లో మెస్ చార్జీలు,కాస్మొటిక్స్ చార్జీలు పెంచాం..గ్రూప్ 1 పైన అక్రమ కేసు వేస్తే కోర్ట్ కు వెళ్లి పోరాడి పలితాలు ప్రకటించాం.గ్రూప్1 లో 87శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఉద్యోగాలు వచ్చాయన్నారు. ఇది సమాజంలో వచ్చిన మార్పు.. మార్పు వల్ల మీ జీవితాల్లో వెలుగులు రావాలన్నదే నా ఆలోచన అని పేర్కొన్నారు. 2 ఏళ్ల లో 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశాం అనుమానం ఉంటే లెక్క పెట్టి చూసుకోవాలి అని పేర్కొన్నారు. ఇందిరాగాంధీ ఎస్టీలకు రిజర్వేషన్లు ఇచ్చారు..అసైన్డ్ పట్టాల రూపంలో గిరిజనలకు భూములు ఇచ్చారు అని చెప్పారు.అయితే, ప్రభుత్వం దగ్గర ఇవ్వడానికి భూములు లేవు. నాణ్యమైన విద్య ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది అని చెప్పారు. విద్యార్థులు కష్టపడి చదువుకోవాలి గిరిజన విద్యార్థులలో స్ఫూర్తిని నింపడం కోసమే ఆ వర్గానికి చెందిన అధికారులకు మంచి పోస్ట్‌లు ఇచ్చామని చెప్పారు. నిర్దిష్టమైన ప్రణాళికతో చదువుకోవాలి..చదువు లేక పోవడం వల్ల నే పేదరికంలో మిగిలిపోతున్నారు..చదువే అన్ని హోదాలు తెచ్చి పెడుతుంది..చదువు కుంటే సమాజానికి ఉపయోగపడతారు..మీ చదువుకు ఏం కావాలో నాకు చెప్పండి అని లంబాడీలను కోరారు.నల్లమలలో సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహం కోసం 20 ఎకరాల భూమి కేటాయించాం. వచ్చే జయంతి అక్కడే జరుపుకుందాం..గిరిజన సంప్రదాయాలు దెబ్బతినకుండా నిర్మాణాలు ఉంటాయని తెలిపారు.

నేనే రాజు, నేనే మంత్రి అని కొందరు రాస్తున్నారు.. కొందరు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. కొంత మందికి ఇది జీర్ణం కాదు..అర్థం కాదు.. అర్థమైనా స్వీకరించే గొప్ప మనసు వాళ్లకు లేదు.నేనే రాజు,నేనే మంత్రి అని నేను మాట్లాడిన మాటలను వేరే విధంగా అర్థం చేసుకున్నారు.మున్సిపల్ ఎన్నికల పలితాలను దృష్టి లో ఉంచుకొనే నేనే రాజు,నేనే మంత్రి అని చెప్పాను. ముఖ్యమంత్రి నేనే,మునిసిపల్ మంత్రి నేనే..మునిసిపల్ ఎన్నికల పలితాలకు, గెలుపు,ఓటములకు నాదే బాధ్యత అని చెప్పాను, ఈ ఎన్నికల్లో ప్రతి ఫలితం నా పనితనానికి గీటు రాయి అని వివరించారు. ప్రజలకు సేవ చేయాలన్నదే నా ఉద్దేశ్యం,.కొంత మంది మేము పాలించ డానికే పుట్టాం అని భావిస్తున్నారు.మా పిల్లలు రాజ్యాలు ఏలాలి అన్న విధానం వాళ్లది అని పేర్కొన్నారు. సమాజంలో వెనుకబడిన వారి ని పాలనలో భాగస్వాములను చేయాలన్నదే నా ఆలోచన అని పేర్కొన్నారు.మున్సిపల్ ఎన్నికల్లో 90 శాతం పలితాలు మాకు అనుకూలంగా వచ్చాయి ..గెలిస్తే పొంగిపోవడం,ఓడితే కుంగిపోవడం లేదు..వచ్చే కాలం అంతా పేదల కోసమే పని చేస్తా అని చెప్పారు. 40 ఏళ్ల నుంచి ఎస్సీ వర్గీకరణ జఠిలం అయితే నేను ఆ సమస్యను పరిష్కరించాను.. బుడిగ జంగాలు మాకు ఎంబీబీఎస్ లో సీట్లు వచ్చాయని నా దగ్గరకు వచ్చారు..నేను చేసిన పని ఫలితాలను ఇస్తోంది అని చెప్పారు. రాష్ట్రంలో ఎస్సీ జనాభా 15 శాతం ఉంటే వారికి 30 శాతం పదవులు ఇచ్చాం.నలుగురు మంత్రులు,స్పీకర్ పదవి ఎస్సీ వర్గానికి ఇచ్చాం..సమాజంలో వస్తున్న మార్పు ను గుర్తిస్తున్నాం అని పేర్కొన్నారు. ఏ దళితుడినైతే ముఖ్యమంత్రిని చేస్తానని చెప్పి మోసం చేశాడో.

.ఆ దళితుడిని అధ్యక్షా అని మైక్ అడిగే పరిస్థితి తీసుకువచ్చా. దళితుడు రాష్ట్రాన్ని నడపలేరు..నేనైతేనే నడుపుతా అన్న వాళ్ల అధ్యక్షా అని పిలిచి మైక్ అడిగేలా దళితుడిని పైన కూర్చొపెట్టా.. ఇది ప్రజాస్వామ్యం గొప్పతనం..అంబేద్కర్ మనకు ఇచ్చిన ఆయుధం అని పేర్కొన్నారు. మాకు ఓటు వేయకుండా తప్పు చేశారని మమ్మల్ని కొందరు తప్పుపడుతున్నారు..ప్రజల తీర్పును అవమానించేలా మాట్లాడొద్దు అని బిఆర్ఎస్‌ను ఉద్దేశించి తప్పుపట్టారు.

# 'హరోం హరహర 'స్మరణతో వైభవంగా మహాశివరాత్రి

**హైదరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్రంలోని పలు శివాలయాలు శివనామస్మరణతో మారుమ్రోగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు పోటెత్తడంతో ఆలయాలు కిటకిటలాడాయి. ఆదివారం తెల్లవారుజాము నుంచే భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించి హర హర మహాదేవ.. శంభో శంకర అంటూ శివయ్య దర్శనానికి బారులు తీరారు. రాష్ట్రంలోని ప్రధాన ఆలయాలైన యాదగిరిగుట్ట, వేములవాడ, వరంగల్ వెయ్యి స్తంభాల గుడి, కొమురవెల్లి తదితర ఆలయాల్లఓ భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులు పరమేశ్వరుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు మహా శివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని మహాశివుడిని ప్రార్థిస్తున్నానన్న సీఎం, ఉపవాస పూజలు చేస్తున్న భక్తులకు శివయ్య ఆశీర్వాదం ఉండాలని ఆకాంక్షి ంచారు. కరీంనగర్ జిల్లా భీమేశ్వర ఆలయం భక్తులతో కిటకిటలాడుతోంది. స్వామివారికి ప్రభుత్వం తరఫున మంత్రి పొన్నం ప్రభాకర్ , ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పట్టు వస్త్రాలు సమర్పించారు. నల్గొండ జిల్లా పానగల్‌లోని ఛాయా సోమేశ్వరాలయంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పూజల్లో పాల్గొన్నారు. స్వామివారి కల్యాణ మహోత్సవానికి నూతన పట్టు వస్త్రాలు సమర్పించారు. మేళ్లచెరువు శ్రీ ఇష్టకామేశ్వరి సమేత స్వయంభూ శంభు లింగేశ్వర స్వామిని మంత్రి ఉత్తమ్ దర్శించుకున్నారు. స్వామివారికి పట్టు వస్త్రాలుసమర్పించారు. యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ అనుబంధం ఆలయమైన శివాలయంలో శివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు శివాలయంలోని పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. కల్యాణోత్సవంలో ఆలయ ఈవో భవాని శంకర్, ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు. వరంగల్ వేయిస్తంభాల ఆలయంలోనూ భక్తుల కోలాహలం నెలకొంది. హనుమకొండలోని సిద్ధేశ్వర స్వామి దేవాలయంలో భక్తుల సందడి నెలకొంది. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కుటుంబ సమేతంగా గరళాకంఠుడిని దర్శించుకున్నారు. హైదరాబాద్ వనస్థలిపురంలోన భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి ఆలయం, కీసరగుట్ట ఆలయాలకు భక్తులు పోటెత్తారు.

# దేశంలోనే తొలిసారి.. విత్తన సొసైటీలు

>> ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. రాష్ట్రంలో విత్తన ఉత్పత్తి, పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయాల్సి ఉందని, అందుకు ప్రత్యేకంగా రైతులతోనే సహకార సంఘాలను కూడా ఏర్పాటు చేయాలని ఆ నివేదిక పేర్కొంది. ఈ నివేదికను పరిశీలించిన ప్రభుత్వం వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి ప్రతిపాదనలు కోరింది. ఆ తరువాత అగ్రివర్సిటీ అధికారులు నాబార్డుతో చర్చలు జరిపారు. వ్యవసాయ రంగ ప్రోత్సాహక నిధి కింద గ్రాంటు ఇచ్చేందుకు నాబార్డుతో చర్చలు జరిపారు. వ్యవసాయ రంగ ప్రోత్సాహక నిధి కింద గ్రాంటు ఇచ్చేందుకు నాబార్డు ముందుకు వచ్చింది. ఆ మేరకు విత్తన సహకార సంఘాల ఏర్పాటుకు అగ్రివర్శిటీ ప్రతిపాదనలు సమర్పించింది. కాగా పంటల సాగులో రైతులు ప్రధానంగా నకిలీ విత్తనాల సమస్యను ఎదుర్కొంటూ పంట నష్టాలను చవి చూస్తున్నారు. ప్రతీ వానాకాలం, యాసంగి సీజనులో రైతాంగం నకిలీ, నాసిరకం విత్తనాలతో భారీగా నష్టపోతున్నారు. ఈ నకిలీ విత్తనాలకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలు తీసుకొస్తున్నా, వాటిలోని లొసుగులను ఆధారంగా చేసుకుని ప్రతీ సీజన్లలోనూ మార్కెట్లలోకి ప్రవేశిస్తూ రైతులను నష్టాలపాల్చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం విత్తన సహకార సంఘాలను ఏర్పాటుకు సిద్దపడుతోంది. రైతులు ఎదుర్కొంటున్న నకిలీ విత్తనాల బెడదను నివారించడంతోపాటు అన్నదాతలకు అన్నివిధాల లబ్ధి చేకూర్చడమే ఈ ప్రాజెక్టు లక్ష్యమని, పంటల దిగుబడిని పెంచేందుకు, రైతులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఈ విధానం దోహదపడుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

# రెండు రోజుల్లో రైతు భరోసా

>> రైతులకు ఎకరానికి రూ.6 వేల చొప్పున రూ.8,744.13 కోట్లు రైతు భరోసా పథకం కింద నగదు బదిలీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 1,45,73,000 ఎకరాలకు రైతు భరోసా చెల్లించారు. కేవలం 9 రోజుల వ్యవధిలో సుమారు రూ.9 వేల కోట్లు రైతులకు పంపిణీ చేశారు. ఆ లెక్క ప్రకారమే ఈ యాసంగిలో కూడా రైతు భరోసా చెల్లించనున్నారు. ఇందుకు గాను ఈనెల 10వ తేదీన ప్రభుత్వ సెక్యూరిటీ బాండ్లను తనఖా ద్వారా బహిరంగ వేలంలో రూ.9 వేల కోట్ల రుణం తీసుకుంది. ఈ మొత్తాన్ని రైతు భరోసాకే కేటాయించినట్లు తెలిసింది. కాగా సంక్రాంతికే సర్కారు రైతు భరోసా చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అయితే నిధుల సర్దుబాటు కాని కారణంగా రిపబ్లిక్ డే రోజున విడుదల చేసే ఆలోచన చేశారు. మరోపక్క పంటలు సాగు చేసిన రైతులకే రైతు భరోసా ఇవ్వాలనే నిర్ణయంతో చేసిన శాటిలైట్ సర్వేలో జాప్యం జరిగింది. శాటిలైట్ సర్వే నివేదిక తదుపరి దాని ఆధారంగా పంట భూములను గుర్తిస్తోంది. ఈ శాటిలైట్ సర్వే వల్ల రైతు భరోసా నిధుల విడుదలలో జాప్యం జరుగుతోంది. శాటిలైట్ సర్వే వివరాలు ఇప్పటికే కంప్యూటర్లలో స్టోర్ అయినాయి.



మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కీసరగుట్టలోని శ్రీ రామలింగేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి కోమటిరెడ్డి

# పట్నంలో కమిలిన 'కమలం'

>> షన్లు, 49 మున్సిపాలిటీల్లో కనీసం ఒక డివిజన్, వార్డును సైతం గెలవలేకపోయారు. బిజెపి ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తున్న ఆర్మూర్ నియోజకవర్గ ప్రజలు ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డికి ఝలక్ ఇచ్చారు. 36 స్థానాల్లో బీజేపీ కేవలం 8 స్థానా ల్లోనే గెలుపొందింది. సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు సైతం ఏ మాత్రం ప్రభావం చూపలేకపోయారు. కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో 30 స్థానాలకుగాను బిజెపి 5 స్థానాల్లోనే గెలిచింది. కామారెడ్డిలో బిజెపి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డికి ఎదురుగాలి తగిలింది. మొత్తం 49 స్థానాలున్న ఈ మున్సిపాలిటీలో బీజేపీ కేవలం 16 స్థానాలకే పరిమితమైంది. ఇక్కడ బీఆర్ఎస్ 11, కాంగ్రెస్ 19 స్థానాల్లో గెలుపొందింది. ముథోల్ నియోజకవర్గ పరిధిలోని భైంసా మున్సిపాలిటీలోని 26 స్థానాల్లో కమలనాథులు కేవలం 6 స్థానాల్లోనే గెలుపొందారు. ఆర్మూర్, సిర్పూర్, ముథోల్‌లో కమలం చతికిలపడ్డింది. మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ఇలాకా పాలమూరు కార్పొరేషన్‌లోనూ మెజార్టీ సీట్లు వస్తాయని భావించినా 10 సీట్లతోనే సరిపెట్టుకున్నది. నిర్మల్ మున్సిపాలిటీలో మొత్తం 42 స్థానాల్లో బీజేపీ కేవలం 13 స్థానాల్లోనే గెలుపొందగా, కాంగ్రెస్ 24 స్థానాల్లో విజయం సాధించింది. కేంద్రమంత్రి బండి సంజయ్ ఇలాకాకరీంనగర్ కార్పొరేషన్‌లో కమలం పార్టీ సత్తాచాటింది. 66 డివిజన్లకు గాను 30చోట్ల బీజేపీ గెలిచింది. నిజామాబాద్ కార్పొరేషన్‌లో ఎంపీ ధర్మపురి అర్వింద్ బీజేపీ అభ్యర్థుల గెలుపును ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో అక్కడ పెద్దపార్టీగా అవతరించింది.బీజేఎల్పీ ఉపనేత పాయల్ శంకర్‌సైతం తమ నియోజకవర్గంలో పట్టు నిలుపుకున్నారు. ఆదిలాబాద్ మున్సిపాలిటీలో 49 వార్డులు ఉండగా బిజెపి 21 స్థానాల్లో విజయం సాధించి అతిపెద్ద పార్టీగా అవతరించింది.మ్యాజిక్ ఫిగర్‌కు 25 సీట్లు అవసరం ఉండగా ఇక్కడ ఐదుగురు స్వతంత్రులు గెలిచారు. వారు కమలం గూటికి చేరేందుకు సిద్ధమైనట్లు తెలిసింది.

**స్వతంత్రులు సహకరిస్తే మూడు మున్సిపాలిటీలు సొంతం...**

ఆదిలాబాద్ మున్సిపాలిటీలో 49 డివిజన్లు ఉండగా 21 డివిజన్లలో బీజేపీ గెలిచింది. నలుగురు సభ్యుల మద్దతు లభిస్తే చైర్మన్ సీటు సొంతమవుతుంది. అలాగే మెట్‌పల్లిలో 26 డివిజన్లకుగాను 10సీట్లలో విజయం సాధించారు. మరో ముగ్గురు అభ్యర్థులు సహకరిస్తేనే చైర్మన్ పీఠాన్ని దక్కించుకుంటారు. నారాయణపేట మున్సిపాలిటీలో 24 డివిజన్లకు గాను 11 డివిజన్లలో కాషాయం జెండా ఎగిరింది. ఇక్కడ ఒకరు మద్దతు పలికితే చైర్మన్ సీటును కైవసం చేసుకోవచ్చు. స్వతంత్రులు నలుగురు గెలిచారు. వారికి అధికార, ప్రతిపక్ష పార్టీలు ప్రలోభ పెట్టకుండా పార్టీ పెద్దలు అప్రమత్తమయ్యారు.

# కొత్త బడ్జెట్ రూ.3.25 లక్షల కోట్లు!

>> పూర్తిగా భిన్నంగా ఉంటున్నాయనే వాదన ఉంది. 2024-25 బడ్జెట్‌ను చూస్తే ఆ ఏడాది రూ.2.91 లక్షల కోట్లుగా వార్షిక బడ్జెట్‌ను అంచనా వేశారు. కానీ తరువాత దానిని దాదాపు రూ.2.65 లక్షల కోట్లకు కుదించారు. అలాగే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26కు సంబంధించి రూ.3.04 లక్షల కోట్ల బడ్జెట్ కేటాయింపుల్లో కూడా కోత పడనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత వార్షిక బడ్జెట్ మరో నెల పదిహేను రోజుల్లో ముగియనుండగా, ఇది దాదాపు రూ. 2.73 లక్షల కోట్లకు చేరుకుందని ఆర్థిక శాఖ అధికారవర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇది అసలు అంచనా కంటే దాదాపు రూ.31 వేల కోట్లు తక్కువ. పన్ను వసూళ్లలో స్వల్ప వృద్ధి మరియు కేంద్ర బదిలీలు ఎక్కువగా ఉన్నప్పటికీ, ఆదాయ వసూళ్లు అంచనాల కంటే తక్కువగా ఉండటం వల్ల కోతలు పడ్డాయని ఆర్థిక శాఖ వర్గాలు పేర్కొన్నాయి. ఇటువంటి సవరణలు సర్వసాధారణమే అయినప్పటికీ, మరోపక్క ఈ సంవత్సరం పెరుగుతున్న అప్పులు తీవ్రమైన ఆందోళనగా మారాయని అధికారులు అంగీకరిస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26 మూడు క్వార్టర్లు పూర్తయ్యే నాటికి, ఖర్చు దాదాపు రూ.1.77 లక్షల కోట్లుగా ఉంది. ఇది ఆర్థిక బడ్జెట్ అంచనా రూ.3.04 లక్షల కోట్లలో 60 శాతం కంటే తక్కువ. పన్నుయేతర ఆదాయాలు 22.5 శాతానికి పైగా బాగా వెనుకబడ్డాయి. అదే సమయంలో, అంతరాలను తగ్గించడానికి మార్కెట్ రుణాలు, కేంద్ర గ్రాంట్లు, నిధులపై ఆధారపడటం తప్పనిసరి అని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుత సంవత్సరంలో రుణాలు వార్షిక బడ్జెట్ అంచనాలను 122 శాతం అధిగమించగా, కేంద్ర గ్రాంట్లు బడ్జెట్ అంచనాలలో 16 శాతం మాత్రమే ఉన్నాయి. డిసెంబర్ నాటికి వార్షిక పన్ను లక్ష్యాలలో దాదాపు 65 శాతం సాధించబడ్డాయి. అయితే ప్రస్తుత చివరి త్రైమాసికంలో ఆదాయం సమకూరడంలో భారీ పురోగతి ఉండే అవకాశాలు ఉన్నాయనే అంచనాలు ఉన్నాయి. మరోపక్క ప్రభుత్వం రిజిస్ట్రేషన్లు, వాణిజ్యపన్నులు, ఎక్సైజ్, మైనింగ్ మరియు భూమి అమ్మకాల తదితర వాటిలో ఆదాయాన్ని మెరుగుపరచాలని పట్టుదలతో ఉంది. ఈ నేపథ్యంలోనే 2026-27 వార్షిక అంచనా బడ్జెట్‌ను భారీగా రూపొందించనున్నట్లు తెలుస్తోంది.

# మేయర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్ల ఎన్నిక నేడే

>> పాటు స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందిన మాజీద్ హుస్సేన్ కూడా మంత్రుల సమక్షంలో కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీలో చేరిన కార్పొరేటర్లు మాట్లాడుతూ కరీంనగర్ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని బలంగా నమ్ముతున్నామని పేర్కొన్నారు. అభివృద్ధి కాంక్షించి కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు చెప్పారు. తాజా పరిణామాలతో కాంగ్రెస్ కార్పొరేషన్ మేయర్ పీఠం ఎవరికి దక్కుతుందనే ఉత్కంఠ సర్వత్రా నెలకొంది. కరీంనగర్ కార్పొరేషన్‌లోని మొత్తం 66 డివిజన్లలో 30 సాధించి బిజెపి పెద్ద పార్టీగా అవతరించింది. కాంగ్రెస్‌కు 14,బిఆర్ఎస్‌కు 9,ఎంఐఎంకు 3 దక్కగా 10 మంది ఇండిపెండెంట్లు ఉన్నారు. ఈ ఎన్నికల్లో ఎక్స్ అఫిషియో సభ్యులు ముగ్గురు ఓట్లు వేయనున్నారు. దీంతో ఇక్కడ మేయర్ పీఠాన్ని సాధించాలంటే 35 మంది సభ్యుల బలం కావాలి. కాంగ్రెస్ పక్కగా పావులు కదిపితే కరీంనగర్ మేయర్ పదవి కాంగ్రెస్‌కే దక్కే అవకాశం ఉంది. కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికలపై తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కరీంనగర్ మేయర్ ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ కూడా పోటీలో ఉందని స్పష్టం చేశారు. ప్రస్తుతం కరీంనగర్‌లో చివరి నిమిషంలో రాజకీయ సమీకరణలు శరవేగంగా మారిపోతున్నాయి. కరీంనగర్ మేయర్ పీఠం ఎవరిదో సోమవారం రోజు తేలిపోతుందని పేర్కొన్న పొన్నం ప్రభాకర్.. మేయర్ పీఠాన్ని దక్కించుకునే రేసులో హస్తం పార్టీ ముందుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కరీంనగర్‌లో బీజేపీకి ఎక్కువ స్థానాలు రాగా.. మేయర్ ఎన్నికలు గెలవాలని కేంద్రమంత్రి బండి సంజయ్ నేతృత్వంలో అన్ని ప్రయత్నాలు చేస్తున్న వేళ.. మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలు ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో పెను సంచలనంగా మారాయి. కాగా, మున్సిపాలిటీ చైర్మన్,కార్పొరేషన్ మేయర్ ఎన్నికలపై జాగ్రత్తలు తీసుకునేందుకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆదివారం రాత్రి జిల్లాల్లో ఉన్న మంత్రులు,కీలక నేతలతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. హంగ్ ఉన్న చోట మేయర్,చైర్మన్ పదవులు కాంగ్రెస్‌కు దక్కేలా వ్యూహాత్మకంగా వెళ్లాలని దిశానిర్దేశం చేశారు. అవసరమైతే ఇండిపెండెంట్లను పార్టీలో చేర్చుకోవాలని సూచించారు. జూమ్ మీటింగ్ సందర్భంగా టిపిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ కూడా పాల్గొన్నారు. వివిధ శిబిరాల్లో ఉన్న ఆయా రాజకీయ పార్టీ కౌన్సిలర్లు, కార్పొరేటర్లు క్యాంప్‌లను వీడి మున్సిపల్,కార్పొరేషన్ కార్యాలయాలకు సోమవారం ఉదయం చేరుకోనున్నారు. వారు కౌన్సిలర్లు,కార్పొరేటర్లుగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. తర్వాత చైర్మన్,మేయర్ ఎన్నికల్లో పాల్గొంటారు. ఈ నేపథ్యంలో హంగ్ ఉన్న చోట్ల అత్యధిక చైర్మన్,మేయర్ పదవులను దక్కించుకునేందకు వ్యూహాత్మాకంగా ముందుక వెడుతోంది.

రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాలిటీల్లో 2,594 మంది కౌన్సిలర్లు, కార్పొరేషన్లలో 414 మంది కార్పొరేటర్లుగా గెలిచారు. వీరు ఆయా మున్సిపాలిటీలకు, కార్పొరేషన్ల భవనాలకు వెళ్లి సోమవారం ఉదయం 11 గంటలకు ప్రమాణ స్వీకారం చేస్తారు. ప్రమాణ స్వీకారం ముగిసిన తర్వాత మధ్యాహ్నం పన్నెండున్నర గంటలకు మున్సిపల్ ఛైర్‌పర్సన్లు, వైస్ ఛైర్‌పర్సన్లు, కార్పొరేషన్ మేయర్లు, డిప్యూటీ మేయర్ల ఎన్నిక ప్రక్రియ ప్రారంభం కానుంది. పరోక్ష ఎన్నిక ప్రక్రియపై రాష్ట్ర ఎన్నికల సంఘం విధివిధానాలను వెల్లడించింది. ఎన్నిక నిర్వహించడానికి మొత్తం కౌన్సిలర్లు, కార్పొరేటర్లలో కనీసం సగం మంది ఉంటేనే కోరంగా పరిగణిస్తారు. ఒకవేళ కోరం లేకపోతే ఛైర్ పర్సన్, మేయర్ ఎన్నిక మరుసటి రోజుకు వాయిదా వేస్తారు. ఆ రోజు కూడా కోరం లేకపోతే రాష్ట్ర ఎన్నికల సంఘానికి నివేదిస్తారు. ఆ తర్వాత మరో రోజును ఖరారు చేసి, అప్పుడు కోరం లేకపోయినప్పటికీ ఎన్నిక నిర్వహిస్తారు.రిజర్వేషన్ల ప్రకారం ఛైర్‌పర్సన్‌లు, మేయర్‌లను ఎన్నుకుంటారు. వైస్ ఛైర్‌పర్సన్, డిప్యూటీ మేయర్లకు రిజర్వేషన్లు వర్తించవు. మున్సిపల్ ఛైర్‌పర్సన్లు, వైస్ ఛైర్‌పర్సన్లు, కార్పొరేషన్ మేయర్లు, డిప్యూటీ మేయర్ల ఎన్నిక కోసం ఒకరే పోటీలో ఉంటే ఏకగ్రీవంగా ప్రకటిస్తారు. ఒకరి కంటే ఎక్కువ మంది పోటీలో ఉంటే ఎన్నిక నిర్వహిస్తారు. ముందుగా ఛైర్‌పర్సన్, మేయర్, ఆ తర్వాత వైస్ ఛైర్‌పర్సన్, డిప్యూటీ మేయర్ ఎన్నిక నిర్వహిస్తారు. ఒకవేళ ఏదైనా కారణంతో ఛైర్‌పర్సన్, మేయర్ ఎన్నిక నిర్వహించలేకపోతే, వైస్ ఛైర్‌పర్సన్, డిప్యూటీ మేయర్ ఎన్నిక కూడా వాయిదా వేస్తారు. కౌన్సిలర్లు లేదా కార్పొరేటర్లు చేయి ఎత్తి ఓటు వేయాలి. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, లోక్‌సభ, రాజ్యసభ సభ్యులకు ఎక్స్‌అఫీషియో సభ్యులుగా ఓటు హక్కు ఉంటుంది. ఎమ్మెల్యేలు, లోక్‌సభ సభ్యులు తమ నియోజకవర్గం పరిధిలోని ఏదైనా ఒక మున్సిపాలిటీలో ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఉండవచ్చు. ఎమ్మెల్సీలు, రాజ్యసభ సభ్యులు తమకు ఓటు ఉన్న మున్సిపాలిటీ లేదా కార్పొరేషన్‌లో మాత్రమే ఎక్స్ అఫీషియో సభ్యుడిగా నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. కౌన్సిలర్లు లేదా కార్పొరేటర్లతో పాటు ఎక్స్‌అఫీషియో సభ్యులు ఓట్లు వేసిన తర్వాత సమానంగా ఓట్లు ఉన్నట్లయితే లాటరీ ద్వారా విజేతను ప్రకటిస్తారు. ఒక్కో అభ్యర్థి పేరు 5 పేపర్లపై రాసి, అన్నీ కలిపేసి స్థానిక ఎన్నికల అధికారి లాటరీ తీస్తారు. అందులో ఎవరి పేరు వస్తే వారే విజేత. రాజకీయ పార్టీలకు విప్ జారీ చేసే అధికారం ఉంటుంది.కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, సీపీఐ, సీపీఎం, ఎంఐఎం సహా 13 పార్టీలకు విప్ జారీ చేసే అవకాశం ఉంది. విప్ జారీ చేస్తే సోమవారం ఉదయం 11 గంటల్లోపు స్థానిక ఎన్నికల అధికారికి ఆయా పార్టీలు సమాచారం ఇవ్వాలి. పార్టీల అభ్యర్థులుగా గెలిచిన వారు విప్‌ను కచ్చితంగా పాటించాల్సి ఉంటుంది. ఒకవేళ విప్ ధిక్కరిస్తే ఆ పార్టీ మూడు రోజుల్లోగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయవచ్చు. ఆరోపణలు ఎదుర్కొంటున్న అభ్యర్థికి నోటీసులిచ్చి వివరణ కోసం వారం రోజులు గడువు ఇచ్చి ఆ తర్వాత రెండు రోజుల్లో తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.

# రాజ్యసభకు జస్టిస్ సుదర్శన్‌రెడ్డి?

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి**

**హైదరాబాద్,ఫిబ్రవరి15:** తెలంగాణలో ఈ ఏడాది రెండు రాజ్యసభ స్థానాలు ఖాళీ కాబోతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి దృష్టి సారించినట్లు సమాచారం. బిఆర్ఎస్ సభ్యుడు కెఆర్ సురేశ్‌రెడ్డి, కాంగ్రెస్ సభ్యుడు అభిషేక్ సింఘ్వీ వచ్చే ఏప్రిల్‌లో పదవి విరమణ చేయబోతున్నారు. అసెంబ్లీలో ఉన్న బలాబలాల మేరకు ఈ రెండు స్థానాలు కాంగ్రెస్ తన ఖాతాలో వేసుకోవాలనే లక్ష్యంగా పెట్టుకుందని తెలుస్తోంది. ఈ రెండు స్థానాలు ఎవరికి ఇవ్వాలనే విషయంలో హైకమాండ్ పరిశీలనలు చేస్తుండగా ఒకటి జాతీయ స్థాయి,మరొకటి తెలంగాణ మూలాలు కలిగిన వ్యక్తికి ఇవ్వాలనే యోచనలో ఉన్నట్లు తెలిసింది. ఇందులో భాగంగా ఒక స్థానానికి ఇండియా కూటమి తరఫున రాష్ట్రపతి బరిలో ఉన్న జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి,మరొక స్థానానికి తిరిగి అభిషేక్ మను సింఘ్వీ పేర్లను పార్టీ పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే ఇటీవల ఢిల్లీ పర్యటన సందర్భంగా సుదర్శన్‌రెడ్డి అభ్యర్థిత్వంపై సిఎం అధిష్ఠానం పెద్దలతో చర్చించారని తెలుస్తోంది. అలాగే సుద ర్శన్‌రెడ్డితో పాటు సిఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి పేరు సైతం రాజ్యసభ రేస్‌లో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

## వారం - వర్జ్యం

16-02-2026, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, కృష్ణపక్షం, ధనిష్ఠ కార్తె
చతుర్దశి సా.5.30
శ్రవణ రా.8.44
వర్జ్యం : రా.12.48-2.26
దు.మ.12.46-1.32
2) మ.3.05-3.51
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం:** అనూహ్యంగా స్థిరాస్తుల ధరలు పెరుగుతాయి. రహస్యచర్చలు ఫలిస్తాయి. ఇతరులను ఆదుకుంటారు.

**వృషభం:** జీవితభాగస్వామితో ఏర్పడిన వివాదాలు పరిష్కారమవుతాయి. అనుకోని ఆహ్వానాలు అందుతాయి. వాహనసౌఖ్యం.

**మిథునం:** ఎంతో శ్రమిస్తేగాని ఫలితం దక్కదన్న సత్యాన్ని తెలుసు కుంటారు. రాజకీయత్నాలు ఫలిస్తాయి.

**కర్కాటకం:** దైవం తోడు ఉంటే కాలం కలిసివస్తుందని సమయం కోసం వేచి ఉంటారు.శ్రమ అధికంగా వుంటుంది.

**సింహం:** సంతాన అభివృద్ధికి ఎంతో కృషి చేస్తారు. పూర్వంకన్నా భిన్నంగా ప్రవర్తిస్తారు. వస్తువులు కొనుగోలుచేస్తారు.

**కన్య :** దైనందిన జీవితంలో మార్పులు చేస్తారు. ఆ మార్పులు కలిసివస్తాయి. సొంత ఆలోచనలు మేలుచేస్తాయి.

**తుల :** భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని గతంలో వద్దనుకున్న అవకాశాలు తిరిగి అనుకూలం చేసుకుంటారు.

**వృశ్చికం:** పలు విషయాలలో అభిప్రాయ భేదాలు వాగ్వివాదాలు సంభవించడం చికాకు కలిగిస్తుంది.

**ధనుస్సు:** ఆరోగ్యపరంగా తీసుకునే జాగ్రత్తలు మంచి ఫలితాలనిస్తాయి. ఆర్థిక ఇబ్బందులు అధిగమిస్తారు.

**మకరం:** కలిసివచ్చిన, పొదుపుచేసిన ధనాన్ని పెట్టుబడి రూపంలో చూసుకోవలసి ఉంటుంది.శుభవార్తలు అందుకుంటారు.

**కుంభం:** మీ కృషివల్ల మీరు సుఖపడక పోయినా మీవాళ్ళు సౌఖ్యంగాఉంటారు. ఇతరులకు సాయంచేసి విరోధి అవుతారు.

**మీనం:** వాతావరణంలో వచ్చే మార్పులు, ప్రభుత్వ విధానాలు ఆందోళన కలిగిస్తాయి. క్రయవిక్రయాలలో ప్రోత్సాహం లభిస్తుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



శ్రీ లక్ష్మీ నరసింహస్వామి అఖండ జ్యోతి రథయాత్రను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, చిత్రంలో యాదగిరిగుట్ట ఈవో భవానీశంకర్. డిప్యూటీ ఈవో డి.బాస్కరశర్మ తదితరులు

# రూ. 600 కోట్లు మంజూరు

>> భువనగిరి ఎంపి చామల కిరణికుమార్‌రెడ్డి, యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఈవో భవానీశంకర్. డిప్యూటీ ఈవో డి.బాస్కరశర్మ, ఆలయ ధర్మకర్త నరసింహమూర్తి, ఆఖండ జ్యోతియాత్ర కమిటీ చైర్మన్ ఎస్.వెంకటరెడ్డి, అధ్యక్షుడు ఎం.చంద్రశేఖర్‌రావు. గౌరవ సలహాదారుడు పడాల శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి దిడ్డి బాలాజీ, సహాయ కార్యదర్శి బొమ్మల సుధీష్ కుమార్ కోశాధికారి ఎ.గణపతి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్.గౌతంరావు, మాజీ కార్పొరేటర్లు ఉడ్డి రాంబాబు. కన్నె ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

**18 నుంచి శ్రీ లక్ష్మీనరసింహా స్వామి బ్రహ్మోత్సవాలు..**

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహా స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు 18 నుంచి 28వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో భవానీశంకర్, డిప్యూటీ ఈవో డి.భాస్కరశర్మలు ఆదివారం బర్కత్‌పుర యాదాద్రిభవన్ వద్ద విలేకరులతో వారు మాట్లాడారు. స్వామివారి బ్రహోత్సవాలకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా భారీ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.ఈ నెల 18న అంకురారోపణముతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమై ఈ నెల 28న ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. ఈ నెల 24న స్వామివారి ఎదుర్కోలు మహోత్సవం 25 స్వామివారి కల్యాణ మహోత్సవం, 26న స్వామివారి దివ్య విమాన రథోత్సవం,28న స్వామివారి శృంగార డోలోత్సవం జరుగుతుందన్నారు.



# ఆకాశాన్నంటిన పళ్ల ధరలు!

### సాధారణ రోజుల్లో కంటే మూడింతల ధరలు పెంచిన వ్యాపారులు

### డజన్ అరటిపండ్ల ధర రూ.100కిపైగా

### కొబ్బరికాయలు సైతం రూ.50 పైనే

**హైదరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** మహా శివరాత్రి పర్వదినం రోజున సామాన్య భక్తులకు పండ్ల ధరలు చుక్కలు చూపించాయి. సాధారణంగా పండుగలు వస్తున్నాయంటే మార్కెట్‌లో పండ్ల ధరలు కొద్దిగా పెరగడం సాధారణమే. కానీ ఈ శివరాత్రి పండగ సందర్భంగా పండ్ల పండ్ల ధరలు అమాంతం ఆకాశాన్నంటాయి. ఆదివారం నాడు మహాశివరాత్రి పండుగ నేపథ్యంలో పండ్ల వ్యాపారస్తులు పండ్ల ధరలను అమాంతం పెంచి ప్రజల జేబులను ఖాళీ చేశారు. సాధారణ రోజుల్లో కంటే పండ్ల ధరలు మూడింతల మేర పెరగడంతో ఉపవాసం ఉన్న సామాన్య, పేద భక్తుల జేబులు ఖాళీ అయ్యాయి. సాధారణ రోజుల్లో రూ.40 ధర పలికన డజన్ అరటిపండ్లు ఆదివారం మహాశివరాత్రి సందర్భంగా డజన్ రూ.100కు పైగా పెరిగాయి. పుచ్చపండు రూ.100 నుండి రూ.160, ద్రాక్షపండ్లు కిలో రూ.200, ఆపిల్స్, ఆరెంజ్ పండ్లను రూ.100కు 3 చొప్పున విక్రయించారు. అలాగే జామ పండ్లను కూడా కిలో రూ.140 చొప్పున అమ్ముతూ జనాలను వ్యాపారులు అందినకాడికి దోచుకున్నారు. ఇక రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని చిలకలగూడ-సీతాఫల్‌మండి ప్రాంతంలో భక్తుల రద్దీతో ఆదివారం పండ్ల మార్కెట్‌లు, రహదారులు కిక్కిరిసిపోయాయి. ఉపవాస దీక్షలు, శివాలయాల్లో అభిషేకాలు నిర్వహించేందుకు అవసరమైన పండ్లు, కొబ్బరికాయలు, పూజా సామగ్రి కొనుగోలు చేసేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

చిలకలగూడ చౌరస్తా నుంచి సీతాఫల్మండి ఫ్లైఓవర్ వరకు రహదారి మొత్తం సందడిగా మారింది. రోడ్డు ఇరువైపులా తాత్కాలిక స్టాళ్లు ఏర్పాటు చేసిన చిరు వ్యాపారులు పండ్లు, కొబ్బరి కాయలు, అరటిపండ్లు, సేపులు తదితర వస్తువులను విక్రయించారు. అయితే, పండుగ రద్దీనిఅదనుగా భావించిన వ్యాపారులు ధరలను అమాంతం పెంచినట్లు భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. సాధారణ రోజుల్లో రూ.30-40కి లభించే అరటిపండ్లు డజన్‌కు రూ.120దాకా వసూలు చేశారు. ఇక కొబ్బరికాయలు కూడా రూ.10-15 వరకు అధిక ధరలకు అమ్ముడయ్యాయి.

యాపిల్స్, ద్రాక్ష వంటి పండ్ల ధరలు కూడా ఆకాశాన్నంటడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో శివరాత్రి పండుగ సందర్భంగా భక్తుల గిరాకీ పెరగడం సహజమేనని, కానీ మూడింతల ధరలు వసూలు చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై సామాన్య ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

మహాశివరాత్రి పండుగ నాడు పండ్లు కొనాలంటేనే భయం వేస్తుందని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పండ్ల ధరలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. సాధారణ రోజుల్లోనూ వివిధ రకాల పండ్ల ధరలపై సంబంధిత అధికారులు నిఘా ఉంచాలని, ధరలను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

# హైదరాబాద్‌లో రెండు రోజులపాటు డ్రంకన్ డ్రైవ్ దాడులు

### 415 మంది మందుబాబుల పట్టివేత

**హైదరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** జంట నగరాలలో శుక్రవారం, శని వారం రాత్రుల్లో ట్రాఫిక్ పోలీసులు పలుచోట్ల నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ దాడుల్లో మొత్తం 415 మంది మందు బాబులు పట్టుబడ్డారు. వీరిలో 341 మంది ద్విచక్ర వాహనదారులు, 27 మంది ఆటో డ్రైవర్లు, 47 మంది కార్ల డ్రైవర్లు వున్నారు. పట్టుబడ్డ 192 మంది 51 నుంచి 100 పాయింట్ల వరకు, 69 మంది 101 నుంచి 150 పాయింట్ల వరకు, 31 మంది 151 నుంచి 200 పాయింట్ల వరకు, 17 మంది 201 నుంచి 250 పాయింట్ల వరకు, ఆరుగురు 251 నుంచ 300 పాయింట్ల వరకు, 11 మం ది 300 పాయింట్లకు మించి విపరీతంగా మద్యం సేవించినట్లు తేలింది. వీరిని అరెస్టు చేసిన తరువాత వారి వాహనాలు జప్తు చేసి, కేసులు న మోదు చేశాక సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. వీరికి కౌన్సిలింగ్ నిర్వహించిన తరువాత కోర్టుల్లో హాజరు పరుస్తారు. కోర్టులు వీరికి శిక్షలు విధి స్తాయని నగర జాయింట్ ట్రాఫిక్ పోలీసు కమిషనర్ జోయల్ డేవిస్ ఆదివారం నాడు మీడియాకు తెలిపారు. జంట నగరాలలో డ్రంకన్ డ్రైవ్ దా డులు నిరంతరం కొనసాగుతాయని, వీటిని పూర్తిస్థాయిలో అరికడతామని ఆయన వెల్లడించారు.

# శివనామస్మరణతో మార్మోగిన శైవ క్షేత్రాలు

### ముఖ్యమంత్రి గోత్రనామాలతో అర్చన కార్యక్రమం నిర్వహించిన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**ఖమ్మం ప్రధాన ప్రతినిధి, ప్రభాతవార్త:** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్క రించుకుని రాష్ట్రవ్యాప్తంగా శైవక్షేత్రాలు శివనామస్మరణలతో మార్మోగి పోయాయి. తెల్లవారుజాము నుంచే శివాలయాల వద్ద భక్తుల రద్దీ నెలకొంది. ఓం నమశ్శివాయ జపాలతో ఆలయ ప్రాంగణాలు ఆధ్యాత్మిక కాంతితో నిండిపోయాయి. పరమేశ్వరుడి దర్శనం కోసం భక్తులు గంటల తరబడి క్యూల్లో నిల్చొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఖమ్మం జిల్లాలోని మధిరలో గంగా, పార్వతీసమేత మృత్యుంజయ స్వామి ఆలయంలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, నందిని దంపతులు ప్రజల శ్రేయస్సు కోరుతూ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, మంత్రులు గోత్రనామాలతో అర్చనలు, అభిషేకాలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క ప్రజా పాలనలో అమలుజరుగుతున్న సంక్షేమ కార్యక్రమాలకు ఎటువంటి ఆటం కాలు కలుగకుండా విజయవంతం కావాలని, పాలకవర్గంపై స్వామివారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ప్రార్థించారు. అలాగే కూసుమంచి మండలంలోని అతి పురాతన శైవ క్షేత్రమైన ఘనపేశ్వరాల ఆలయం, ఖమ్మం రూరల్ మండలం తీర్థాల గ్రామంలోని శ్రీశ్రీశ్రీ సంగీశ్వ రాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వేములవాడలోని ప్రసిద్ధ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. స్వామివారికి మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పట్టు వస్త్రాలు సమర్పించి భీమేశ్వరుని ఆశీస్సులు కోరారు. నల్గొండ జిల్లా పానగల్‌లోని ఛాయా సోమేశ్వరాలయంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పాల్గొని స్వామివారి కల్యాణోత్సవానికి పట్టు వస్త్రాలు సమర్పిం చారు. మేళ్లచెరువులోని ఇష్టకామేశ్వరి సమేత స్వయంభూ శంభు లింగేశ్వర స్వామి ఆలయంను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. యాదగిరిగుట్టలోని లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం అనుబంధ శివాలయంలో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి కల్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సంగారెడ్డి జిల్లా ఝరాసంగంలోని కేతకి సంగమేశ్వర ఆలయంకు భక్తులు ఇరుముడులతో తరలివచ్చి అమృ తగుండంలో స్నానాలు ఆచరించి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. నిర్మల్ జిల్లాలోనూ పలు శైవక్షేత్రాలు భక్తులతో కళకళలా డాయి. జగి త్యాల జిల్లాకు చెందిన సూక్ష్మ కళాకారుడు గుర్రం దయాకర్ సూదిపై నాగుపాము పడగ నీడలో కూర్చుని ఆశీర్వదిస్తున్న శివ య్య విగ్రహాన్ని రూపొందించి ఆధ్యా త్మిక స్ఫూ ర్తిని చాటాడు. హైదరాబాద్ వన స్థలిపురం లోని భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచే అభిషేకాలు, రుద్రార్చనలు కొనసాగాయి. భక్తులకు స్వామివారిని స్వహస్తాలతో తాకే అవకాశం కల్పించడంతో ఆనందభాష్పాలతో వారు పరవశించారు. మహా శివరాత్రి సందర్భంగా రాష్ట్రం అంతటా భక్తి, శాంతి, ఆధ్యాత్మిక ఉల్లాసం పరుచుకుని, శివతత్త్వ సందేశం ప్రతి హృదయంలో ప్రతిధ్వనించింది.



పురవీధుల్లో ఇంద్రవిమానం, సప్పరంపై దర్శనం ఇస్తున్న స్వామి అమ్మవార్లు

**రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని పరమశివుని వేడుకున్నా**

**వైరా రూరల్:** రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, రాష్ట్ర ఆదాయ వనరులు పెరిగి,, ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదిగి, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలని ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క ఆకాంక్షించారు. ప్రపంచంతో పోటీపడి స్థాయిలో తెలంగాణ రాష్ట్రం 2047 నాటికి!!! త్రి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను దాటి స్థాయిలో అభివృద్ధి చెందాలని ఆ పరమశివుని వేడుకున్నట్లు తెలిపారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఖమ్మం జిల్లా వైరా మండలం స్నానాల లక్ష్మీ పురం గ్రామంలోని ప్రసిద్ధశ్రీరామలింగేశ్వర స్వామి ఆలయాన్ని ఆయన దర్శించు కున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రజలందరికీ మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రతి కుటుంబం చల్లగా ఉండాలని, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలని ఆపరమశివుడిని ప్రార్థించినట్లు భట్టి పేర్కొన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రకృతి వైపరీత్యాలు లేకుం డా పాడిపంటలతో వర్ధిల్లాలని కోరుకున్నట్లు తెలిపారు.

**ఇంద్రవిమానంపై శ్రీకాళహస్తీశ్వరుడు**

**శ్రీకాళహస్తి, ప్రభాతవార్త:** మహాశివరాత్రి పర్వదినాన విశిష్ట వాహనమైన ఇంద్ర విమానంపై శ్రీకాళహస్తీశ్వరుడు భక్తజనానికి దర్శనం ఇచ్చారు. 12 సంవత్సరాలకోసారి శనివారం త్రయోదశి మాస శివరాత్రి, మహా శివరాత్రి వస్తుందని నమ్మకం. ఆరోజు ఈ యేడాది వచ్చింది. భక్తజన కోటిని అను గ్రహిస్తూ ఇంద్రవిమానంపై సర్వేశ్వరుడు విహరించారు. శనివారం ఉదయం స్వామి అమ్మవార్లను అలంకార మండపంలో విశిష్ట అలంకారం చేసి మంగళవాయిద్యాలు, మేళతాళాల మధ్య తీసుకువచ్చి స్వామివారిని ఇంద్రవిమానంపై, అమ్మవారిని సప్పరంపై కొలువుదీర్చి పట్టణపురవీధుల్లో అంగరంగ వైభవంగా గ్రామోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు.

# నాబార్డుకు సర్కార్ బకాయిల భారం

### రూ.7.39 లక్షల కోట్లకు చేరిన రుణాలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకు (నాబార్డు)కు ప్రభుత్వ రుణభారం తలకు మించిన భారంగా తయారయింది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న అప్పుల భరీగా పెరుగుతుండటం పట్ల నాబార్డు ఆందోళన చెందుతోంది. రాష్ట్ర తలసరి ఆదాయం పెరిగినంత వేగంగా రుణ భారం కూడా భారీగా పెరుగుతోందని నాబార్డు వెల్లడించింది. ఇటీవల నాబార్డు విడుదల చేసిన రాష్ట్ర ఫోకస్ పేపర్‌లో పలు ఆర్థిక విషయాలను గూర్చి ప్రభుత్వాన్ని అప్రమత్తం చేసింది.

ఇందులో భాగంగా 2014-15లో ప్రభుత్వ రుణ భారం రూ.72,658 కోట్లు ఉండగా, అది 2024-25 ఆర్థిక సంవత్సరం నాటికి రూ.7,38,707 కోట్లకు చేరింది. ఇదే సమయంలో రాష్ట్ర తలసరి ఆదాయం ఈ పదేళ్లలో అంటే 2014-15 ఆర్థిక సంవత్సరంలో రూ.1.24 లక్షల కోట్లు ఉండగా, 2024-25 ఆర్థికానికి అది రూ.3.79 లక్షల కోట్లుకు భారీగా పెరిగింది. మరోపక్క 2024-25 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర గ్రాస్ డొమెస్టిక్ ప్రొడక్టవిటీ (జీఎస్‌డిపి) ప్రస్తుత ధరల వద్ద రూ.16.41 లక్షల కోట్లు కాగా, నిరంతర ధరల వద్ద దాని వృద్ధి 8 శాతం దాటింది.

# జాతీయ రహదారిపై బైక్‌రైడర్ దుర్మరణం

### బాపట్ల ఈవెంట్‌లో పాల్గొని హైదరాబాద్ వస్తుండగా

### పెద్దకాపర్తి వద్ద బైక్‌ను ఢీకొన్న వాహనం



ధ్వంసమైన బిఎండబ్ల్యు బైక్



బైక్‌రైడర్ రితీష్‌రెడ్డి మృతదేహాన్ని ఘటనా స్థలం నుంచి తరలిస్తున్న పోలీసులు

**చిట్యాల రూరల్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త :** సెలవు దినాల్లో దూర ప్రాంతాలకు బైక్ రైడింగ్ చేస్తూ తమ అభిరుచిని పంచుకుంటున్న బైక్ రైడర్స్ గ్రూప్‌లో చోటుచేసుకున్న విషాద ఘటన స్థానికంగా కలచివేసింది. చిట్యాల మండలం పరిధిలోని పెద్దకాపర్తి శివారులో 65వ నంబరు జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ బైక్‌రైడర్ దుర్మరణం చెందాడు. చిట్యాల ఎస్ఐ మామిడి రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన చదురుప్పల రితీష్‌రెడ్డి (40) ఎపిలోని బాపట్లలో హార్లే డేవిడ్సన్ మోటార్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈవెంట్‌కు హైదరాబాద్‌కు చెందిన 32 మంది బైక్‌రైడర్స్‌తో కలిసి రెండు రోజుల క్రితం వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో హైదరాబాద్ వైపునకు వస్తుండగా పెద్దకాపర్తి శివారులోని 7 హోటల్స్ సమీపంలో గుర్తుతెలియని వాహనం రితీష్‌రెడ్డి ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ అదుపుతప్పి రహదారి పక్కన ఉన్న చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో రితీష్‌రెడ్డికి తలకు, శరీరానికి తీవ్రగాయాలై ఘటనా స్థలంలోని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్ల గొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు రోహిత్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు. రూ. 25 లక్షల విలువైన బిఎండబ్ల్యూ బైక్ పై ప్రయాణిస్తున్న రితీష్‌రెడ్డి హెల్మెట్ ధరించినప్పటికీ ప్రమాదతీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రాణా లను కోల్పోయాడు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటిస్తూ, నియమిత వేగంతోనే ప్రయాణించాలని పోలీసులు సూచించారు. రోడ్డు భద్రత పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వారు విజ్ఞప్తి చేశారు.

# కౌన్సిలర్ల క్యాంపులోకి పోలీసులను ఎందుకు పంపుతున్నారు?

### హాంగ్ ఉన్నచోట్ల గెలుపునకు కాంగ్రెస్ అరాచకాలు: బిఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 15:** మున్సిపాలిటీల్లో హాంగ్ ఉన్న చోట గెలుపు కోసం కాంగ్రెస్ అరాచకాలకు పాల్పడుతోందని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ విమర్శించారు. ఆదివారం ప్రవీణ్ మీడియాతో మాట్లాడుతూ..ఖి మున్సిపల్ ఎన్నికల్లో 30శాతం ఓట్లను బీఆర్ఎస్ కొల్లగొట్టింది. ప్రభుత్వంపై వ్యతిరేకత మొదలైం దన దానికి ఇదే ఉదాహరణ. పోలీస్ శాఖను సీఎం దగ్గర పెట్టుకుని తనకు అనుకూలంగా మార్చుకు న్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ కూడా మూడు రోజుల ముందే ఛైర్మన్లు, మేయర్ల ఎంపికకు నోటిఫికేషన్ ఇస్తోంది. కనీసం 15రోజుల ముందే షెడ్యూల్ ఇవ్వాలి. వారం రోజుల్లోనే అన్నీ పూర్తిచేసి ఎస్ఈసీ మమ అనిపిం చింది. కాంగ్రెస్ నేతలు ఎన్నికల కోడ్ ఉల్లంఘించినా వారికి ఈసీ నోటీసులు ఇవ్వలేదు. గెలుపు కోసం కాంగ్రెస్ అరాచకాలకు పాల్పడు తుందని మండిపడ్డారు. వారికి ఎన్నికల అధికారులు అండగా నిలిచారని అన్నారు. కోడ్ ఉల్లంఘించినా నోటీసులు ఎక్కడ కూడా ఇచ్చిన దాఖలాలు కనిపించడం లేదని తెలిపారు. వీడియో, ఆధారాలతో సహా చూపించినా సీఎం రేవంత్ రెడ్డికి నోటీసులు ఇవ్వలేదని విమర్శించారు. రేవంత్‌కు అనుకూలంగా ఎన్నికల కమిషన్ పనిచేస్తోంది అంటూ ఆర్ఎస్ ప్రవీణ్ ఫైర్ అయ్యారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ 30 శాతం ఓటు షేర్ నమోదు చేసుకుందని, ప్రభుత్వంపై వ్యతిరేకత మొదలైందనడానికి ఇదే ఉదాహరణ అని చెప్పారు. బీఆర్ఎస్‌కు 29 శాతం ఓట్లు వచ్చాయని ఈసీ ప్రకటించిందని, చరిత్రలో ఏ ప్రతిపక్ష పార్టీకి స్థానిక సంస్థల్లో ఇంత శాతం ఓటింగ్ రాలేదని పేర్కొన్నారు.సీఎం రేవంత్ రెడ్డి కీలక శాఖలను తన దగ్గరే పెట్టుకున్నారని, ప్రజాస్వామ్యాన్ని రేవంత్ రెడ్డి అపహాస్యం చేస్తున్నారని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి పాలనలో రియల్ ఎస్టేట్ కుప్పకూలిందని, రాష్ట్రానికి రెవెన్యూ రాబడి పూర్తిగా పడిపోయిందని తెలిపారు.

ఫార్ములా ఈ కార్ రేస్ కేసు గురించి మళ్లీ లీకులు ఇస్తున్నారని,.అదొక లొట్టపీసు కేసు అని ఇప్పటికే చెప్పామని అన్నారు. కాంగ్రెస్ ఎన్ని డైవర్షన్ రాజకీయాలు చేసినా ప్రజాపక్షం బీఆర్ఎస్ వైపే ఉందని ధీమా వ్యక్తం చేశారు.కాంగ్రెసోళ్లు ఇతర పార్టీల కౌన్సిలర్లను కిడ్నాప్‌లు చేస్తున్నారని, ఇబ్రహీంపట్నంలో బీఆర్ఎస్‌కు మెజారిటీ వచ్చిందని తెలిపారు. అక్కడ ఒక ఇండిపెండెంట్ బీఆర్ఎస్‌కు మద్దతిచ్చాడని తెలిపారు. అయితే వారు ఎక్కడ ఉన్నారో ట్యాపింగ్ ద్వారా గుర్తించి, అక్కడికి పోలీసులను పంపించారని పేర్కొన్నారు. వాళ్లేమైనా దొంగతనం చేసి క్యాంపులో కూర్చున్నారా అని ప్రశ్నించారు. అక్కడికి పోలీసులను పంపించాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు.

# ఢిల్లీ ఎర్రకోట వైట్‌కాలర్ టెర్రరిజంలో కొత్తకోణం

### డాక్టర్ల ఉగ్ర కుట్రకు అన్సార్ ఇంటీరియంగా కోడ్‌నేమ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** దేశ రాజధాని ఢిల్లీ ఎర్రకోట వద్ద గత ఏడాది నవంబర్ పదవ తేదీన జరిగిన ఆత్మాహుతి కారు బాంబు పేలుడులో కొత్త కోణం వెలుగు చూసింది. జమ్మూ కాశ్మీర్‌కు చెందిన కొందరు వైద్యులు కుట్ర పన్నిన ఈ ఆత్మాహుతి దాడిలో ఉగ్ర డాక్టర్‌తో పాటు తొమ్మిది మంది మరణించగా 20 మంది గాయపడడం తెలిసిందే. ఈ కేసును విచారిస్తున్న జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) దర్యాప్తులో తాజాగా కొత్త విషయాలు బహిర్గతం అయ్యాయి. ఈ పేలుళ్లకు కారకులైన ఉగ్ర డాక్టర్లు అందరు కలిసి అన్సార్ ఇంటీరియం పేరిట కొత్తగా ఒక ఉగ్రవాద సంస్థను ఏర్పాటు చేసినట్లు, పేలుడుకు దీనినే కోడ్ నేంగా వాడినట్లు ఎన్ఐఎ గుర్తించింది. ఉగ్ర కుట్రలో పాలుపంచుకున్న వైద్యులంతా నాలుగేళ్ల క్రితమే పాక్ ఉగ్రవాదులతో మమేకం అయినట్లు తాజాగా వెలుగు చూసింది. ఈ పేలుళ్లకు కారకులైన వైద్యులు ముజమ్మిల్ గన్ని, ఉమర్ నబీ, ఆది ల్, ముజఫర్ మౌల్వీ ఇర్ఫాన్, కారీ అమీర్, తౌఫిల్ గాజిలు 2022 ఏప్రిల్ నెలలో శ్రీనగర్‌లో మొదటిసారి భేటీ అయ్యారు. ఆ సమయంలోనే వీర ంతా అన్సార్ ఇంటీరియంను ప్రారంభించారని ఎన్ఐఎ విచారణలో తేలింది. ఈ సంస్థకు ఆదిల్ అధిపతిగా వుండగా, మౌల్వీ ఇర్ఫాన్ డిప్యూటీగా ఎంపికయ్యాడు. తమ బృందంలో వున్న వారు ఎవరెవరు ఏ పనిచేయాలనే దానిపై అందరు ముందుగానే నిర్ణయించుకున్నారని ఎన్ఐఎ విచారణలో తేలింది. ఇందుకోసం వీరంతా ఆపరేషన్స్‌కు సంబంధించి కోడ్‌లను కూడా నిర్ణయించుకున్నారు. ఈ బృందానికి ఆత్మాహుతి దాడికి పాల్పడ్డ ఉమర్ నబీ సమన్వయకర్తగా వ్యవహరించగా గన్నీ ఫైనాన్స్‌తో పాటు కొనుగోళ్లు చూసేవాడు. కాగా అన్సార్ ఇంటీరియం బృందం 2023లో పేలుళ్లకు అ వసరమైన సామాగ్రి, ఎరువులను సోహ్నా నుంచి కొనుగోలు చేసింది. ఉమర్ నబీ సూచనల మేరకు ఫరీదాబాద్‌లోని ఓ రసాయన ఎరువుల దుకాణం నుంచి పొటాషియం నైట్రేట్‌ను తెప్పించారు. డాక్టర్ ఉమర్ నబీ ఆన్‌లైన్ వీడియోలు చూసి ఐఈడీలను తయారు చేయడం నేర్చుకున్నాడని ఎన్ఐఎ విచారణలో తేలింది. ఆదిల్ దక్షిణ కాశ్మీర్‌కు చెందిన డానిష్‌ను అల్‌ఫలా యూనివర్శిటీలోకి తీసుకువచ్చి అక్కడ ఉద్యోగం ఇప్పించి అక్కడే వుండేలా చూశాడు. డానిష్‌తో ఆత్మాహుతి దాడి చేయించాలని ఆదిల్ మొదట భావించాడు. కానీ చివరి నిమిషంలో వెనక్కు తగ్గాడు. కాగా ఈ ఉగ్ర డాక్టర్ల బృందంలో ఉమర్ నబీ కరుడుగట్టిన ఉగ్రవాదిగా తేలింది. ఢిల్లీలోని ఏదైనా రద్దీ ప్రాంతం లేదా మరేదైనా ప్రార్థనా స్థలంలో గత ఏడాది ఆగస్టు 15 వ తేదీన శక్తివంతమైన కారు బాంబును పేల్చాలని ఉగ్రవాదుల కుట్రగా తేలింది. అయితే వీరి కుట్రను శ్రీనగర్ పోలీసులు అన్సార్ ఇంటీరియం వ్యవహారాన్ని రట్టు చేయడంతో ఉమర్ నబీ ఒక్కసారిగా షాక్‌కు గురై కొంతకాలం అజ్ఞాతంలో వుండి, చివరకు గత ఏడాది నవంబరు పదవ తేదీన ఢిల్లీ ఎర్రకోట వద్ద కారులో బాంబు అమర్చి తనను తాను పేల్చుకున్నాడు. కాగా ఉమర్ 2016, 2018లో పాక్ ఐఎస్ఐలో చేరేందుకు ప్రయత్నించగా సరైన ఛానల్ లభించక పోవడంతో చేరలేదని తాజా విచారణలో వెలుగుచూసింది. ఈ కేసులో అరెస్టయిన వైద్యులంగా తీహార్ జైల్లో రిమాండులో ఉన్నారు.

# అజ్ఞాతంలోని మావోయిస్టులు జనజీవన స్రవంతిలోకి రావాలి

### డిజిపి శివధర్‌రెడ్డి పిలుపు

**హైదరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** అజ్ఞాతంలో వున్న మావోయిస్టులు తమ ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలో కలవాలని డిజిపి శివధర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేస్తూ సిఎం రేవంత్ రెడ్డి పిలుపుమేరకు అజ్ఞాతంలో వున్న నక్సలైట్లు జ నంలోకి వచ్చి తమ కుటుంబాలతో శాంతియుత జీవనం సాగించాలని కోరారు. గడచిన రెండేళ్ల కాలంలో 588 మంది నక్సలైట్లు లొంగి పోయారని, వీరంతా తెలంగాణతో పాటు ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన వారని ఆయన తెలిపారు. పోలీసుల సమిష్టి కృషివల్ల ఇది సాధ్యమయ్యిందని ఆయన వెల్లడించారు. లొంగిపోయిన నక్సలైట్లకు పునరావాసం కింద అందాల్సిన అన్ని సౌలభ్యాలను అందించామని డిజిపి తెలిపారు. ప్రస్తుతం వీరంతా వారి వారి సొంత గ్రామాల్లో కుటుంబాలతో సుఖంగా జీవిస్తున్నారని ఆయన తెలిపారు. లొంగిపోయే నక్సలైట్ల విషయంలో తెలంగాణ సర్కారు అనుసరిస్తున్న విధానాలు నచ్చి ఇతర రాష్ట్రాలకు చెందిన మావోయిస్టులు కూడా ఇక్కడ పెద్దసంఖ్యలో లొంగిపోతున్నారని ఆయన తెలిపారు. ప్రస్తుతం తెలంగాణ నుంచి అజ్ఞాతంలో వున్న 15 మంది నక్సలైట్లు ఈ అవకాశాన్ని వాడుకోవాలని ఆయన సూచించారు. లొంగిపోయే వారికి తక్షణ సహాయం అందించడంతో పాటు సమాజంలో వారు గౌరవంగా జీవించేందుకు ఏర్పాట్లు చేస్తామని ఆయన తెలిపారు. నక్సలైట్లు తమ పోరుబాట వీడి సమా జంలో భాగస్వాములు కావాలని, ప్రభుత్వ అభివృద్ధిలో పాలుపంచుకోవాలని ఆయన కోరారు.

# రేపు ఆకాశంలో 'రింగ్ ఆఫ్ ఫైర్'


### భారత్‌లో కనిపించని వలయాకార సూర్యగ్రహణం

### అంటార్కిటికాలో పూర్తిగా వీక్షించే అవకాశం

**హైదరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** ఈ యేడాది మొదటి సూర్యగ్రహణం ఈ నెల 17న సంభవించనుంది. మాఘ మాసం అమావాస్య రోజున శివరాత్రి తరువాత రెండు రోజులకు ఏర్పడుతున్న ఈ గ్రహణానికి కొత్త అంశం ముడిపడివుంది. వలయాకారంలో ఈ సూర్య గ్రహణం ఏర్ప డనుండడంతో దీనికి రింగ్ ఆఫ్ ఫైర్‌గా శాస్త్రవేత్తలు పేరు పెట్టారు. ఈ తరహా సూర్య గ్రహణం చాలా అరుదుగా ఏర్పడుతుందని శాస్త్రవేత్తలు చెబు తున్నారు. ఈ అరుదైన ఖగోళ అద్భుతం భారత్‌లో కనిపించదు. దక్షిణార్ధ గోళంలోని అంటార్కిటికాలో సంపూర్ణంగా ఈ గ్రహణం కనిపించనుంది. అంటార్కిటికాలోని కాంకార్డియా, మిర్నీ సహా సమీపంలో ఈ గ్రహణం స్పష్టంగా కనిపించనుండడంతో దీనిని అక్కడి ధృవ పరిశోధనా కేంద్రా లలో శాస్త్రవేత్తలు ఈ అద్భుతాన్ని వీక్షించేందుకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ ప్రాంతాలలో కేవలం శాస్త్రవేత్తలకు మాత్రమే అనుమతి ఉంటుంది. సాధారణ ప్రజలకు అనుమతి వుండదు. ఈ సూర్యగ్రహణం దక్షిణాఫ్రికా, టాంజానియా, జింబాబ్వే సహా పలు ఆఫ్రికా దేశాలు, అర్జెంటీనా, చిలీ, దక్షిణ అమెరికాలో పాక్షికంగా కనిపిస్తుంది. ఈ గ్రహణం ఉదయం 7.01 గంటలకు మొదలుకానున్న ఈ గ్రహణం తొమ్మిది గంటలకు ముగియనుంది. కాగా ఈ గ్రహణం భారత్‌లో కనిపించదు. గ్రహణం సంభవించే సమయం, భారత కాలమానం వేరు వేరుగా ఉండడం ఇందుకు కారణం. అయితే నాసా సహా పలు అంతరిక్ష సంస్థలు ప్రసారం చేసే ఆన్‌లైన్ లైవ్ స్ట్రీమ్‌ల ద్వారా భారత్‌లో ఈ ఖగోళ అద్భుతాన్ని వీక్షించే వీలుంది.

**రింగ్ ఆఫ్ ఫైర్ అంటే ఏమిటి?**

ఇదిలా ఉండగా సూర్యుడికి, భూమికి మధ్య చంద్రుడు వచ్చినపుడు సూర్య గ్రహణం ఏర్పడుతుంది. అయితే గ్రహణం సమయంలో చంద్రుడు తన సాధారణ పరిమాణం కంటే కొంచెం చిన్నగా కనిపించడం వల్ల సూర్యుడిని పూర్తిగా కప్పలేడు. సూర్యుడి మధ్య భాగాన్ని 96 శాతం వరకు చంద్రు డు అడ్డుకుంటాడు. దీంతో సూర్యుడి అంచులు ఒక ప్రకాశవంతమైన బం గారు వలయంగా కనిపిస్తుంది. దీనినే కంకణాకార గ్రహణం లేదా రింగ్ ఆఫ్ ఫైర్‌గా పిలుస్తారు. దీనిని అగ్ని వలయంగా కూడా పిలుస్తారు.



సూర్యగ్రహణం తాలూకు నాసా విడుదల చేసిన ఫొటో

# రేపటి నుంచి సిబిఎస్ఇ టెన్త్, ఇంటర్ బోర్డు ఎగ్జామ్స్

**హైదరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా రేపటి(మంగళవారం) నుంచి సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) టెన్త్, ఇంటర్ బోర్డు పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పరీక్షలను ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్షలను కొనసాగించనున్నారు. టెన్త్ పరీక్షలు ఈ నెల 17 నుంచి మార్చి 11 వరకు కొనసాగనుండగా.. ఇంటర్ పరీక్షలు ఈ నెల 17 నుంచి మార్చి 27 వరకు కొనసాగనున్నాయి. సవరించిన షెడ్యూల్ ప్రకారం, సీబీఎస్ఈ క్లాస్ 10 బోర్డు పరీక్షలు ఈ నెల 17 నుండి మార్చి 11 వరకు జరగనున్నాయి. ఫిబ్రవరి 17న గణితం, ఫిబ్రవరి 21న ఇంగ్లీష్, ఫిబ్రవరి 25న సైన్స్, మార్చి 2న హిందీ, మార్చి 7న సోషల్ సైన్స్ పరీక్షలు జరుగుతాయి.

వార్త

డబ్బు ఉన్నప్పుడు ఎడాపెడా ఖర్చు చేయడం, లేనప్పుడు ఇతరుల దగ్గర చేతులు చాచడం వల్ల మన వ్యక్తిత్వం దెబ్బతింటుంది.

-మహాత్మా గాంధీ

# దేశంలో 'స్వచ్ఛ' రాజకీయాలు అవసరం

**అంతర్జాతీయంగా కూడా స్నేహం, నైతికతలకు తిలోదకాలు ఇవ్వటానికి సిద్ధంగా ఉన్న తరుణంలో మనదేశం ఆధ్యాత్మికతకు ఆదర్శప్రాయం గా ఉన్న దేశం నైతిక మార్గాన్ని చూపక తప్పదు.మనదేశం ఈవిధంగా విలువలకు ప్రాతినిధ్యం ఇచ్చే అడుగులు వేయా లంటే మన ఇంట్లోనే అడుగుజాడలు సరిగ్గా ఉండేట్లు చూడక తప్పదు.రాజకీయాలు ఉండకతప్పదు. ప్రజాస్వా మ్యంలో రాజకీయం ప్రధాన పాత్ర వహిస్తుంది. కానీ రాజకీయాలంటే ప్రజల పురోగతి కోసం ప్రజాసేవ కోసం అనుసరించే మార్గం.తిట్లకూ శాపనార్థాలకూ వ్యక్తుల వివా దాలను రాజకీయ వివాదాలుగా మార్చి కుల,మత, ప్రాంతీ యతలను ఆపాదించి,అసలుకే ఎసరు పెట్టటంకాదు. ప్రజల కోసం రాజకీయం స్వచ్ఛంగా చేయాలి. స్వయం సంపాదన కోసం చేసేది రాజకీయం కాదు. అరాజకీయం.**



రావులపాటి సీతారాం రావు

రాజకీయాలు రంగుల రాట్నంగా మారాయి. కుదురుగా ఒక పార్టీలో ఉండే వాళ్లు అరుదయ్యారు. చక్రంలో రంగు ఎటు కనపడితే అటు దూకే పరిస్థితి ఏర్పడింది. కొన్ని సంవత్సరాల క్రిందట దేశంలో స్వతంత్ర గాలులు వీచిన వేళ పార్టీలు మారటం నేరం కన్నా నామర్దాగా భావించేవారు. రాజగోపాలాచారి స్వతంత్ర పార్టీని ఏర్పరిచిన కారణం అప్పటి ప్రధాని అధికారంలో ఉన్న పార్టీ మీద అలిగి కానీ, కోపంతో కానీ కాదు! బలమైన ప్రతిపక్షం ఉంటేనే అధికార పక్షం దారి తప్పదు అన్న ఏకైక సూత్రంతోనే ఆయన పార్టీని పెట్టారని అప్పటి వారు ఆ రోజుల్లో జ్ఞాపకం చేసుకొనేవారు. ఆయన పార్టీ నడిపినంత కాలం ప్రతిపక్షం నిర్మాణాత్మకంగానే వ్యవహరించింది. ప్రతిపక్ష ప్రభావం ఎలా ఉండేదంటే నేను ఏ తప్పు చేస్తానో, చూసి సరిదిద్దడానికి దక్షిణ దేశంలో ఒకాయన ఎప్పుడూ ఎదురు చూస్తూనే ఉంటాడు. నేను మాత్రం సాధ్యమైనంతవరకూ ఆ అవకాశం దక్కనివ్వను అని నెహ్రూ అనేవారని ఆ రోజుల్లోని రాజకీయాల వ్యవహార శైలి తెలిసిన వారు చెప్పేవాళ్లు. అవన్నీ ఇప్పటికీ జ్ఞాపకం చేసుకుంటూనే ఉంటారు. (ఓల్డ్ గార్డ్ రూం ఈజ్ ఎంప్టీ నౌ గాడ్ సేవ్ ది నేషన్) జవహర్‌లాల్ నెహ్రూ చనిపోయిన మరుక్షణమే రాజాజీ ఆ విధంగా వాపోయి నివాళులర్పించారు. అదీ వారి సాన్నిహిత్యం! వ్యక్తుల మధ్య స్నేహం అలాగే ఉండేది. సమస్యలు మాత్రమే విభేదాలకు కారణమయ్యేవి. విరోధాలకు కాదు! ఎక్కడో లోక్‌సభలో వెనక బెంచీలో ధారావాహికంగా మాట్లాడుతున్న అప్పటి ప్రతిపక్షంలోని నాయకుడు అటల్ బిహారీ వాజ్‌పాయ్‌ని చూసి ఎప్పుడో ఒకప్పుడు ఆ యువకుడు ఈ దేశానికి ప్రధాన మంత్రికాగలడు అని అప్పటి ప్రధాని జవహర్‌లాల్ భవిష్యత్ వాణిని వినిపించారట! అన్ని పార్టీలను కూడదీసి, ఎమర్జెన్సీ విధించినందుకు గాను, పెద్ద యుద్ధమే చేసిన లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణ్ దగ్గరకు ఓడిపోయిన ఇందిరాగాంధీ ఓదార్పు కోసం ఆశ్రయం కోరి అక్కడ కొద్ది కాలం గడిపిందని చరిత్ర చెబుతున్నది. ప్రధాని పి.వి నర్సింహారావు ప్రత్యేకంగా ప్రతిపక్షంలోని వాజ్‌పాయ్‌ను భారతదేశ ప్రతినిధి వర్గానికి నాయకుడిగా, మనదేశానికి ప్రాతినిధ్యం వహించటానికి సగౌరవంగా పంపిన విషయాన్ని ఇప్పటికీ దేశంలోని పార్టీల మధ్య అంశాలను బట్టి విబేధాలు ఉండొచ్చు కానీ విరోధాలు ఉండకూడదు అని అనుకొనే విజ్ఞులు, నెమరు వేసుకుంటూనే ఉంటారు. అంతెందుకు ప్రధానమంత్రి వాజ్‌పాయ్‌కి సెంట్రల్ హాల్‌లో జవహర్‌లాల్ ఫొటో గోడమీద కనపడకపోయేసరికి అంతు లేని కోపం వచ్చిందట. ఆ ఫొటోను గోడకు తగిలించేంత వరకూ ఆయన ఊరుకోలేదని లోక్‌సభలోని అధికారులు జ్ఞప్తికి తెచ్చుకుంటారు. ఈ సాంప్రదాయాలు ఎక్కడికి పోయాయి? రాజకీయాలంటే నీచమైన తిట్ల పురాణం విప్పి, మహిళలను కూడా వినరాని, వినలేని పదజాలంతో తిట్టటమేనా? చీటికి మాటికి ప్రజల విషయాలు కాకుండా



నువ్వెంత అంటే నేనెంత అని బజారు భాషను జాతీయ భాషగా మార్చి వీధికుళాయి తగాదాలు మాదిరి పవిత్రమైన అసెంబ్లీలలో పార్లమెంట్‌లో కూడా ఉచ్చనీచాలు మరిచి వ్యక్తిగత ద్వేషాలతో తిట్ల వస్త్రాలు ఉతికి నడిబజార్లో ఆరేసుకోవటమేనా? ఆధునిక యుగం డిజిటల్ యుగం, అంతరిక్ష యుగం పరిశోధనలో అత్యంత వేగవంతంగా అన్ని రంగాల్లోనూ పురోభివృద్ధి సాధించామని మనదేశమే కాదు, అన్ని దేశాలు కూడా రొమ్ము విరుచుకొని చెబుతున్న ఈ కాలంలో ఇదెక్కడి వైపరీత్యం? మానవ సంబంధాలలో ఇంత అట్టడుగుకు ఎందుకు దిగజారారు? నైతికతను పాతరేసి అవకాశ రాజకీయాలు, ఎన్నికల రాజకీయాలు సాగించడానికి ఏదో విధంగా గెలుపుగుర్రాన్ని అధిరోహించి ఎన్నుకున్న జనాల మీదనే స్వారీ చేయటానికా? సోవియట్ రష్యా ముక్కలయింది. రష్యా, ఉక్రెయిన్‌ల పోరు మొదలైంది. పాకిస్థాన్ రెండుగా చీలి బంగ్లాదేశ్ ఉద్భవించింది. ఇప్పుడిప్పుడే బలూచిస్థాన్, పాకిస్థాన్‌లోని అంతర్భాగంలో నిప్పు రాజుకొంది. ఒకప్పటి పాకిస్థాన్‌లోని ఈ మూడు ప్రాంతాలలో నిప్పు సెగంటుకొని, జ్వాలలు లేస్తున్నాయి. భారత్ పాకిస్థాన్ విడిపోయిన తర్వాత చరిత్రలోని మలుపు ప్రపంచమంతటా యు.ఎన్.ఓతో సహా అందరికీ తెలిసినదే. అత్యంత సుందర ప్రదేశం కాశ్మీర్‌ను ఇండియాలోని అంతర్భాగాన్ని పాకిస్థాన్ ఆక్రమించుకోటానికి చేస్తున్న యుద్ధాలు కొత్తగా ఉగ్రవాద అస్త్ర ప్రయోగాలు జగమెరిగిన సత్యమే. తాలిబన్లను దగ్గరకు తీసి ఉగ్రవాదాన్ని ప్రేరేపించిన పాకిస్థాన్‌కు తాలిబన్లే బుద్ధి చెబుతున్నారు. అఫ్ఘానిస్థాన్ రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకొని పాకిస్థాన్‌పైనే పంజా విసరటానికి సిద్ధంగా ఉన్నారు. హిందీ– చీనీ భాయి,భాయి అన్న చైనా నక్క జిత్తుల ప్రయోగం ఇండియా ముందు పనికి రాలేదు. దొంగచాటుగా, మరో విధంగా సరిహద్దు సమస్యలు సృష్టించి భారత్‌ను చిన్నాభిన్నం చేయాలని ప్రయత్నించిన ఆ దేశానికి భారత్ మింగుడుపడలేదు. చేసేదిలేక ప్రస్తుతం అనుకూల శత్రువుగా మారింది. యుఎస్ అధ్యక్షుడు దోనాల్డ్ ట్రంప్ రెండవసారి ఎన్నిక కాగానే టక్కుటమార విద్యల ప్రావీణ్యత ప్రదర్శించటంతో దాదాపు అన్ని దేశాలూ ముక్కున వేలేసుకున్నాయి. అయితే ట్రంప్ తన దేశంలోని అక్రమ వలసదారుల మీద ఉక్కుపాదం పెట్టి తరిమేసే కార్యక్రమంతోపాటు, తమ దేశంలోని ఉద్యోగాలన్నీ ఇతర దేశస్థులు వలసదారులుగా మారి లబ్ధి పొందటంతో తన దేశ బాగుకోసం, కఠినతరమైన నిబంధనలలో, ఆర్థికపరమైన కొత్త నిబంధన 'టారిఫ్' అనే ఆయుధాన్ని వదిలాడు. ఆ దెబ్బకు చాలా దేశాలు దిగొచ్చాయి.పాలస్తీనా, ఇరాన్, మలేసియా, చైనా, భారత్ దేశాలను అనుకూలంగా మార్చుకోటానికో, తన పాలన పటిష్ట పర్చుకోటానికో అనేక రకాల ప్రయోగాలు చేస్తున్న నేపథ్యంలో భారత్ ఒక ఇంటరిం ఎగ్రిమెంట్ కుదుర్చుకొని ఆర్థికంగా కొంత ఊరట పొందే ప్రయత్నంలో ఉన్నది. అంతర్జాతీయంగా కూడా స్నేహం, నైతికతలకు తిలోదకాలు ఇవ్వటానికి సిద్ధంగా ఉన్న తరుణంలో మనదేశం ఆధ్యాత్మికతకు ఆదర్శప్రాయంగా ఉన్న దేశం నైతిక మార్గాన్ని చూపక తప్పదు.మనదేశం ఈవిధంగా విలువలకు ప్రాతినిధ్యం ఇచ్చే అడుగులు వేయాలంటే మన ఇంట్లోనే అడుగుజాడలు సరిగ్గా ఉండేట్లు చూడక తప్పదు.రాజకీయాలు ఉండకతప్పదు. ప్రజాస్వామ్యంలో రాజకీయం ప్రధాన పాత్ర వహిస్తుంది. కానీ రాజకీయాలంటే ప్రజల పురోగతి కోసం ప్రజాసేవ కోసం అనుసరించే మార్గం.తిట్లకూ శాపనార్థాలకూ వ్యక్తుల వివాదాలను రాజకీయ వివాదాలుగా మార్చి కుల,మత, ప్రాంతీయతలను ఆపాదించి,అసలుకే ఎసరు పెట్టటంకాదు. ప్రజల కోసం రాజకీయం స్వచ్ఛంగా చేయాలి. స్వయం సంపాదన కోసం చేసేది రాజకీయం కాదు. అరాజకీయం. ●

# సంస్కరణ వాదానికి జై

బంగ్లాదేశ్ ఏర్పాటులో భారతదేశమే అన్ని విధాలుగా అండదండలుగా ఉన్నా తర్వాత వచ్చిన పరిణామాలు, పాలకులు, వారి వారి విధానాల కారణంగా ఆ రెండు దేశాల మధ్య దూరం బాగా పెరిగిపోయింది. బంగ్లా జాతిపితగా పేరొందిన షేక్ ముజిబుర్ రెహ్మాన్ కుమార్తె షేక్ హసీనా పదవీచ్యుతి అనంతరం బంగ్లాదేశ్‌కు భారత్‌కు మధ్యదూరం పెరిగిపోయింది. ఏమాత్రం సఖ్యత లేనేలేదు. షేక్ హసీనాకు ఆశ్రయమిచ్చామనో, మరెందు చేతనో అక్కడి తాత్కాలిక పాలకుడు నోబెల్ గ్రహీత మహ్మద్ యూనస్ భారత్ మీద నిప్పులు కక్కుతున్నారు. ఇటీవల జరిగిన బంగ్లా అల్లర్లలో ముగ్గురు హిందువులను వేర్వేరు సందర్భాల్లో ఉద్యమకారులు చంపేస్తున్నా పాలకులు చోద్యంచూశారు. బంగ్లాదేశ్‌లో హిందువులకెలాంటి రక్షణ ఉందో ఆయా సంఘటనలే చెబుతున్నాయి. హసీనా హయాంలో భారత్‌తో సన్నిహిత సంబంధాలు ఉండటం వల్లనే ఆమెకు భారత్‌లో ఆశ్రయం దొరికింది. ఇది కూడా తాత్కాలిక పాలకులకు భారత్ మీద కన్నెర్ర చేసేందుకు కారణమై ఉండవచ్చు.తాజాగా హసీనా పార్టీకి పోటీ చేసే అర్హతను లేకుండాచేసి బంగ్లాదేశ్‌లో ఎన్నికలు జరిపించారు అక్కడి తాత్కాలిక అధ్యక్షుడు. నిన్నటి ఓట్ల లెక్కింపులో హసీనాతో ఎలాంటి సత్సంబంధాలు లేని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ హవా కొనసాగుతోంది. ఈసార్వత్రిక ఎన్నికలో బిఎన్‌పి అత్యధిక స్థానాలు గెలుచుకోగా, షఫీకర్ రెహమాన్ సారధ్యంలోని జమాత్ ఇస్లామీ కూటమి గెలుచుకున్న స్థానాలు తక్కువే అయినా రెండో స్థానంలో ఉంది. దాదాపు 37 ఏళ్ల పాటు బంగ్లాదేశ్‌ను మహిళలే పాలించారు. తర్వాత తొలిసారి బిఎన్‌పి చైర్మన్ తారిఖ్ రహ్మాన్ బంగ్లాదేశ్ అధికార పీఠమెక్కనున్నారు. జమాత్ ఇస్లామీ కూటమిలో దాదాపు 11పార్టీలు భాగస్వాములుగా ఉన్నాయి. అయినా ప్రజా బాహుళ్యం బిఎన్‌పివైపే మొగ్గు చూపింది. దేశంలో ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పాటుకు జనం ఎంతగానో ఆసక్తి చూపారని పాల్గొన ఓటర్ల సంఖ్యేచెబుతోంది. ఎందుకంటే హసీనా ప్రభుత్వంపై ఒక్కసారిగా జనం తిరగబడ్డారు. హసీనా తీసుకున్న అనేక నిర్ణయాలు వారికి రుచించలేదు.నిరుద్యోగ సమస్య అవినీతి, బంధుప్రీతి వంటిఅంశాలు హసీనా ప్రభుత్వాన్ని కుదిపేసాయి. ఇండియా ఆశ్రయం పొందాల్సి వచ్చింది. తర్వాత ఏర్పడిన తాత్కాలిక ప్రభుత్వం బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు, హింసాత్మక ఘటనలతో అట్టుడికిపోయింది. పాలకులు వాటిని అదుపు చేయలేకపోయారు. అవామీలీగ్ వంటి కొన్ని పార్టీలు ప్రాతినిధ్యం పోటీ చేసే అర్హతలను నిషేధించే ఈఎన్నికలు ప్రజాస్వామయుత ఎన్నికలు అయినా కాకపోయినా జనం బిఎన్‌పికి పట్టం కట్టారు. కనుక వారి తీర్పును శిరసావహించాల్సిందే. ఇక్కడ విశేషమేమిటంటే సార్వత్రిక ఎన్నికలతో పాటు దేశ రాజ్యాంగ సంస్కరణలు కోరే 84 ప్రతిపాదనాంశాలతో రెఫరెండం కూడా జతచేశారు. చాలా ముస్లిం దేశాలలో రెఫరెండం వంటి అంశాలు సర్వసాధారణం. ఈ రెఫరెండం పేరు జూలై నేషనల్ చార్టర్. మాజీ మహిళా ప్రధాన మంత్రి దివంగత ఖలీదా జియా పార్టీ 15ఏళ్ల తర్వాత ఆమె వారసుని నేతృత్వంలో బంగ్లాదేశ్‌లో గద్దెనెక్కుతోందన్నమాట. మొన్నీమధ్యనే ఆమె దివంగతురాలైంది. కనుక ఆమె కుమారుడు తారీఖ్ రహ్మాన్ చేతికే పగ్గాలు లభిస్తాయి. ఒకనాడు దేశ బహిష్కరణకు గురై 15 ఏళ్ల తర్వాత ఈ మధ్యనే తారీఖ్ బంగ్లాదేశ్‌కు తిరిగొచ్చారు. అవినీతి ఆరోపణలపై 17 నెలలు జైల్లో కూడా ఉన్నాడు.ఐనా ప్రజల్లో వచ్చిన మార్పుతోఆయనకు ఈ ఎన్నికల్లో బ్రహ్మరథం పట్టారు. 2002-2006లో ఖలీదా అధికారంలో ఉన్నప్పుడు ఇండియాకు వ్యతిరేకంగా వ్యవహరించేవారు. జలజగడాలుండేవి. వాణిజ్యపరమైన ఒప్పందాలు బెడిసి కొట్టాయి. అప్పటికీ ఇప్పటికీ ఎంతో మార్పు ఉంది. అయితే తారీఖ్ రహ్మాన్ 'సమ్మిళిత బంగ్లాదేశ్' అనే నినాదం ఎత్తుకున్నారు.ఎన్నికల ప్రచారంలో కూడాఎలాంటి భారత్ వ్యతిరేక ప్రస్తావనలు తేలేదు. ఈ నేపథ్యంలో ఇండియా పాలకులలో విబేధించే పరిస్థితి రాకపోవచ్చు. బంగ్లాదేశ్‌లో హిందువుల భద్రత మనకు ముఖ్యం. కాగా, భారత్‌లో ఆశ్రయం పొందుతున్న మాజీ ప్రధాని హసీనాను బంగ్లాదేశ్‌కు అప్పగించమనే అభ్యర్థనను తీవ్రతరం చేయవచ్చు. కాగా ఇలాంటి ఆ దేశ అంశాలతో భారత్ కూడా గట్టిపట్టు పట్టకపోవచ్చు. తారీఖ్ ఘన విజయాన్ని భారత ప్రధాని మోడీ స్వాగతించారు. ఆయనకు శుభా కాంక్షలు తెలిపారు. ప్రజాస్వామ్య ప్రగతిశీల బంగ్లాదేశ్‌కు భారత్ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని ప్రధాని నరేంద్ర మోడీ భరోసా ఇచ్చారు.ఇవన్నీ భారత్ బంగ్లాదేశ్‌ల మధ్య స్నేహసౌహార్ద్రతను పెంచే అంశాలే. బంగ్లాదేశ్‌కు, తారీఖ్ తొలి పురుష ప్రధాని యువత బిఎన్‌పికి పట్టుగా నిల బడింది. వృద్ధుల్ని సైతం 'బంగ్లా ఫస్ట్' అనే నినాదంతో ఆకట్టుకోవడం విశేషం. బంగ్లాదేశ్ ఈ మధ్యకాలంలో పాకిస్థాన్‌కు అనుకూలవైఖరి అవలంబిస్తూ భారత్ మీద వైషమ్య వ్యాఖ్యలకు అవకాశమిచ్చింది. ఈ నేపథ్యంలోనే అక్కడ హిందూ వ్యతిరేక వైఖరి బలపడింది. ఇలాంటి పరిస్థితులను క్రోడీకరించుకుని బంగ్లాదేశ్‌ను ప్రగతిబాటలో నడిపించే బాధ్యత తారిఖ్ భుజస్కంధాల మీద పడింది. భారత్ వ్యతిరేక జమాతే పార్టీ ఓటమి చెందినందున భారత్‌తో చెలిమికి బంగ్లాదేశ్‌కు ఏమాత్రం అడ్డంకి ఉండబోదు. రెఫరెండానికి 60.25శాతం ఓట్లుపడినందున దేశంలో అస్థిరతలేకుండా చేసి భారీగా ప్రజాస్వామిక సంస్కరణలు తేగలిగితే ఆయన నేతృత్వానికి సంపూర్ణ విజయం చేకూరినట్లే.

చీకట్లోనే నక్షత్రాలు కనబడతాయి. అలాగే కష్టాల్లోనే సత్యాలు గోచరమవుతాయి.



శంకరా చార్యులు

ఏదో ఒక పనిలో నిరంతరం నిమగ్నమైన వారికి కన్నీళ్లకు చోటు లేదు.



బైరన్

# ప్రజావాక్కు



## నిరుద్యోగ సేన ఉద్యమించాలి

**నేడు** మనదేశాన్ని పట్టిపీడిస్తున్న ముఖ్యమైన సమస్యల్లో మొదటిది సాంప్రదాయక విద్యావంతుల నిరుద్యోగ సమస్య. అన్ని సమస్యలకీ మూలకారణ మైన యువ నిరుద్యోగుల గురించి రాజకీయ పక్షాలు, ప్రభుత్వాలు గట్టిగా దృష్టి సారించటం లేదు.అందుకు కారణం వారు అసంఘటితంగా వుండి, వారిని ఓటు బ్యాంకుగా భావించక పోవటమే.కనుక అడగనిదే, అమ్మైనా పెట్టదు అనే సామెతలా ఎవరో వచ్చి,ఏదోచేస్తారని మోసపోకుండా, నిరుద్యోగులు అందరూ ఏకమై, ఖాళీగానున్న పోస్టులని తక్షణం భర్తీ చేసి,పెరుగుతున్నజనాభాకి తగ్గనిష్పత్తిలో ప్రభుత్వోద్యోగ, పోలీసు నియామకాలు చేపట్టేలా రాజకీయ పక్షాలపైనా, ప్రభుత్వాలపైనా గట్టి ఒత్తిడి తేవాలి. ఉద్యోగులపై నానాటికీ పెరుగుతున్న ఖర్చుల వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ నియామకాలు తగ్గిస్తున్నాయి.

- తిరుమలశెట్టి సాంబశివరావు, గుంటూరు

## ఆలోచనా శక్తి పెంచాలి

భారత విద్యావ్యవస్థలో పరిశోధనా దృష్టిని విస్తరించాల్సినఅవసరం అత్యంత కీలకంగా మారింది.దేశంలో కోట్లాది మంది విద్యార్థులు,లక్షలాది పాఠశాలలు, ఉపాధ్యాయులు ఉన్న పరిస్థితిలో, పిల్లలలో జిజ్ఞాస, విచారణ, విశ్లేషణాత్మక ఆలోచనలను పెంపొందించడం ప్రధాన బాధ్యతగా నిలిచింది. చదువు అనేది కేవలం పాఠ్యపుస్తకాలు వల్లె వేయడం కాదు,ప్రశ్నించడం,అన్వేషించడం, వివిధ కోణాలలో ఆలోచించడం అనే దృక్పథాన్ని చిన్నప్పటి నుంచే అభివృద్ధి చేయాలి. పాఠశాల స్థాయి నుంచే గురువులు విచారణాత్మక పద్ధతులను బోధనా ప్రక్రియలో చేర్చాలి. చిన్నపాటి అన్వేషణా పనులు, పరిశీలన ఆధారిత కార్యాచరణలు నిర్వహించాలి.

- సి.సాయిరుత్విక్, నల్గొండజిల్లా

## మౌలిక సదుపాయాలు కల్పించాలి

**నల్లగొండ** జిల్లా తిరుమలగిరి సాగర్ మండల కేంద్రంలో మురికి కాలువలు శుభ్రం చేయడంలేదు.రోడ్లపై గుంతలు ఉన్నాయి. మిషన్ భగీరథ పైప్ లైన్లు పగిలిపోయాయి. వీధి దీపాలు వెలగడం లేదు. గ్రామ కార్యదర్శులు, అధికారులు కార్యాలయాలకు పరిమితం అవుతున్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలి.

-పి. నర్సింహారెడ్డి, నల్లగొండ జిల్లా

## అగ్రస్థానంలో యువ జనాభా

ప్రపంచంలోనే అత్యధిక యువజనాభా కలిగిన దేశంగా భారతదేశం నేడు అగ్రస్థానంలో ఉంది. ఐక్యరాజ్యసమితి గణాంకాల ప్రకారం భారత జనాభాలో సుమారు 66 శాతం మంది 35 ఏళ్లలోపు వారే. ఈ యువశక్తి దేశ ఆర్థిక వ్యవస్థకు కీలకమైన ఇంజిన్‌లామారనుంది.అయితే రాష్ట్రాలవారీగా జనాభా మార్పులు వేర్వేరుగా ఉన్నాయి. కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాలు 2036 నాటికి వృద్ధాప్య రాష్ట్రాలుగా మారనున్నాయని, మరో వైపు ఉత్తరప్రదేశ్, బీహార్ వంటి రాష్ట్రాల్లో పని చేసే వయస్సు గల జనాభా పెరుగుతూనే ఉంటుందని రిజర్వ్ బ్యాంక్ నివేదికలు చెబుతున్నాయి. ఈజనాభా మార్పులవల్ల దక్షిణాది రాష్ట్రాలు ఆర్థికంగా, రాజకీయంగా సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. జనాభా నియంత్రణను విజయవంతంగా అమలు చేసినందుకు ప్రశంసలు అందాల్సిందిపోయి,కేంద్ర పన్నుల పంపిణీలో నిధుల వాటా తగ్గడం,పార్లమెంటు ప్రాతినిధ్యం తగ్గే ప్రమాదం ఉండటం సమాఖ్య వ్యవస్థలో అసమానతలకు దారితీస్తోంది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## వీధికుక్కల దాడులు

**నగరాలు,** పట్టణాల్లో వీధికుక్కల దాడులపై ప్రజల్లో భయాందోళనలు పెరుగుతున్నాయనేది వాస్తవమే. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు బాధితులవుతున్న సంఘటనలు సమాజాన్ని కలవరపెడుతున్నాయి. అయితే ఈసమస్యకు పరిష్కారం భావోద్వేగాలతో కాకుండా చట్టబద్ధమైన, శాస్త్రీయమైన విధానాల ద్వారా రావాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసినట్టుగా ఈ తీర్పు తెలియజేస్తోంది. జంతు క్రూరత్వ నిరోధక చట్టం, జంతు జనాభా నియంత్రణ నిబంధనలు ఇప్పటికే అమలులో ఉన్నాయి.వీటిలో మార్పులు అవసరమైతే శాసన, కార్యనిర్వాహకవ్యవస్థల బాధ్యతగా కోర్టుస్పష్టమైన సంకేతం ఇచ్చింది.

- కె. శ్రీనివాస్, వరంగల్‌జిల్లా

## భారత్‌తో బంధం

**తారీక్** గెలుపుతో బంగ్లాలో కొత్త రాజకీయ సమీకరణాలకు తెరలేవనుంది. ఇన్నాళ్లు చైనా, పాకిస్థాన్‌తో అంటకాగిన తారీక్ ఇప్పుడు గతంలో జరిగిన తప్పులను క్షమించమని కోరుతున్నాడు. నిజానికి కాలీదా జియా మరణం తరవాత అయినా ఆమె అధికార ఆశయం తన కొడుకు రూపంలో అయినా నెరవేరింది. బంగ్లాదేశ్ ఇంత ప్రాముఖ్యత ఉన్న భారత్ తో తన బావి సంబంధాలు ఎలా ఉంటాయి అన్నది చూడవలసిందే.

-భారత అవినాష్, జనగామ

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# పట్టణ అభివృద్ధికి ప్రజల గ్రీన్ సిగ్నల్


తిప్పర్తి శ్రీనివాస్

తెలంగాణ రాజకీయ పరిపక్వతకు మరో అధ్యాయం చేరింది. తెలంగాణ రాష్ట్రంలో జిహెచ్‌ఎంసి మినహా 116 మున్సిపాలిటీలకు, ఏడు మున్సిపల్ కార్పొరేషన్లకు ఎన్నికలు నిర్వహించడం ద్వారా గ్రామీణపట్టణ స్థానిక స్వపరిపాలన వ్యవస్థకు ప్రజలు మరోసారి తీర్పునిచ్చారు. స్థానిక సంస్థలు ప్రజాస్వామ్యానికి పునాది రాళ్లైతే, ఈ ఎన్నికలు ఆ పునాదిని మరింత బలపరిచే ప్రక్రియగా భావించాలి. మున్సిపాలిటీలలో మొత్తం 2582 వార్డులు ఉండగా అందులో 12 వార్డులు ఏకగ్రీవంగా ఎన్నుకోబడటం గమనార్హం. ఒక వార్డులో ఎన్నిక వాయిదా పడటం పరిపాలనా సాంకేతిక అంశమే అయినప్పటికీ, మిగతా వార్డులన్నింటిలో పోటీ వాతావరణం నెలకొనడం ప్రజాస్వామ్య ఉత్సాహాన్ని ప్రతిబింబిస్తుంది. అదే విధంగా ఏడు కార్పొరేషన్లలో 414డివిజన్లు ఉండగా అందులో రెండు ఏకగ్రీవంగా ఎన్నిక కావడం, మిగిలిన 412 డివిజన్లకు ఈ నెల 11న పోలింగ్ జరగడం ప్రజల చైతన్యాన్ని చాటిచెప్పింది. 13వ తేదీన వెలువడిన ఫలితాలు ప్రజాభిప్రాయాన్ని స్పష్టంగా ప్రతిఫలింపజేశాయి. స్థానిక సంస్థల ఎన్నికలు సాధారణ రాజకీయ పోటీ కాదని గుర్తించాలి. ఇవి ప్రజల దైనందిన జీవితానికి నేరుగా సంబంధం ఉన్న పాలనా వ్యవస్థను నిర్ణయించే ఎన్నికలు. తాగునీరు,పారిశుధ్యం, వీధి దీపాలు, అంతర్గత రహదారులు, మురుగు కాల్వలు, పట్టణ ప్రణాళికలు అన్నీ మున్సిపల్ పాలన పరిధిలోకి వస్తాయి. అందువల్ల ఈఎన్నికల్లో ప్రజలు అభ్యర్థుల వ్యక్తిత్వం,అందుబాటు, సేవాభావం, స్థానిక సమస్యలపై అవగాహన వంటి అంశాలను ఎక్కువగా పరిగణనలోకి తీసుకుంటారు. ఈ నెల 16వ తేదీన ఉదయం 116 మంది మున్సిపల్ చైర్మన్‌లను, 116 మంది వైస్ చైర్మన్‌లను ఎన్నుకోవడం జరగనుంది. అలాగే ఏడు కార్పొరేషన్లకు ఏడుగురు మేయర్లు, ఏడుగురు డిప్యూటీ మేయర్లు ఎన్నికై అదే రోజు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ ప్రక్రియతో కొత్త పురపాలక వర్గాలు అధికార బాధ్యతలు స్వీకరించనున్నాయి. ప్రజలు ఇచ్చిన తీర్పును అమలు చేయాల్సిన బాధ్యత ఇప్పుడు ఎన్నికైన ప్రజాప్రతినిధులపై ఉంది. ఎన్నికల ఫలితాలు ఎవరికి అనుకూలంగా వచ్చినా, స్థానిక పాలనలో ప్రధాన ధ్యేయం రాజకీయ ప్రతిష్ట కాదు ప్రజా సేవ. మున్సిపాలిటీలు,కార్పొరేషన్లు అభివృద్ధి యంత్రాంగాలుగా మారాలి. పట్టణాల విస్తరణ వేగంగా జరుగుతున్న ప్రస్తుత సందర్భంలో ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి అత్యవసరం. నియంత్రణలేని నిర్మాణాలు, ట్రాఫిక్ రద్దీ, కాలుష్యం, వర్షాకాలంలో ముంపు సమస్యలు వంటి అంశాలు పట్టణాల ఎదుగుదలకు అడ్డంకులుగా మారుతున్నాయి. కొత్తగా ఎన్నికైన నాయకత్వం దీర్ఘకాలిక దృష్టితో ముందుకు సాగాలి. ప్రత్యేకంగా ఆర్థిక నిర్వహణ కీలకం. స్థానిక సంస్థల ఆదాయ వనరులను పెంచడం,పన్నుల వసూళ్లలో పారదర్శకత, ప్రభుత్వ నిధుల సమర్థ వినియోగం ఇవి అన్నీ సమన్వయంతో నడవాలి. ప్రజలకు సేవలు అందించడంలో సాంకేతికతను వినియోగించడం ద్వారా పారదర్శకతను పెంచవచ్చు. ఆన్‌లైన్ సేవలు, ఫిర్యాదు పరిష్కార వ్యవస్థలు, ప్రజలతో ప్రత్యక్ష సంప్రదింపులు ఇవి ప్రజా విశ్వాసాన్ని పెంచుతాయి. అదేవిధంగా రాజకీయ విభేదాలు పరిపాలనకు అడ్డంకిగా మారకూడదు. మున్సిపల్ కౌన్సిల్లు,కార్పొరేషన్ సభలు ప్రజా సమస్యలపై నిర్మాణాత్మక చర్చలకు వేదిక కావాలి. ప్రతిపక్షం సూచనలు ఇవ్వాలి. అధికార పక్షం వాటిని సమగ్రంగా పరిగణించాలి. ప్రజాస్వామ్యంలో ఆరోగ్యకరమైన వాదోపవాదాలు అవసరం కానీ అభివృద్ధి పనులు నిలిచిపోవడం సమంజసం కాదు. మహిళలకు, పేదలకు, అట్టడుగు వర్గాలకు ప్రాధాన్యతనిచ్చే విధానాలు స్థానిక సంస్థల ద్వారా అమలవుతాయి. పట్టణ పేదల గృహవసతి, ఉపాధి అవకాశాలు, చిన్న వ్యాపారాల ప్రోత్సాహం,స్వచ్ఛత కార్యక్రమాలు ఇవి అన్ని కొత్త బోర్డుల కార్యాచరణలో ప్రధాన స్థానాన్ని పొందాలి. పర్యావరణ పరిరక్షణ కూడా సమానంగా ముఖ్యమైనది. చెట్ల పెంపకం, సరస్సుల సంరక్షణ, ప్లాస్టిక్ నియంత్రణ వంటి చర్యలు పట్టణాల భవిష్యత్తును నిర్ణయిస్తాయి. ఈ ఎన్నికల ద్వారా ప్రజలు ఇచ్చిన సందేశం స్పష్టమైనది. స్థానిక పాలన ప్రభావవంతంగా, బాధ్యతాయుతంగా ఉండాలి.ఎన్నికైన ప్రతినిధులు ప్రజల మధ్య ఉండాలి.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కార్యరూపంలోకి తేవాలి. ప్రజలు ఐదేళ్లకు ఒకసారి మాత్రమే కాకుండా ప్రతిరోజు పాలననుమూల్యాంకనం చేస్తారు. మొత్తానికి, 16వ తేదీ ప్రమాణ స్వీకారంతో కొత్త పురపాలక వర్గాలు కొలువుదీరనున్నాయి. ఇది కేవలం అధికార స్వీకారంకాదు ప్రజలవిశ్వాసాన్ని నిలబెట్టుకునే సంకల్పం.ప్రజాస్వామ్య పండుగ విజయవంతంగా ముగిసిన ఈ దశలో, అభివృద్ధియుగానికి శ్రీకారం చుట్టే బాధ్యత ఇప్పుడు ఎన్నికైన నాయకత్వంపై ఉంది.వారు సమగ్ర దృష్టితో, పారదర్శక పరిపాలనతో ముందుకుసాగాలి. ●

# ఇకనైనా విశ్వవిద్యాలయాల్లోకి ఆచార్యులొచ్చేనా?

డా.పోలం సైదులు

దేశాభివృద్దిలో విద్య ప్రాధాన్యత గురించి వేరే చెప్పనక్కరలేదు. అందులో ప్రామాణికత కలిగిన ఉన్నతవిద్య ఎంతో అవసరం. అందుకే దేశవ్యాప్తంగా 1338 విశ్వవిద్యాలయాలుంటే అందులో 56 కేంద్ర విశ్వవిద్యాలయాలు, 416కి పైగా వివిధ రాష్ట్రప్రభుత్వ పరిధిలోగల విశ్వవిద్యాలయాలు, 130కిపైగా డీమ్డ్ విశ్వవిద్యాలయాలు, 430కిపైగా ప్రైవేటు విశ్వవిద్యాలయాలు, ఇంకా పలు జాతీయ, రాష్ట్ర విద్యాసంస్థలు నెలకొనగా అందులో 43 మిలియన్ విద్యా ర్థులు ఉన్నతవిద్యను అభ్యసిస్తున్నారు.ఒక విశ్వవిద్యాలయం పరిపూర్ణంగా పనిచేయాలంటే దానికి యూనివర్సిటీగ్రాంట్స్ కమిషన్ నుంచి వచ్చేనిధులు, ప్రభుత్వ నిధులు సకాలంలో అందాలి. అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, ప్రయోగ వసతులు పూర్తిస్థాయిలో ఉండాలి. వీటితోపాటు విద్యార్థులకు తమ విద్యనభ్యసించుటలో భాగంగా ఏలాంటి ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా సకాలంలో స్కాలర్షిప్స్ ఫెలోషిప్‌లు అందాలి. అందులో భాగంగానే దేశవ్యాప్తంగానున్న విశ్వ విద్యాలయాలల్లో ఖాళీగానున్న ఆచార్య, సహాచార్య కొలు వులభర్తీ ప్రక్రియను మొదలుపెట్టి వీలైనంత త్వరగా పూర్తి చేయాలని యూనివర్సిటీ గ్రాంట్ కమీషన్ కోరి సంవత్సరాలు గడిచిపోతున్న ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా మారిపోయింది. ప్రత్యేకంగా తెలంగాణ రాష్ట్రానికి వచ్చేసరికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2013లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకం చేపడితే, ఆ తర్వాత 2014లో తెలంగాణ నూతనంగా రాష్ట్రంగా సిద్ధించాక ఏర్పడిన బిఆర్‌ఎస్ ప్రభుత్వం 2018లో యూనివర్సిటీ కొలువుల రిక్రూట్మెంట్‌కు సంబంధించి1061 పోస్టుల భర్తీకి అనుమతినిస్తే,అప్పటి గవర్నర్ దానిని రాష్ట్రపతి ఆమోదం కోసం పంపితేపెండింగ్‌లోకి పడిపోయింది.అప్పటినుండి ఇప్పటివరకు యూనివర్సిటీ కొలువుల నోటిఫికేషన్‌ను నోచుకోలేని పరిస్థితి దాపురించింది. కొలువులొస్తాయనే కోటి ఆశలతో విద్యార్థులు ఉద్యమంలో పాల్గొని సాధిస్తే ముమ్మాటికీ వారిఆశలు నిరాశలే అయ్యాయని చెప్పడంలో ఎలాంటి అనుమానంఅక్కరలేదు. రాష్ట్రంలో అభివృద్ధికని చెప్పుకునే ఎన్ని కార్యక్రమాలు చేపట్టిన,ఎంత పేరు ప్రఖ్యాతులు గావించిన,నియామకాల విషయంలో మాత్రం నిరుద్యోగులపాలిట శాపంగానే మారిపోయిందని చెప్పవచ్చు. తెలంగాణ రాష్ట్రంలోనున్న 11 యూనివర్సిటీలలో భోదనసిబ్బందికి సంబంధించి 2878 పోస్టులుంటే అందులో కేవలం 753 రెగ్యులర్ సిబ్బంది పనిచేస్తున్నారు. అంటే 2125 పోస్టులు (74శాతం) ఖాళీగా ఉన్నాయి. పరిశోధక విద్యార్థులకు గైడ్‌గా కొనసాగాలన్నా, నాణ్యమైన పరిశోధకపత్రాలను సమర్పించాలన్నా, కేంద్రం నుండి ప్రాజెక్టులు నిధులు రావాలన్న ప్రొఫెసర్ల పాత్ర చాలా కీలకంగా ఉంటుంది. కానీ అన్నీ యూనివర్సిటీలలో



చాలా డిపార్ట్మెంట్‌లలో ఒక్క రెగ్యులర్ ప్రొఫెసర్ లేకపోవడం శోచనీయం. రాష్ట్రంలో అన్నీ యూనివర్సిటీలలో కలిపి 393 ప్రొఫెసర్లకు 212 ఖాళీలు,913 అసోసియేట్ ప్రొఫెసర్లకు 792 ఖాళీలు,1572 అసిస్టెంట్ ప్రొఫెసర్లకు 1114 ఖాళీలున్నాయంటే పరిస్థితి ఎంత ప్రమాదకరంగా ఉన్నదో అర్థమవుతుంది.పదివేలమంది విద్యార్థులున్న ఆర్జీయుకేటిలో 146 సాంక్షన్ పోస్టులుంటే 19మంది మాత్రమే రెగ్యులర్ సిబ్బంది పనిచేయడం విడ్డూరమైతే,అందులో సైతం కొందరు సెలవులలో ఉండటం గమనార్హం.ఇంచుమించు మిగతా యూనివర్సిటీలలో కూడా అదేతంతు కొనసాగుతుండడం చూస్తుంటే గత దశాబ్దన్నర కాలంగా యూనివర్సిటీలలో చదివే విద్యార్థులకు ఎలాంటి విద్యను అందిస్తున్నామో అవగతమవుతుంది.ప్రత్యేకంగా యూనివర్సిటీలలో ఆచార్య కొలువులకు అర్హతలెలా ఉండాలో గతంలోనే హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఆచార్య ఘంటా చక్రపాణి నేతృత్వంలో నియమించిన కమిటీ పరిశోధించి నివేదికను రచించి అందులో అర్హతలకు సంబంధించి డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పూర్తిచేయాలి లేదా నెట్,సెట్,జేఆర్ ఎఫ్క్వాలిఫైడ్ అయ్యివుండి,అకాడమీక్ రికార్డ్,రీసెర్చ్ పెరఫార్మెన్స్,టీచింగ్ స్కిల్స్ మరియు ఇంటర్వ్యూ ఆధారంగా నియమించాలని నివేదికను ప్రభుత్వానికి అందించడం జరిగింది. కానీ కాంట్రాక్ట్ సిబ్బంది తమకు న్యాయం చేయాలనే డిమాండ్‌ను తెరమీదకు తేవడంతో నియామకాలు చేపట్టకుండా ఆపివేయశారు.దాదాపు ఈ అర్హతలు సాధించాలంటే 30 నుండి 40 సంవత్సరాలు వయసు పడుతుంది.ఇలాంటి పోస్టులను గతంలో భర్తీచేసి దశాబ్దన్నరకాలం గడిచిన మరల అంతటి అదృష్టాన్ని నోచుకోలేకపోయిందని చెప్పవచ్చు.అంటే అభ్యర్థులకు వారికి పదవీవిరమణ వయసువచ్చిన ఆశ్చర్యపోనక్కరలేదు. ప్రభుత్వాలు తలుచుకుంటే ఇది పెద్దసమస్య కానే కాదు. కానీ కారణాలు మాత్రం సగటు మనిషికి ఒకింత అనుమానాన్ని కలిగిస్తాయని చెప్పవచ్చు.మొదట ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కొలువుల భర్తీచేస్తే తెలంగాణ ప్రాంతంవారికీ అన్యాయం జరుగుతుందని భావించి, ప్రతివిద్యార్థి ఉద్యమంలో పాల్గొని,తెలంగాణ ఆవిర్భావంలో విద్యార్థులు, నిరుద్యోగులు కీలకపాత్ర పోషించారని యావత్తు ప్రపంచానికి జగమెరిగిన నగ్నసత్యమే. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించాక ముందుగా యూనివర్సిటీలకు శాశ్విత వైస్ ఛాన్సలర్ లేమితో రోస్టర్ సిస్టమ్‌ను త్వరగా చేయడానికి కుదరలేదని తర్వాత కొంతకాలానికి అన్నీ యూనివర్సిటీలకు వైస్ ఛాన్సలర్ లను నియమించి,యూనివర్సిటీలు సక్రమంగా నడవడానికి కృషిచేస్తున్నట్లు,రేపోమాపో భర్తీప్రక్రియ పూర్తవుతుందన్నట్లు దినపత్రికల్లో ప్రకటనలు కాస్తా ఎదురుచూసే అర్హులకు భరోసా ఇచ్చినట్లు కనిపించాయి. కానీ సాంకేతికపరమైన కారణాలతో ఖాళీల భర్తీకి నోచుకోలేదు. చూస్తుండగానే రెండుసంవత్సరాల వీసీల పదవీకాలం ముగిసి, కొంతకాలం మరల ఇంచార్జ్ ఐఎఎస్ ఆఫీసర్‌లతో నెట్టుకొచ్చారు.రెగ్యులర్ ఉపకులపతులున్నప్పుడే సాధ్యపడని పనులు, ఇంచార్జ్‌ల పాలనలో పనివత్తిడి కారణంగా సరైనదృష్టి కేంద్రీకరించలేకపోయరన్నారు.చూస్తుండగానే రెండు పర్యాయాలు బిఆర్‌ఎస్ పార్టీ పాలన కొనసాగించింది.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉపకులపతుల నియామకం చేపట్టింది.మరల వారి పదవులు ముగిసేసమయం ఆసన్నమవుతున్నా కాలయాపనే జరుగుతుంది. ●

# 'ఆధార్'తో మరింతగా వ్యక్తిగత భద్రత




## మార్పులు, చేర్పులతో కొత్త కార్డులు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15:** ఆధార్ మోసాలను అరికట్టేందుకు కొత్తగా విశిష్టగుర్తింపు ప్రాధికార సంస్థ మార్పులుచేర్పులు చేస్తోంది. ఆధార్ కార్డు ఫోటోకాపీల ద్వారా జరుగుతున్న మోసాలు, వ్యక్తిగత సమాచార దుర్వినియోగానికి అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) ఈ కీలక మార్పులను ప్రతిపాదించింది. ఈ కొత్త విధానం అమల్లోకి వస్తే, భౌతిక ఆధార్ కార్డుపై ఇకపై వ్యక్తిగత వివరాలు కనిపించవు. ప్రస్తుతం మనం బ్యాంకు ఖాతా తెరిచేందుకు, సిమ్ కార్డు కొనుగోలు చేసేందుకు, ప్రభుత్వ పథకాలు పొందేందుకు ఆధార్ కార్డు ఫోటోకాపీలను ఇస్తున్నాం. ఈ కార్డు లపై 12 అంకెల ఆధార్ నంబర్‌తో పాటు పేరు, పుట్టిన తేదీ, చిరునామా వంటి అత్యంత సున్నితమైన సమాచారం ముద్రించి ఉంటోంది. ఈ ఫోటోకాపీలు నేరగాళ్ల చేతికి చిక్కితే గుర్తింపు చోరీ (ఐడెంటిటీ థెఫ్ట్), ఆర్థిక మోసాలు జరిగే ప్రమాదం ఎక్కువగా ఉందని యూఐడీఏఐ గుర్తించింది. ఈ సమస్యను అధిగమించేందుకు, కొత్తగా జారీ చేయబోయే ఆధార్ కార్డులపై కేవలం కార్డుదారుడి ఫోటో, ఒక ప్రత్యేకమైన ఎన్‌క్రిప్టెడ్ క్యూఆర్ కోడ్ మాత్రమే ప్రదర్శించాలని యూఐడీఏఐ యోచిస్తోంది. ఆధార్ నంబర్, చిరునామా వంటి వివరాలన్నీ ఈ క్యూఆర్ కోడ్‌లో భద్రంగా నిక్షిప్తమై ఉంటాయి. గుర్తింపు ధృవీకరణ అవసరమైనప్పుడు, సంబంధిత సంస్థలు తమ వద్ద ఉన్న అధీకృత యాప్‌ల ద్వారా ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి వివరాలను సరిచూసుకుంటాయి. దీనివల్ల కేవైసీ ప్రక్రియ వేగవంతం అవ్వడమే కాకుండా, వ్యక్తిగత సమాచారానికి పూర్తి భద్రత లభిస్తుంది. గత ఏడాది నుంచే ఈ మార్పులపై కసరత్తు జరుగుతోందని, త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వెలువడవచ్చని తెలుస్తోంది. ఆధార్ ఫోటోకాపీల ద్వారా జరిగే దుర్వినియోగాన్ని అరికట్టేందుకు కొత్త నిబంధనలు తీసుకొస్తున్నామని యూఐడీఏఐ సీఈవో భువనేశ్ కుమార్ ఇటీవలే ఒక సమావేశంలో స్పష్టం చేశారు. ఇటీవల విడుదల చేసిన కొత్త ఆధార్ మొబైల్ యాప్‌లో కూడా లాగిన్ అయిన తర్వాత కేవలం ఫోటో,

క్యూఆర్ కోడ్ మాత్రమే కనిపించేలా మార్పులు చేసిన విషయం తెలిసిందే. ఈ ప్రతిపాదన అమలైతే ఆధార్ గోప్యత మరింత పటిష్ఠం అవుతుందని, మోసాలకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట పడుతుందని సాంకేతిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



# రేపు బంగ్లాలో కొత్త సర్కార్

## ప్రధాని మోడీకి ప్రత్యేక ఆహ్వానం

## భారత్ తరఫున స్పీకర్ ఓం బిర్లా హాజరు

**న్యూఢిల్లీ/ఢాకా:** బంగ్లాదేశ్‌లో మంగళవారం కొత్త ప్రభుత్వం కొలువుదీరనుంది. బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బిఎన్‌పి) ఛైర్మన్ తారిక్ రెహమాన్ నేతృత్వంలో సర్కారు ఏర్పాటు కానుంది. ఇటీవల ఎన్నికల్లో బిజెపి ఘనవిజయం సాధించిన విషయం తెలిసిందే. ఇదిలాఉండగా, ప్రధానమంత్రిగా తారిక్ రెహమాన్ ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమానికి రావాలంటూ భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీకి ఆ దేశ ప్రభుత్వం ప్రత్యేకంగా ఆహ్వానించింది. ఇప్పటికే తారిక్ రెహమాన్‌కు ప్రధాని మోడీ ఫోన్‌లో శుభాకాంక్షలు తెలియజేశారు. బంగ్లాదేశ్ ప్రభుత్వం ఆహ్వానం మేరకు, కొత్తగా ఎన్నికైన బంగ్లాదేశ్ ప్రభుత్వ ప్రమాణ స్వీకారోత్సవంలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా భారత ప్రభుత్వం తరపున పాల్గొంటారని విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. "స్పీకర్ ఈ ముఖ్యమైన కార్యక్రమంలో పాల్గొనడం భారతదేశం, బంగ్లాదేశ్ ప్రజల మధ్య లోతైన, శాశ్వతమైన స్నేహాన్ని నొక్కి చెబుతుంది, ఇది మన రెండు దేశాల బంధం, ప్రజాస్వామ్య విలువలకు భారతదేశం దృఢమైన నిబద్ధతను పునరుద్ఘాటిస్తుంది" అని పేర్కొంది. "భాగస్వామ్య చరిత్ర, సంస్కృతి, పరస్పర గౌరవం ద్వారా ఐక్యమైన పొరుగువారిగా, తారిక్ రెహమాన్ నాయకత్వంలో ఎన్నికైన ప్రభుత్వానికి బంగ్లాదేశ్ పరివర్తనను భారతదేశం స్వాగతిస్తుంది, ఆయన దార్శనికత, విలువలు ప్రజల అఖండ ఆదేశాన్ని పొందాయి" అని అది పేర్కొంది. బంగ్లాదేశ్ 13వ జాతీయ పార్లమెంటరీ ఎన్నికల్లో ఎన్నికైన సభ్యులు మంగళవారం, ఫిబ్రవరి 17న ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎ.ఎం.ఎం. నాసిర్ ఉద్దీన్ నిర్వహిస్తారు. తాత్కాలిక ప్రభుత్వ ప్రధాన సలహాదారు కార్యాలయం, న్యాయ మంత్రిత్వ శాఖ, తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి ఏర్పాట్లు చేశాయి. జాతీయ సంసద్ సచివాలయంలో ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఇప్పటికే సన్నాహాలు జరుగుతున్నాయి. సాంప్రదాయకంగా, ఈ వేడుక జాతీయ సంసద్ భవన్‌లోని నియమించబడిన ప్రమాణ స్వీకార గదిలో జరుగుతుంది. ఫిబ్రవరి 17, మంగళవారం సాయంత్రం ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని జాతీయ సంసద్ సెక్రటేరియట్ కార్యదర్శి కనిజ్ మోలా తెలిపారు.

## గవర్నర్‌ను దూషించిన కేసులో డిఎంకెనేతకు జైలు

**చెన్నై, ఫిబ్రవరి 15:** తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో డీఎంకే నేత శివాజీ కృష్ణమూర్తి కి మూడేళ్ల జైలుశిక్ష పడింది. గవర్నర్‌తోపాటు బీజేపీ నాయకురాలు ఖుష్బూ, అన్నాడీఎంకే నేతలపై కూడా గతంలో ఆయన చేసిన అనుచిత వ్యాఖ్యలకు జైలుశిక్షతోపాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ చెన్నైలోని ఎగ్మోర్ మెట్రో పాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు తీర్పునిచ్చింది. కాగా 2023లో రాష్ట్ర అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగంలో కొన్ని అంశాలను చదవకపోవడాన్ని తప్పుబడుతూ.. కృష్ణమూర్తి అవమానకరమైన వ్యాఖ్యలు చేసినట్లు గవర్నర్ తరఫు న్యాయవాది చెప్పారు. ఆయన వ్యాఖ్యల వీడియో వైరల్‌గా మారడంతో అప్పట్లోనే చెన్నైలోని కొడుంగయ్యూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. తాజాగా ఈ కేసుపై విచారణ చేపట్టిన న్యాయస్థానం డీఎంకే నేతకు జైలుశిక్ష విధించింది.

# సైన్యానికి బదులు పొట్ట పెంచుతున్నారు

## హంగరీ ప్రధానిపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఎద్దేవా

**కీవ్, ఫిబ్రవరి 15:** రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు సన్నిహితుడైన హంగరీ ప్రధాని విక్టర్ ఓర్బన్‌పై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తీవ్ర విమర్శలు చేశారు. రష్యాతో యుద్ధంలో కీవ్‌కు మద్దతు ఇవ్వడానికి హంగరీ వెనకడుగు వేస్తుండడంపై జెలెన్‌స్కీ మాట్లాడుతూ.. విక్టర్ ఓర్బన్ ప్రాంతీయ భద్రత కంటే దేశీయ రాజకీయాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. సొంత ప్రయోజనాల కోసం ఐరోపా దేశాల భద్రతను నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. ఆయన దేశంలో సైన్యాన్ని పెంచకుండా.. పొట్టను పెంచుకుంటున్నారని ఎద్దేవా చేశారు. మరోవైపు రష్యాతో కొనసాగుతోన్న ఉద్రిక్తతల నేపథ్యంలో రక్షణ ఉత్పత్తుల తయారీని వేగవంతం చేయాలని ఐరోపా దేశాలను కోరారు. యుద్ధ విరమణ అమలు కోసం మాస్కోపై ఒత్తిడి పెంచాలని.. లేదంటే రష్యా మరిన్ని దాడులకు పాల్పడే అవకాశం ఉందన్నారు. రష్యాతో యుద్ధాన్ని ఆపడానికి ఐరోపా దేశాలు ఉక్రెయిన్‌కు మద్దతుగా నిలుస్తుండగా.. హంగరీ మాత్రం రష్యాకు సహాయం చేస్తూ వస్తోంది. ఆ దేశంపై యూరప్ దేశాలు విధించే ఆంక్షలను పలుమార్లు అడ్డుకోవడానికి ప్రయత్నించింది. యుద్ధం సమయంలో కీవ్‌కు అదనపు నిధులు, ఆయుధాలు నేరుగా సరఫరా చేయాలని ఇయు దేశాలు ఇచ్చిన పిలుపును ప్రతిఘటించింది. అంతేకాకుండా పుతిన్‌తో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తోంది. ఈ నేపథ్యంలో తాజాగా జెలెన్‌స్కీ ఈ వ్యాఖ్యలు చేశారు. దాదాపు నాలుగేళ్లుగా సాగుతున్న యుద్ధానికి తెరదించే ప్రయత్నాల్లో భాగంగా ఉక్రెయిన్, రష్యా ప్రతినిధులు ఇప్పటికే పలుమార్లు సమావేశమయ్యారు. అబుదాబి వేదికగా ఇటీవల నిర్వహించిన రెండు విడత



భేటీలో అమెరికా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్, ఆ దేశాధ్యక్షుడు ట్రంప్ అల్లుడు జేర్డ్ కుష్నర్ తదితరులు పాల్గొన్నారు. అయితే, ఇరుపక్షాలూ పరస్పరం ప్రత్యేకమైన డిమాండ్లను వీడకపోవడంతో ఎటువంటి పురోగతి లభించలేదు. డాన్‌బాస్ నుంచి వైదొలగాలని కీవ్‌పై మాస్కో ఒత్తిడి తెస్తోంది. ఈ షరతును ఎప్పటికీ అంగీకరించబోమని ఉక్రెయిన్ స్పష్టం చేస్తోంది.

## అరుదైన కప్ప విషంతో అలెక్స్ నవాల్ని హత్య

**మ్యూనిచ్, ఫిబ్రవరి 15:** రష్యన్ విపక్ష నేత అలెక్సీ నావల్నీ మృతిపై అత్యంత అరుదైన కప్పవిషం ఇచ్చి హత్యచేసారన్న వివరాలు సంచలనం కలిగించాయి. ఈ ఉదంతం వెనుక రష్యా ప్రభుత్వ హస్తం ఉందని బ్రిటన్‌తో సహా ఐదు యూరోపియన్ దేశాలు తీవ్రంగా ఆరోపించాయి. ఆ దేశాలు సంయుక్త ప్రకటన కూడా విడుదల చేశాయి. నావల్నీ శరీరం నుంచి సేకరించిన నమూనాలను పరిశీలించగా, "ఎపిబాటిడిన్" అనే శక్తివంతమైన న్యూరోటాక్సిన్ ఆనవాళ్లు ఉన్నట్లు ఈ దేశాలు ధృవీకరించాయి. దక్షిణ అమెరికాలో కనిపించే విషపు కప్పల చర్మం నుంచి ఈ విషాన్ని సేకరిస్తారు. రష్యాలో ఇది సహజంగా లభించదని,

ఈ విషాన్ని ఉపయోగించే సామర్థ్యం, ఉద్దేశం, అవకాశం రష్యా ప్రభుత్వానికి మాత్రమే ఉన్నాయని ఆ దేశాలు స్పష్టం చేశాయి. ఈ ఆరోపణలతో బ్రిటన్,

ఫ్రాన్స్, జర్మనీ, స్వీడన్, నెదర్లాండ్స్ దేశాలు రష్యాపై రసాయన ఆయుధాల నిషేధ సంస్థకు ఫిర్యాదు చేశాయి.

## ఓ పక్క సిఎం పదవికోసం ఆధిపత్యపోరు!



**బెంగళూరు, ఫిబ్రవరి 15:** కర్ణాటక రాజకీయాల్లో డీకే శివకుమార్, సిద్ధ రామయ్య మధ్య సీఎం పదవి కోసం గత కొంత కాలంగా ఒక రకమైన పోటీ నెలకొన్న సంగతి తెలిసిందే. అయితే తాజాగా విస్తుపోయే సంఘటన చోటుచేసుకుంది. కర్ణాటకలోని హావేరీలో జరిగిన భారీ బహిరంగ సభలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నిలువెత్తు విగ్రహాన్ని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ స్వయంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం ద్వారా ఇద్దరి మధ్య ఆధిపత్య పోరు ఉందనే ప్రచారానికి పూర్తి చెక్ పెట్టినట్లు కనిపిస్తోంది. సిద్ధరామయ్య నాయకత్వంలో కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనను విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ విగ్రహావిష్కరణ జరిగింది. పార్టీలో ఐక్యతను, సమష్టి కృషిని ప్రజలకు చాటడమే ఈ కార్యక్రమం లక్ష్యమని డీకే శివకుమార్ స్పష్టం చేశారు. గ్యారంటీ పథకాల అమలులో సిద్ధరామయ్య పోషించిన పాత్రను కొనియాడుతూ, ఆయన చరిత్రలో ప్రజా నాయకుడిగా నిలిచి పోతారని అన్నారు. విగ్రహాన్ని ఆవిష్కరించిన తర్వాత సిద్ధరామయ్యకు డీకే శివకుమార్ ఆత్మీయ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇద్దరూ ఒకే వేదికపై కనిపించడం, ఒకరినొకరు గౌరవించడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. సిద్ధరామయ్య సైతం తన విగ్రహాన్ని డీకే ఆవిష్కరించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఇది తన వ్యక్తిగత గౌరవం మాత్రమే కాదు, కాంగ్రెస్ పార్టీ సమష్టి కృషికి దక్కిన గుర్తింపని ఆయన వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి పదవి రేసులో ఎప్పుడూ పోటీపడే ఈ ఇద్దరు నేతల మధ్య ఇలాంటి ఐక్యతను చూపడం రాష్ట్ర రాజకీయాలకు కొత్త సంకేతంగా మారింది.

**మరోపక్క ఐక్యత చాటుతూ విగ్రహాల ఆవిష్కరణ**

# ఎవరి ఒత్తిళ్లకూ భారత్ తలొగ్గదు

## - రష్యా చమురు కొనుగోళ్లలోనూ అంతే: జైశంకర్



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15:** రష్యన్ ముడి చమురు కొనుగోళ్లను అరికట్టడానికి భారత్ అంగీకరించిందని వాషింగ్టన్ నుండి వచ్చిన తాజా వాదనల మధ్య, భారతదేశం తన స్వంత నిబంధనలపై తన ఇంధన విధానాన్ని నిర్ణయిస్తుందని పునరుద్ఘాటించింది. మ్యూనిచ్ భద్రతా సమావేశంలో విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ మాట్లాడుతూ, ఇంధన ఎంపికలు "ఖర్చులు, నష్టాలు, లభ్యత" ద్వారా మార్గనిర్దేశం చేయబడతాయని అన్నారు, కొత్తగా ప్రకటించిన అమెరికా- భారత్ వాణిజ్య ఒప్పందం, రష్యన్ చమురు దిగుమతులపై ఒత్తిడి ఉన్నప్పటికీ భారతదేశం వ్యూహాత్మక స్వయంప్రతిపత్తికి దృఢంగా కట్టుబడి ఉందని జైశంకర్ స్పష్టం చేశారు. ఈ విషయంలో భారతదేశం వ్యూహాత్మక స్వయంప్రతిపత్తికి దృఢంగా కట్టుబడి ఉందని జైశంకర్ పేర్కొన్నారు. "మేము వ్యూహాత్మక స్వయంప్రతిపత్తికి చాలా కట్టుబడి ఉన్నాము ఎందుకంటే ఇది మన చరిత్ర, మన పరిణామంలో చాలా భాగం. ఇది చాలా లోతైనది, ఇది రాజకీయ వర్ణపటాన్ని కూడా కత్తిరించే విషయం" అని ఆయన అభిప్రాయపడ్డారు. అదనపు రష్యన్ చమురు కొనుగోలును ఆపడానికి భారత్ అంగీకరించిందని డొనాల్డ్ ట్రంప్, మార్కో రూబియో చేసిన వాదనల మధ్య జైశంకర్ వ్యాఖ్యలకు ప్రాధాన్యత సంతరించుకుంది. చమురు కంపెనీలు తమ ప్రయోజనాల కోసం నిర్ణయాలు తీసుకునే ముందు లభ్యత, ఖర్చులు, నష్టాలను పరిశీలిస్తాయని జైశంకర్ పేర్కొన్నారు. అమెరికాతో ఇటీవల జరిగిన వాణిజ్య ఒప్పందం ప్రకారం భారతదేశం రష్యన్ చమురు కొనుగోలును ఆపివేస్తుందా అని అడిగినప్పుడు, భారతదేశం స్వతంత్ర దృక్పథంతో ఉంటుందని, ఇతరులతో పొత్తు పెట్టుకొని నిర్ణయాలు తీసుకోవచ్చని ఆయన బదులిచ్చారు.

## సంక్షిప్తంగా..

### అణుఒప్పందంపై రాజీకి ఇరాన్ సిద్ధం!



**టెహ్రాన్, ఫిబ్రవరి 15:** అమెరికాతో చర్చలు కొనసాగుతున్న వేళ.. అణు ఒప్పందంపై రాజీకి వచ్చేందుకు ఇరాన్ సిద్ధమైంది. యుఎస్‌తో న్యూక్లియర్ డీల్ కుదుర్చుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించింది. అయితే, తమపై ఉన్న ఆంక్షలను ఎత్తివేయాలని షరతు పెట్టింది. ఈ మేరకు ఇరాన్ మంత్రి మాజిద్ తఖ్తా ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. మాజిద్ మాట్లాడుతూ.. ఒప్పందం కుదుర్చుకోవడానికి బంతి అమెరికా కోర్టులో ఉందని వ్యాఖ్యానించారు. 'ఆంక్షలను ఎత్తివేయడం గురించి మాట్లాడేందుకు వారు సిద్ధమైతే.. మా అణు కార్యక్రమాలకు సంబంధించిన అంశాలపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నాం' అని అన్నారు. అయితే, అన్ని ఆంక్షలు ఎత్తివేయాలా? లేదా పాక్షిక ఉపశమనం కోరుకుంటున్నారా? అనే విషయాన్ని ఆయన స్పష్టం చేయలేదు.

### బిల్‌బోర్డు కూలిన ప్రమాదంలో సమాజ్‌వాది నేత మృతి



లక్నో,ఫిబ్రవరి 15: రోడ్డుపై వెళ్తున్న కారుపై హైమాస్ట్ బిల్‌బోర్డ్ స్తంభం కూలింది. ఆ కారు నడుపుతున్న సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) నేత ఈ ప్రమాదంలో మరణించారు. ఈ సంఘటన చూసి స్థానికులు షాక్ అయ్యారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఉత్తరప్రదేశ్‌లోని ప్రతాప్‌గఢ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఆదివారం మధ్యాహ్నం అంటూ పోలీస్ స్టేషన్ పరిధిలోని బాబుగంజ్ మార్కెట్ సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద కొత్తగా హైమాస్ట్ బిల్‌బోర్డ్ ఏర్పాటు చేస్తున్నారు. ఆ రోడ్డుపై ఒక కారు వెళ్తున్నది. అయితే కొత్తగా నిర్మిస్తున్నహైమాస్ట్ బిల్‌బోర్డ్ పోల్ కూలిపోయింది. కదులుతున్న కారుపై అది పడింది. కారు డ్రైవ్ చేస్తున్న 48 ఏళ్ల ఎస్పీ నేత లాల్ బహదూర్ యాదవ్ తీవ్రంగా గాయపడ్డారు. కారులోనే ఆయన మరణించారు.

### మ్యూనిచ్ సదస్సులో ఆసిమ్‌మునీర్‌కు చేదు అనుభవం!



**మ్యూనిచ్(జర్మనీ), ఫిబ్రవరి 15:** పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్‌కు జర్మనీలో ఓ ఇబ్బందికర పరిస్థితి ఎదురైంది. మ్యూనిచ్‌లో జరుగుతున్న అంతర్జాతీయ భద్రతా సదస్సుకు హాజరైన ఆయనను ఓ సెక్యూరిటీ అధికారి అడ్డుకున్నారు. ఆయన తన గుర్తింపు కార్డు (ఐడీ కార్డ్)ను సరిగా ప్రదర్శించలేదని అభ్యంతరం తెలిపారు. ఈ ఘటనకు సం బంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సదస్సు ప్రాంగణంలోకి ప్రవేశించడానికి కొద్ది క్షణాల ముందు ఈ సంఘటన జరిగింది. అసిమ్ మునీర్ మెడలో ఐడీ కార్డు లేకపోవడంతో, సెక్యూరిటీ అధికారి ఆయనను ఆపారు. దాంతో, మునీర్ పక్కనున్న మరో పాక్ సైనికాధికారి తన చేతిలో ఉన్న కార్డును చూపించడంతో, ఆ సెక్యూరిటీ అధికారి ముందుకు పోయేందుకు అనుమతించారు.

### అదృశ్యం అయిన సాకేత్ మృతదేహం లభ్యం

**శాన్‌ఫ్రాన్సిస్కో, ఫిబ్రవరి 15:** అమెరికాలో భారతీయ విద్యార్థి అదృశ్యం కేసు విషాదాంతంగా ముగిసింది. యూనివర్సిటీకి కిలోమీటర్ దూరంలోని అటవీ ప్రాంతంలో సాకేత్ శ్రీనివాసయ్య (22) మృతదేహం లభించింది. ఈ విషయాన్ని అమెరికాలో పోలీసులు వెల్లడించారు. శాన్‌ఫ్రాన్సిస్కోలోని భారత రాయబార కార్యాలయం కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించింది. కర్ణాటకలోని బెంగళూరుకు చెందిన సాకేత్ శ్రీనివాసయ్య ఐఐటీ మద్రాస్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాడు. అనంతరం ఉన్నత విద్యాభ్యాసం కోసం అమెరికా వెళ్లాడు. బర్కిలీలోని కాలిఫోర్నియా యూనివర్సిటీలో కెమికల్ అండ్ బయోమాలిక్యులర్ ఇంజనీరింగ్ విద్యను అభ్యసిస్తున్నాడు. ఈ క్రమంలో ఈనెల 9వ తేదీన అతను కనిపించకుండా పోయాడు. సాకేత్ స్నేహితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

### జమ్ముకాశ్మీర్‌లో ఎనిమిదివేల బ్యాంకు ఖాతాల స్తంభన

**శ్రీనగర్, ఫిబ్రవరి 15:** జమ్ముకశ్మీర్‌లో భారీ డిజిటల్ హవాలా రాకెట్ బయటపడింది. భారత వ్యతిరేక కార్యకలాపాలకు సంబంధించిన 8వేల బ్యాంకు ఖాతాలను దర్యాప్తు సంస్థలు స్తంభింపజేశాయి. జమ్ముకశ్మీర్‌లో భారీ ముఠాకు ఈ ఖాతాల నెట్‌వర్క్ ఉన్నట్లు భద్రతా సంస్థలు గుర్తించాయి. ఈ ఖాతాల్లోకి చేరే డబ్బు చివరికి వేర్పాటువాదం లేదా దేశ వ్యతిరేక కార్యకలాపాలకు మద్దతు ఇస్తున్నట్లు అధికారులు తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో గత మూడ్లేళుగా జమ్ముకశ్మీర్‌లో సుమారు 8వేలకు పైగా ఇలాంటి బ్యాంకు ఖాతాలను అధికారులు ఫ్రీజ్ చేశారు. జమ్ముకశ్మీర్‌లోకి అక్రమ ఆర్థిక నిధులపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) దృష్టి సారించింది.

# పెళ్లయిన 58 యేళ్లకు విడాకులు కోరిన జంట

## ఇవ్వలేమని తేల్చి చెప్పిన రాజస్థాన్ హైకోర్టు

**జైపూర్, ఫిబ్రవరి 15:** వివాహంజరిగిన 46 ఏళ్లకు, పిల్లలు కూడా పెద్దవాళ్లైన తర్వాత ఒక జంట విడాకులకు దరఖాస్తు చేసుకుంది. 2014లో ఈ దరఖాస్తుచేసారు.అప్పటిక వారి వివాహమై 58 ఏళ్లు. ఇప్పుడు కూడా అదే విడాకుల కేసు కోర్టులో ఉంది. వివాహమైన 58 ఏళ్ల తర్వాత ఈ జంట కోరుకుంటున్నట్లుగా విడాకులు ఇచ్చేందుకు రాజస్థాన్ హైకోర్టు నిరాకరించింది. దంపతుల పేర్లు వెల్లడికానప్పటికీ రాజస్థాన్‌కు చెందిన ఒక జంట జూన్ 29, 1967లో పెళ్లి చేసుకుంది. వారికి పిల్లలు కూడా ఉన్నారు. 46 ఏళ్లపాటు కలిసే ఉన్నారు. ఈ మధ్యలో చిన్నచిన్న తగాదాలు సహజమే. కానీ, 2013లో మాత్రం వీరి మధ్య అనేక విబేధాలు తలెత్తాయి. దీంతో వివాహమైన 47 ఏళ్లకు అంటే మే 26, 2014లో వీరు విడాకులకు దరఖాస్తు చేసుకున్నారు. అప్పట్లోనే భర్త దాఖలు చేసిన విడాకుల పిటిషన్‌ను భరత్‌పూర్ ఫ్యామిలీ కోర్టు కొట్టివేసింది. దీన్ని సవాలు చేస్తూ ఆయన తిరిగి రాజస్థాన్ హైకోర్టును ఆశ్రయించారు. ఇంతకాలం ఈ కేసు విచారణ సాగుతూనే ఉంది. తాజాగా జస్టిస్ సుదేశ్ బన్సల్, జస్టిస్ అనిల్ కుమార్ ఉప్మన్‌తో కూడిన హైకోర్టు బెంచ్ వీరి విడాకులపై విచారణ జరిపింది. విడాకులు ఇవ్వలేమని తేల్చి చెప్పింది. ఇందుకు సంబంధించి కేసు విచారణ వివరాల్ని కోర్టు వెల్లడించింది. తమ పేరు మీద ఉన్న ఆస్తిని తన పెద్ద కొడుక్కు ఇవ్వాలని భార్య నిర్ణయించుకుంది. ఇద్దరు కొడుకులకు సమానంగా ఇవ్వాలని భర్త అన్నారు. దీంతో ఈ అంశంపై ఇద్దరిమధ్యా బేధాభిప్రాయాలున్నాయి. తమ ఆస్తిని భర్త విడదీయాలనుకుంటున్నారని భార్య ఆరోపించింది. తన భర్తకు వేరే మహిళతో వివాహేతర సంబంధం ఉందని, ఒకసారి ఆమెను తమ ఇంటికే తీసుకొచ్చాడని కూడా భార్య ఆరోపించింది. ఇదే సమయంలో తన భార్య తనను నిర్లక్ష్యం చేస్తోందని ఆయన ఆరోపించారు. ఇవన్నీ విన్న ధర్మాసనం ఇవేమీ విడాకులు తీసుకోవడానికి తగిన కారణాలుగా కనిపించడం లేదని వ్యాఖ్యానించింది.

ఏవో కుటుంబ కలహాల కారణంగా ఒక జంటకు విడాకులు ఇవ్వలేమని, ఈ కారణాలు సరిపోవని వ్యాఖ్యానించింది. ఇన్నేళ్లుగా కలిసున్న ఈ జంట ఒకరినొకరు అర్థం చేసుకున్నారని, వారి మధ్య సహనం, అవగాహన ఉందని కోర్టు భావించింది. అందువల్ల ఈ చిన్న కారణాలకు 58 ఏళ్ల వైవాహిక జీవితం తర్వాత విడాకులు ఇవ్వలేమని చెప్పిన హైకోర్టు విడాకుల పిటిషన్‌ను కొట్టివేసింది.

## స్లీపర్‌క్లాస్‌లో కెనడా దంపతులకు వింత అనుభవం!


### మైమరపించిన భారతీయుల ఆతిథ్యం!

**జల్గావ్, ఫిబ్రవరి 15:** భారత్‌లో పర్యటిస్తున్న కెనడాకు చెందిన జంటకు భారతీయ రైలులో ఓ విచిత్రమైన, మధురమైన అనుభవం ఎదురైంది. పొరపాటున ప్రైవేట్ క్యాబిన్ బదులు స్లీపర్ క్లాస్ టికెట్ బుక్ చేసుకోవడంతో, ఏడు గంటల ప్రయాణంలో వారికి నిద్రే కరువైంది. అయినప్పటికీ, తోటి ప్రయాణికుల ఆప్యాయత, పిల్లల అల్లరికి ముగ్ధులై, ఈ అనుభవాన్ని ఎప్పటికీ మర్చిపోలేమంటూ సోషల్ మీడియాలో పంచుకున్న ఓ పోస్ట్ ప్రస్తుతం వైరల్ అవుతోంది. కెనడాకు చెందిన కిమ్ గ్రీన్‌వుడ్, తన స్నేహితుడితో కలిసి జల్గావ్ జంక్షన్ నుంచి చంద్రపుర వరకు 7 గంటల రైలు ప్రయాణం కోసం టికెట్లు బుక్ చేసుకున్నారు. ప్రశాంతంగా నిద్రపోవచ్చని భావించి స్లీపర్ క్యాబిన్ అనుకుని బుక్ చేయగా, అది అందరూ కలిసి ప్రయాణించే సాధారణ స్లీపర్ క్లాస్ అని రైలెక్కిన తర్వాత వారికి తెలిసింది. మొదట ఆశ్చర్యపోయినా, ఆ తర్వాత అక్కడి వాతావరణంలో వారు పూర్తిగా లీనమైపోయారు. కొద్దిసేపటికే వారి బెర్త్ చుట్టూ పిల్లలు చేరిపోయారు. విదేశీయులను చూడాలన్న కుతూహలంతో వారితో ఆటలు, మాటల్లో మునిగిపోయారు. తోటి ప్రయాణికులు తమ ఇంట్లో వండిన ఆహారాన్ని పంచుకోవడమే కాకుండా, స్టేషన్లలో ఆగినప్పుడు చాయ్, ఇతర తినుబండారాలు కొనిచ్చారని కిమ్ తన పోస్టులో పేర్కొన్నారు. "ఓ పెద్ద కుటుంబంలా అందరూ కలిసిపోవడం చూసి ఆశ్చర్యపోయాను. ఈ 7 గంటల నిద్రలేని ప్రయాణంలో పొందిన అనుభూతి వెలకట్టలేనిది" అని ఆమె వివరించారు. తాము పొందిన ఈ ప్రత్యేక అనుభవాన్ని "మా జీవితంలోనే అత్యంత సరదా రాత్రి" అంటూ కిమ్ గ్రీన్‌వుడ్ షేర్ చేసిన వీడియో, పోస్ట్ సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అవుతోంది.

# రైతులకు ద్రోహం చేస్తున్నట్లే!

## వాణిజ్య ఒప్పందంపై ప్రధానికి రాహుల్ ప్రశ్నలు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15:** అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోన్న తీరుపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ మరోసారి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వాణిజ్య ఒప్పందం పేరుతో భారతీయ రైతులు మోస పోవడాన్ని కళ్లారా చూస్తున్నామని, దేశ వ్యవసాయ సార్వభౌమత్వాన్ని రాజీ పడేలా చేస్తోందని ఉద్ఘాటించారు. ఇది తాత్కాలిక అంశం కాదని, రైతుల భవిష్యత్‌కు సంబంధించినదన్న ఆయన.. ఈ సందర్భంగా ప్రధాని మోడీకి ఐదు ప్రశ్నలు సంధించారు. డిడిజి (డ్రైడ్ డిస్టిల్లర్స్ గ్రెయిన్స్) దిగుమతి చేసుకోవడం అంటే ఏమిటి? జన్యుమార్పిడి చేసిన అమెరికన్ మొక్కజొన్న నుంచి తయారైన దాణాను భారతీయ పశువులకు తినిపించడం కాదా? ఇది మన పాల ఉత్పత్తి అమెరికా వ్యవసాయ పరిశ్రమపై ఆధారపడేలా చేయదా? జన్యుమార్పిడి చేసిన సోయాబీన్ ఆయిల్‌ను అనుమతిస్తే మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్‌లతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న సోయాబీన్ రైతులపై ప్రభావం పడదా? మీరు చెబుతున్న ఆ 'అదనపు ఉత్పత్తులు' అంటే ఏమిటి? కాలక్రమేణా పప్పు ధాన్యాలతోపాటు ఇతర అమెరికన్ పంటల దిగుమతులకు ద్వారాలు తెరవడమేనా? వాణిజ్యేతర అడ్డంకులను తొలగించడం అంటే ఏమిటి? జన్యు మార్పిడి పంటలపై తన వైఖరిని మార్చడం, ధాన్యం సేకరణను తగ్గించడం, కనీస మద్దతు ధర లేదా బోనస్‌లను తగ్గించడంపై భవిష్యత్తులో భారత్ ఒత్తిడిని ఎదుర్కోనుంది.



# జెండా మోసిన కార్యకర్తలకే మున్సిపల్ చైర్మన్ పీఠం

### జగిత్యాల ఎపిసోడ్‌కు ఫుల్‌స్టాప్..

### ఒక్కటైన జీవన్‌రెడ్డి, సంజయ్

### ప్రజాభవన్‌లో జగిత్యాల పంచాయితీ..

### అధిష్ఠానం కీలక నిర్ణయం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 15:** గత కొద్దిరోజులుగా జగిత్యాల కాంగ్రెస్ రాజకీయాల్లో సెగలు పుట్టించిన అంతర్గత విభేదాలు ఎట్టకేలకు సద్దుమణిగాయి. ఎఐసిసి సెక్రటరీ విశ్వనాథన్ సవాంగ్ రంగ ప్రవేశం చేసి, ఇరు వర్గాల నేతలతో జరిపిన చర్చలు సఫలమయ్యాయి. దీంతో జగిత్యాల ఎపిసోడ్‌కు ముగింపు పలికినట్లయింది. ఆదివారం ఏఐసీసీ సెక్రటరీ సవాంగ్.. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, మాజీమంత్రి జీవన్‌రెడ్డిలతో విడివిడిగా, అనంతరం కలిసి చర్చలు జరిపారు. పార్టీ అంతర్గత విషయాలను రోడ్డుపైకి తీసుకురావడం వల్ల కేడర్‌లో అయోమయం నెలకొంటుందని ఆయన సున్నితంగా హెచ్చరిం చారు. క్రమశిక్షణే ముఖ్యమని, పార్టీ తీసుకునే తుది నిర్ణయానికి ఇరువురు నేతలు కట్టుబడి ఉండాలని సవాంగ్ స్పష్టం చేశారు.

ఐక్యత చాటాలని, రాబోయే ఎన్నికలు, పార్టీ బలోపేతం దృష్ట్యా నేతలు కలిసి పనిచేయాలని సూచించారు. ఈ భేటీలో అత్యంత కీలకమైన నిర్ణయం పదవుల కేటాయింపు పై జరిగింది. పార్టీ కోసం కష్టపడి, జెండా మోసిన నిజమైన కార్యకర్తలకు, పాత తరం నాయకులకే మున్సిపల్ చైర్మన్ వంటి కీలక పదవులు ఇవ్వాలని కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయించింది. ఇది జీవన్‌రెడ్డి వర్గానికి కొంత ఊరటనిచ్చే అంశంగా కనిపిస్తోంది.తొలి నుంచి జీవన్ రెడ్డి వాదిస్తున్నట్లుగా.. పార్టీని నమ్ముకుని ఉన్న వారికే ప్రాధాన్యత ఇవ్వాలన్న సూచనను ఏఐసీసీ పరిగణనలోకి తీసుకున్నట్లు సమాచారం. సంజయ్ కుమార్ కూడా పార్టీ ప్రయోజనాల దృష్ట్యా సర్దుకుపోయేందుకు అంగీకరించినట్లు తెలుస్తోంది.

ఈ భేటీతో జగిత్యాల కాంగ్రెస్‌లో నెలకొన్న అనిశ్చితి తొలిగిపోయింది. నేతలు ఇద్దరూ కలిసి పనిచేస్తామని హామీ ఇవ్వడంతో కార్యకర్తలు ఊపిరి పీల్చుకుంటున్నారు. పదవుల పంపకంలో పార్టీ విధేయతకే పెద్దపీట వేయాలని నిర్ణయించడం ద్వారా పార్టీ కేడర్‌లో కొత్త ఉత్సాహం నింపే ప్రయత్నం కాంగ్రెస్ అధిష్టానం చేస్తోంది.

**ప్రజాభవన్‌లో జగిత్యాల పంచాయితీ**

ఆదివారం ఉదయం ప్రజాభవన్‌లో తన వర్గం కౌన్సిలర్లతో ఏఐసీసీ సెక్రటరీని జీవన్ రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ హైకమాండ్.. జగిత్యాల నాయకుల ముందు రెండు ప్రతిపాదనలు ఉంచినట్టు తెలుస్తోంది. ఒకటి.. చైర్మన్ పీఠం సంజయ్ వర్గానికి, వైస్ చైర్మన్ పదవి జీవన్ వర్గానికి. రెండో ప్రతిపాదనగా చెరో రెండున్నరేళ్లు చైర్మన్ పీఠం పంచుకునేలా ఇరు వర్గాలకు సూచించినట్టు సమాచారం. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి.. కాంగ్రెస్ జెండా మోసిన వారికే చైర్మన్ పీఠం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తన వర్గంతో చర్చించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని కోరారు. కాగా, కాంగ్రెస్ బిఫామ్‌పై గెలుపొందినవారు,ఇండిపెండెంట్లు, ఎంఐఎం కౌన్సిలర్లు కలిపి మొత్తం 23 మందితో కలిపి ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ శుక్రవారమే ప్రత్యేక క్యాంప్ ఏర్పాటు చేశారు.

ఈ క్రమంలో శనివారం 14 మంది అభ్యర్థులతో జీవన్‌రెడ్డి హైదరాబాద్ చేరుకున్నారు. రెండు వర్గాలు క్యాంప్ రాజకీయాలు మొదలు పెట్టడంతో జగిత్యాల మున్సిపల్ చైర్మన్ ఎన్నికపై ఉత్కంఠ నెలకొంది. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య సయోధ్య కుదుర్చేందుకు సీనియర్ నేతలు రంగంలోకి దిగారు. ఎఐసిసి ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ కూడా జీవన్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు.

# ముస్లింలపై జరుగుతున్న ద్వేష ప్రచారాలను తక్షణం ఆపాలి

### ఫుడ్ జిహాద్ పేరుతో కలహాలు రేపాలని కుట్ర

### ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ వలీఉల్లా ఖాద్రి

**హైదరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** ముస్లింలపై జరుగుతున్న ద్వేష ప్రచారాలను తక్షణం ఆపాలని ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్(ఏఐవైఎఫ్) డిమాండ్ చేసింది. మేడారం జాతరలో కోవా బన్ వ్యాపారి షేక్ జావేద్‌అలీపై యూట్యూబర్ల గుంపు లక్ష్యంగా చేసుకుని దాడి చేసిన ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్టు సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రీ తెలిపారు. ఈ ఘటన చట్ట పరిపాలనపై దాడిగా అభివర్ణించారు. ఫుడ్ జిహాద్ పేరుతో కలహాలు రేపే కుట్ర చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. దోషులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఖాద్రీ డిమాండ్ చేశారు. ఇటువంటి ఘటనలు మళ్లీ పునరావృతమైతే తమ సంఘం తరపున ఉద్యమాలను మరింత తీవ్రతరం చేస్తుందని హెచ్చరించారు. ముస్లింలపై జరుగుతున్న ద్వేష ప్రచారాలను తక్షణం ఆపాలని, లౌకిక విలువలను కాపాడాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ముస్లింలు, పేదలపై జరుగుతున్న ద్వేషప్రచారాలకు వ్యతిరేకంగా పోరాడా లని, సమాజంలో ఐక్యత, సమానత్వాన్ని కాపాడేందుకు ఏకమై పని చేయాలని పిలుపునిచ్చారు. మతం పేరుతో చిన్న వ్యాపారులు, కూలీలను లక్ష్యంగా చేసుకోవడం అమానుషమని, ఇది సామాజిక శాంతి, సామ రస్యానికి తీవ్రముప్పని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగ విలువలను కాపాడేందుకు, ప్రతి పౌరుడి గౌరవం, భద్రత, సమాన హక్కుల కోసం అవగాహన కార్యక్రమాలు, ప్రజాస్వామ్య ఆందోళనలు, ఐక్యత చర్యలను కొనసాగిస్తామని స్పష్టం సయ్యద్ వలీఉల్లా ఖాద్రీ స్పష్టం చేశారు.

# బయోఏషియా-2026తో గ్లోబల్ టెక్-బయో పవర్‌హౌస్‌గా తెలంగాణ

### కొత్త ఆవిష్కరణలు.. సరికొత్త ఆలోచనలకు కీలక వేదిక

### 17, 18 తేదీల్లో జరిగే సదస్సును ప్రారంభించనున్న సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 15:** గ్లోబల్ టెక్-బయో రంగంలో తెలంగాణను పవర్ హౌస్‌గా తీర్చిదిద్దేందుకు బయో ఏషియా 2026 సదస్సును ప్రజా ప్రభుత్వం హైదరాబాదులో ఫిబ్రవరి 17,18 తేదీల్లో నిర్వహిస్తున్నది.హెచ్ఐసీసీ 2 రోజుల పాటు బయోఏషియా సదస్సు జరగనున్నది. ప్రధానంగా హెల్త్ కేర్, లైఫ్ సైన్సెస్ రంగాలపై ఫోకస్ చేస్తుండగా, సుమా రు 50 దేశాల నుంచి 3వేల మంది ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొననున్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద గ్లోబల్ లైఫ్ సైన్సెస్, హెల్త్ కేర్ సదస్సుగా బయో ఏషియా సదస్సుకి ప్రత్యేక గుర్తింపు ఉన్నది. ఈ సదస్సును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి సంయుక్తంగా కలిసి ప్రారంభించ నున్నారు. 'టెక్-బయో అన్‌లీష్డ్:ఏఐ, ఆటోమేషన్ బయాలజీ రివల్యూషన్' అనే థీమ్ మీద సదస్సు జరగనున్నది.ఈ మేరకు సిఎం రేవంత్‌రెడ్డి కార్యాలయం ఆదివారం ఓ ప్రకటన విడుదల చేసింది. గ్లోబల్ లైఫ్ సైన్సెస్, హెల్త్ కేర్ రంగాల్లో నూతన ఆవిష్కరణలు, ఆలోచనలకు రాష్ట్రాన్ని వేదిక చేసేందుకు హైదరాబాద్‌లో ప్రజా ప్రభుత్వం ప్రతి ఏడాది ప్రతిష్టాత్మకంగా బయో ఏషియా సదస్సు నిర్వహిస్తోంది.

ప్రపంచ వ్యాప్తంగా బయోటెక్నాలజీ,ఔషధాలు,హెల్త్ రంగాలకు చెందిన నిపుణులు ఈ బయోఏషియా సదస్సులో పాల్గొన నున్నారు. లైఫ్ సైన్సెస్ రంగంలో ప్రపంచ వ్యాప్తంగా పేరొందిన సంస్థల అధిపతులు, సీఈఓలు,ప్రతినిధులు సంబంధిత రంగాల్లో నిపుణులు, ఆవిష్కర్తలు ఈ వేదికపై జరిగే చర్చలు, సమావేశాల్లో పాలుపంచుకుంటారు. లైఫ్ సైన్సెస్ రంగంలో వస్తున్న సరికొత్త మార్పులు, శాస్త్ర పురోగతి, ఏఐ ప్రభావం ఈ సదస్సులో చర్చిస్తారు. హెల్త్‌కేర్ రంగంలో ఏఐతో వచ్చిన మార్పులు, లైఫ్ సైన్సెస్ భవిష్యత్తును నిర్దేశించే కొత్త ఆవిష్కరణలు, గ్లోబల్ బయో ఎకానమీని బలోపేతం చేయడం, ఇంటిగ్రేటెడ్ హెల్త్‌కేర్ మోడల్స్ తదితర అంశాలను ఎజెండా అంశాలుగా ప్రతినిధులు చర్చించనున్నారు. బయో రంగంలో కొత్త ఆవిష్కరణలు, దేశ విదేశాల సహకారాలు, హెల్త్ కేర్ రంగంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంపై ఈ సదస్సు ప్రధానంగా తెలంగాణకు ఉపయోగపడనుంది. బయో ఫార్మాస్యూటికల్స్, డిజిటల్ హెల్త్, వైద్య పరికరాలు, అధునాతన చికిత్స విధానాలు, అత్యాధునిక వైద్యం, ఆరోగ్య సంరక్షణ విధానాలపై ఈ సదస్సులో పాల్గొనే ప్రతినిధులు చర్చించనున్నారు. ఆయా రంగాల్లో పరిశోధనలు, కొత్త ఆవిష్కరణలను ప్రపంచానికి పరిచయం చేయటంతో పాటు ఔత్సాహిక సంస్థలు, నిపుణులను ప్రోత్సహిస్తుంది. ప్రపంచ స్థాయిలో హెల్త్ కేర్ హబ్, ఇన్నోవేషన్ హబ్ గా తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు ఉన్న విషయం విదితమే. వైద్య పరిశోధనలు, బయో టెక్నాలజీ, ఫార్మాస్యూటికల్ ఎక్సలెన్స్‌లో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తోంది. ఈ నేపథ్యంలో బయో ఏషియా 2026 సదస్సు లైఫ్ సైన్సెస్, హెల్త్ కేర్ రంగంలో మరో మైలురాయిగా నిలువనుంది. పరిశ్రమల వృద్ధి, సహకారం, అత్యాధునిక పరిశోధనలను ప్రోత్సహించేందుకు బయో ఏషియా సదస్సు సరికొత్త మార్గదర్శనం అందించనుంది.

గ్లోబల్ లైఫ్ సైన్సెస్ పెట్టుబడులకు కీలక గమ్యస్థానంగా తెలంగాణ అందరి దృష్టిని ఆకర్షించనుంది. ఆధునిక సాంకేతికత వ్యవస్థ హెల్త్ ఇండస్ట్రీలో ఎటువంటి మార్పులు తీసుకువస్తుందనే అంశంపై కీలక చర్చలు ఈ సదస్సులో జరగనున్నాయి. అమ్జెన్, సానోఫీ, ఎలీ లిల్లీ, మిల్టెనీ బయోటెక్ వంటి ప్రముఖ అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు ఈ సదస్సులో కీలక ప్రసంగం చేయనున్నారు. బయోటెక్నాలజీ, ఔషధాలు, ఆరోగ్య సేవలు, మెడికల్ టెక్నాలజీ, ఆర్టిఫీషియల్ ఇంట లెజెన్స్(ఏఐ) వంటి రంగాల మీద కీలకోపన్యాసం చేయనున్నారు. ఈ సదస్సులో అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియాకు చెందిన క్యాన్సర్ జీన్ థెరపీ నిపుణులు ప్రొఫెసర్ బ్రూస్ ఎల్. లెవిన్, అమ్జెన్ సంస్థ సీఎస్‌వో డా. హోవర్డ్ వై. చాంగ్, జర్మనీకి చెందిన మిల్టెనీ బయోటెక్ వ్యవస్థాపకులు డా.స్టెఫాన్ మిల్టెనీ, సానోఫీ సంస్థ ఈవీపీ మాడలీన్ రోచ్ వంటి ప్రముఖులు కీలకంగా మాట్లాడనున్నారు. అయితే, ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, అశ్విని వైష్ణవ్ కూడా హాజరుకానున్నారు.

భారత ప్రభుత్వ ప్రధాన సలహాదారు(సైన్స్) ప్రొఫెసర్ అజయ్ కుమార్ సూద్, డ్రగ్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా డా. రాజీవ్ సింగ్ రఘువంశీ ఈ బయో ఆసియాలో ప్రసంగించనున్నారు. 'ఫార్మా బయోటెక్ భవిష్యత్తు' అంశంపై ఒక ప్రత్యేక సీఈఓ కాన్‌క్లేవ్ నిర్వహించనుండగా, అందులో డాక్టర్ రెడ్డీస్, జైడస్, బయోకాన్, సిప్లా వంటి భారతీయ ప్రముఖ సంస్థల సీఈఓలు పాల్గొననున్నారు.అలాగే నోవార్టిస్, రోష్, నోవో నార్డిస్క్, మెడ్ట్రానిక్, మెర్క్, ఆస్ట్రాజెనెకా వంటి అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులతో ప్యానల్ చర్చలు జరుగుతాయి.

ఈ చర్చల్లో ప్రధానంగా కొత్త తరహా బయోలాజిక్ ఔషధాలు, సెల్ జీన్ థెరపీలు, ఎంఆర్ఎన్ఏ టెక్నాలజీ వంటి అంశాలపై సమాలోచనలు జరపనున్నారు. బయోఏసియా-2026 సదస్సు ద్వారా హైదరాబాద్ ప్రపంచ స్థాయిలో లైఫ్ సైన్సెస్ అండ్ హెల్త్‌కేర్ రంగాల్లో హబ్‌గా గుర్తింపు పొందనుంది. టెక్-బయోతో వ్యాధులపై సుదీర్ఘంగా అధ్యయనం చేయడం, అర్థం చేసుకునే విధానం,చికిత్సలను రూపకల్పన చేసే పద్ధతి, వైద్య సేవలను అందించే విధానం పూర్తిగా మార్పు చెందనున్నతున్నది.

గత కొన్ని సంవత్సరాలుగా, హైదరాబాద్ మహానగరం ప్రపంచ ఫార్మా, బయోటెక్ రంగంలో జీసీసీ(గ్లోబల్ కెపాసిటీ సెంటర్) వేగంగా విస్తరణ జరుగుతున్నది. బయో లాజిక్స్, వ్యాక్సిన్ తయారీ సామర్థ్యం, బయోప్రాసెస్ డిజైన్, అధునాతన చికిత్సలు, ఏఐ ఆధారిత హెల్త్‌కేర్‌లో తెలంగాణకి కొత్త పెట్టుబడులు పెద్ద ఎత్తున వస్తున్నాయి. ఈ సదస్సులో తెలంగాణలో బయో ఉత్పత్తుల పరిధి మరింత పెంచేందుకు, అవసరమైన భాగస్వామ్యాలను కలుపుకుపోయేందుకు సమగ్రంగా చర్చలు చేయను న్నారు. జీవశాస్త్రంలో వస్తున్న పరివర్తనాత్మక మార్పులు, లైఫ్ సైన్సెస్ రంగంలో నిరంతర వృద్ధి ద్వారా నడిచే గణనీయమైన పురోగతిని ఈ సంవత్సరం సూచిస్తుంది. జీవశాస్త్రం ఏఐ ఆటోమేషన్‌తో కలిసి పని చేసే ఒక అవకాశం కనిపిస్తున్నది. సీఆర్‌డీఎంఓ సేవలలో తెలంగాణ పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేస్తూ, గ్లోబల్ లైఫ్ సైన్సెస్ వేదికపై హైదరాబాద్‌ను ప్రముఖ పాత్ర పోషించే విధంగా చేశాయి. ఈ ఏడాది ప్రారంభంలో దావోస్ వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్‌లో నెక్స్ట్‌జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ ప్రకటన, కీలకమైన వ్యూహాత్మక పెట్టుబడులతో పాటు, ఫార్మాస్యూటికల్స్, బయోటెక్నాలజీ తదితర రంగాల్లో హైదరాబాద్ అగ్రభాగాన ఉన్నది.

బయో ఏషియా- 2026 లైఫ్ సైన్సెస్ ఎకోసిస్టం పరిణామాన్ని వేగంగా ముందుకు తీసుకెళ్లేందుకు ఉపయోగపడనున్నది. ఈ కార్యక్రమంలో ప్లీనరీలు, భవిష్యత్తులో చేపట్టేటు వంటి అంశాలను ప్యానెల్ సంభాషణలు జరగనున్నాయి.

# కీసరగుట్టకు పోటెత్తిన భక్తజనం

### పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి శ్రీధర్‌బాబు దంపతులు

### పాల్గొన్న మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, మైనంపల్లి రోహిత్



శ్రీభవాని రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు కల్యాణోత్సవం సందర్భంగా ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు దంపతులు శ్రీస్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించిన దృశ్యం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పవిత్రపుణ్య శైవక్షేత్రమైన కీసరగుట్ట శ్రీభవాని రామలింగేశ్వరస్వామి ఆలయం శివ నామస్మరణతో మారు మోగింది. ఆదివారం మహాశివరాత్రి పండుగను పురస్కరిం చుకుని కీసరగుట్టకు వివిధ ప్రాంతాల నుంచి సుమారు రెండు లక్షల మంది వరకు భక్తులు విచ్చేసి ఉంటారని భావిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున శనివారం అర్ధ రాత్రి శ్రీస్వామి వారి కల్యాణోత్సవంను పురస్కరించుకుని రాష్ట్ర ఐటి,పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు దంపతులు (సతీసమేతంగా) విచ్చేసి శ్రీస్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించి శ్రీస్వామి వారిని దర్శించుకుని ఆ తరువాత జరిగిన కల్యాణోత్సవంలో వారు కూర్చున్నారు. అదే విధంగా మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి కూడ కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. కీసరగుట్ట బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మేడ్చల్ జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. ఆదివారం మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ కూడ విచ్చేసి శ్రీస్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. అదే విధంగా మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ కూడ విచ్చేసి శ్రీస్వామి వారిని దర్శించుకున్నారు. ఆ తరువాత బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షించి భక్తులను సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు క్యూలీ నిలబడి శ్రీస్వామి వారిని దర్శించుకోవటం, భారీ సంఖ్యలో భక్తజనం రావటంతో భక్తులతో కిటకిటలాడింది. కీసరగుట్టపై ఆలయ ప్రాంగణంలో ఆరుబయట పరిసరాల్లో ఉన్న శివలింగాలను భక్తులు దర్శించుకోవటం శివనామస్మరణతో మారుమోగింది. కీసరగుట్ట శ్రీభవాని రామలింగేశ్వరస్వామిని దర్శించుకున్న భక్తులు ఆదివారం సాయంత్రం తమ ఉపవాసాలు ఉండి విడిచారు. కీసరగుట్ట శ్రీభవాని రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 13న ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఈ నెల 18వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు కొనసాగను న్నాయి. అయితే ఆదివారం సాయంత్రం సమయంలో కీసరగుట్ట రోడ్డులో పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ కావటం జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు స్పందించి ట్రాఫిక్ అంతరాయం లేకుండ వాహనాలను పంపారు. కీసరగుట్ట బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని భారీ ఎత్తున మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీసులు గట్టి భద్రతా పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

# మంత్రి కొండా సురేఖ మనవడిని అభినందించిన హీరో ప్రభాస్

**హైదరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మనవడు, చిన్నారి కొండా మురళీకృష్ణ పటేల్ భక్తి, ఆధ్యాత్మికత పట్ల చూపిన ఆసక్తి ఎంతో అభినందనీయమని ప్రముఖ హీరో ప్రభాస్ కొనియాడారు. రెండున్నరేళ్ల వయసులోనే మురళీకృష్ణ పటేల్ పఠించిన లింగాష్టకం విడియోకు హీరో రెబల్‌స్టార్ ప్రభాస్ వాయిస్ ఓవర్ అందించారు. ఈ సందర్భంగా రెండు న్నరేళ్ల చిన్న వయసులోనే భక్తిశ్రద్ధలతో లింగాష్టకం పఠించిన చిన్నారి ప్రతిభను ప్రశంసించారు. మిగతా చిన్నారులకు ఇది స్ఫూర్తిగా నిలుస్తుందని, కొండా మురళీకృష్ణ పటేల్‌కు భగవంతుడు ఆయు రారోగ్యాలు ప్రసాదించాలని మనసారా కోరుకుంటున్నానని ప్రభాస్ తెలిపారు.

# యూనివర్సిటీల్లో నియామకాలు చేపట్టండి

### ప్రొఫెసర్లు లేక ఇబ్బంది పడుతున్నాం..

### ప్రభుత్వానికి విసిల వేడుకోలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో సరిపడా ప్రొఫెసర్లు లేకపోవడంతో.. బోధన ఇబ్బందిగా మారుతోందని వెంటనే యూనివర్సిటీల్లో నియామకాలను చేపట్టేలా చర్యలు తీసుకోవాలని వర్సిటీల ఉప కులపతులు ప్రభుత్వానికి మొరపెట్టుకుంటున్నారు. ఈ ఏడాది జనవరి 20న జరిగిన ఉన్నత విద్యా మండలి ఈసీ మీటింగ్‌లో పాల్గొన్న యూనివర్సిటీల వీసీలు ఇదే అంశంపై మాట్లాడారు. ఆ తరువాత ఈ నెల 4న జరిగిన వీసీల మీటింగ్‌లోనూ ఇదే అంశాన్ని ప్రస్తావించారు. యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని వీసీలు కోరుతున్నారు. నియామకాలపై ప్రభుత్వం నుంచి స్పష్టత రాకపోవడంతో.. 2012 నుంచి యూనివర్సిటీల్లో అధ్యాపక పోస్టుల నియామకాలు చేపట్టలేదు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత 2017లో యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న అచార్య పోస్టులను భర్తీ చేయడానికి అప్పటి ప్రభుత్వం అనుమతించడంతో.. ఆర్థిక శాఖ కూడా ఇందుకు ఆమోదం తెలిపింది. అయితే అప్పటి నుంచి నియామకాలను చేపట్టడంలో ఎలాంటి పద్ధతిని అవలంభించాలనే దానిపై ప్రభుత్వం నుంచి స్పష్టత రాకపోవడంతో ఇప్పటి వరకు నియామకాలు చేపట్టలేదు. గత ప్రభుత్వ హయాంలో యూనివర్సిటీల్లో నియామకాల కోసం ప్రత్యేక నియామక బోర్డును ఏర్పాటు చేయాలని భావించినప్పటికీ.. అప్పటి గవర్నర్ అందుకు ఆమోదం తెలపకపోవడంతోపాటు ఆ ఫైల్‌ను కాస్త రాష్ట్రపతికి పంపించారు. దీంతో ఈ ప్రక్రియ కాస్త పెండింగ్‌లో పడింది. ఇప్పుడు నియామకాలు చేపట్టాలన్నా దానిపై స్పష్టత రావల్సి ఉంది. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతేడాది డిసెంబర్10న ఉస్మానియా యూనివర్సిటీలో పర్యటించిన సందర్భంలో వర్సిటీల్లో నియామకాలను చేపడతామని.. ఆయా నియామకాల్లో ఎవరి జోక్యం ఉండబోదని.. ఎవరైనా జోకనయం చేసుకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఆ తరువాత జరిగిన ఉన్నత విద్యా మండలి ఎగ్జిక్యూటివ్ మీటింగ్‌లో పాల్గొన్న యూనివర్సిటీల వీసీలు నియామకాల గురించి ప్రస్తావించారు. సమావేశంలో పాల్గొన్న విద్యాశాఖ కార్యదర్శి ప్రభుత్వ పరిశీలనలో ఉందని.. ప్రభుత్వ నిర్ణయం రాగానే నియామకాలు చేపడతామని తెలిపారు. ఆ తరువాత వీసీలతో విద్యా శాఖ కార్యదర్శి ప్రత్యేకంగా ఈ నెల 4న సమావేశం ఏర్పాటు చేశారు. అందులోనూ ఇదే అంశాన్ని వీసీలు ప్రధానంగా ప్రస్తావించారు. యూనివర్సిటీల్లో నియామకాలు చేపట్టకపోవడంతో బోధనకు ఇబ్బందులు వస్తున్నాయని, పీహెచ్‌డీ గైడ్‌షిప్‌కు సైతం ఇబ్బంది అవుతుందని ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత నియామకాల కోసం కమిటీని ఏర్పాటు చేసింది. ముగ్గురు వీసీలతో ఏర్పాటు చేసిన కమిటీ నివేదికను సమర్పించింది. రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో 70 శాతానికిపైగా ఆచార్యుల కొరత ఉంది. 11 యూనివర్సిటీల్లో 2878 అధ్యాపక పోస్టులు మంజూరు కాగా వాటిల్లో 2125 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. యూనివర్సిటీల్లో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు మొత్తం కలిపి 2878 పోస్టులు మంజూరు చేయగా.. వాటిలో కేవలం 753 మంది మాత్రమే పనిచేస్తున్నారు. మంజూరైన ప్రొఫెసర్ పోస్టుల్లో ఉస్మానియా, తెలంగాణ, జేఎన్‌టియుహెచ్, జెఎన్ఎఫ్ఏయూలో మాత్రమే రెగ్యులర్ ప్రొఫెసర్లు ఉన్నారు. మిగిలిన కాకతీయ, మహాత్మాగాంధీ, శాతావాహన, పాలమూరు, తెలుగు యూనివర్సిటీ, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, ఆర్‌జీయుకేటిల్లో ఒక్క ప్రొఫెసర్ కూడా లేరు. అసోసియేట్ ప్రొఫెసర్లతోపాటు, అసిస్టెంట్ ప్రొపెసర్ పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయి. కొత్తగా ఏర్పాటైన వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీకి, ఖమ్మంలో ఏర్పాటు చేసిన ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీల్లోనూ కొత్తగా నియామకాలను చేపట్టలేదు. కొద్దిరోజుల క్రితం ఉస్మానియా యూనివర్సిటీలో కెరీర్ అడ్వాన్స్ స్కీమ్(సీఏఎస్)లో భాగంగా అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లకు పదోన్నతులు కల్పించారు. దీంతో ఇప్పటికే ఉన్న అసిస్టెంట్, అసోసియేట్ ఖాళీలకు అదనంగా మరో 20 నుంచి 30 ఖాళీలు ఏర్పడ్డాయి. రాష్ట్రంలోని స్టేట్ యూనివర్సిటీల్లో ఖాళీల భర్తీకి 2017లోనే సుమారు 1000కిపైగా పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు సుమారు 8 సంవత్సరాలుగా నియామక ప్రక్రియ ప్రారంభం కాకుండా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్టుగా నిలిచిపోయింది.

# రాష్ట్రంలో 50.48 లక్షల యూరియా బుకింగ్

### అన్ని జిల్లాల్లోనూ యాప్ సేవలు

### వ్యవసాయ శాఖ వెల్లడి

**హైదరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** ప్రస్తుత యాసంగి సీజనులో 50.48 లక్షల బస్తాల మేర యూరియాను రైతులు బుక్ చేసుకున్నట్లు వ్యవసాయ శాఖ వెల్లడించింది. ఇదే సమయంలో ప్రస్తుతం ప్రయోగాత్మకంగా కొన్ని జిల్లాలకే పరిమితమైన యాప్ ద్వారా యూరియా బుకింగ్‌ను అన్ని జిల్లాలకు విస్తరింపచేస్తున్నట్లు ఆదివారం తెలిపింది. ఇప్పటి వరకూ వరకు 12.73 లక్షల మంది రైతులు యాప్ ద్వారా 50.48 లక్షల యూరియా సంచులు బుక్ చేసుకున్నారని తెలిపారు. ఈ విధంగా బుక్ చేసుకున్న వాటిలో 46.13 లక్షల బ్యాగ్‌లను రైతులు ఇప్పటికే కొనుగోలు చేశారన్నారు. రైతుల ప్రయోజనాలే ప్రధాన లక్ష్యంగా, ఫీల్డ్ స్థాయిలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్లు వెల్లడించింది.

యూరియా బుకింగ్‌లో రైతులకు ఎదురవుతున్న సమస్యలను అధిగమించేలా అవసరమైన సవరణలు చేస్తూ యూరియా యాప్ అమలు కొనసాగించ బడుతోందని వ్యవసాయ శాఖ స్పష్టం చేసింది. ఈ యాప్ ద్వారా పట్టాదార్ పాస్ బుక్ కలిగిన రైతులు, అటవీ హక్కుల చట్టం లబ్ధిదారులు, భూమిని నిజంగా సాగు చేస్తున్న రైతులు మాత్రమే యూరియాను బుక్ చేసుకునే విధంగా నిబంధ నలు అమలు చేస్తున్నట్లు పేర్కొంది. దీని దీనివల్ల ఎరువులు నిజమైన రైతులకే చేరేలా పర్యవేక్షణ జరుగుతోందని తెలియచేసింది.

రైతు బుక్ చేసుకునే యూరియా సంచుల సంఖ్య పంట రకం, సాగు విస్తీర్ణం వ్యవసాయ విశ్వవిద్యాలయం సూచించిన శాస్త్రీయ సిఫార్సుల ఆధారంగా నిర్ణయించబడుతోందని వ్యవసాయ శాఖ వెల్లడించింది.

# సేవాలాల్ మహారాజ్ జీవితం బిజెపి సిద్ధాంతాలకు ఎంతో చేరువ

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు

**హైదరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** సంత్ సేవాలాల్ మహారాజ్ జీవితం భారతీయ జనతా పార్టీ నమ్మే సిద్ధాంతాలకు ఎంతో దగ్గరగా ఉందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు అన్నారు. ఆదివారం భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర ఎస్టీ మోర్చా అధ్యక్షుడు రవి నాయక్ ఆధ్వర్యంలో సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ముఖ్య అతిథిగా హాజరై, సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రాంచందర్‌రావు మాట్లాడుతూ దేశాన్ని విదేశీ శక్తుల ఆధిపత్యం నుంచి విముక్తి చేయాలనే సంకల్పంతో పాటు, ప్రకృతి పర్యావరణ పరిరక్షణకు ఆయన జీవితాంతం అంకితమయ్యారని తెలిపారు. బంజారా సమాజానికి సంత్ సేవాలాల్ మహారాజ్ ఆరాధ్య దైవమని,



పర్యావరణాన్ని కాపాడే దేవుడిగా ఆయనను గిరిజన సమాజం భావిస్తుందని అన్నారు. విదేశీ పాలన కాలంలో ఒకవైపు విదేశీయులపై పోరాటం చేస్తూనే, మరోవైపు ప్రకృతి పరిరక్షకుడిగా నిలిచిన మహనీయుడు సేవాలాల్ మహారాజ్ అని కొనియాడారు. జగదాంబ మాత ఉపాసకుడిగా, భక్తిశ్రద్ధలతో జీవించిన సేవాలాల్ మహారాజ్ బోధనలు నేటి తరాలకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయని తెలిపారు. అందుకే దేశవ్యాప్తంగా గిరిజన సమాజం సేవాలాల్ జయంతిని ఘనంగా జరుపుకుంటోందన్నారు. గిరిజనుల సంక్షేమానికి సంబంధించి చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నది నరేంద్ర మోడీ ప్రభుత్వమేనని ఆయన స్పష్టం చేశారు. ట్రైబల్ కమిషన్ ఏర్పాటు, ప్రత్యేకంగా ట్రైబల్ మినిస్ట్రీ, గిరిజన సంక్షేమానికి అత్యధిక నిధుల కేటాయింపులు చేశారన్నారు. ఇవన్నీ నరేంద్ర మోడీ ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయాలేనని గుర్తుచేశారు. ములుగులో సమ్మక్కసారలమ్మ ట్రైబల్ యూనివర్సిటీ ఏర్పాటు ద్వారా గిరిజన ప్రాంతాల్లో ఉన్నత విద్యావకాశాలు విస్తరించాయని తెలిపారు. అలాగే మహారాష్ట్రలో సేవాలాల్ మహారాజ్ మందిర నిర్మాణం చేపట్టడం గిరిజన సంస్కృతికి ఇచ్చిన గౌరవంగా అభివర్ణించారు.ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో గిరిజనుల విద్య, ఉపాధి, ఆరోగ్య సంక్షేమం కోసం అనేక పథకాలు అమలులోకి వచ్చాయని తెలిపారు. గిరిజన సమాజాన్ని ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడమే బిజెపి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కళ్యాణ్ నాయక్, పార్టీ రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అశోక్‌తో పాటు పలువురు సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏషియన్ రోడ్ పారాసైక్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో

# అద్భుత ప్రతిభ చూపిన భారత్

## రెండు రజతాలతో సత్తా చాటిన విశ్వవసాని

**హైదరాబాద్ (బేగంపేట), ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** ఏషియన్ రోడ్ పారా సైక్లింగ్ ఛాంపియన్ షిప్‌లో భారత్ అద్భుత ప్రదర్శన నిచ్చింది. ఈ పోటీల్లో పాల్గొన్న విశ్వవసాని రెండు రజతపతకాలు సాధించి సత్తా చాటారు. సౌదీ అరేబియాలోని అల్‌ఖాసిం వేదికగా జరిగిన ఏషియన్ రోడ్ పారాసైక్లింగ్ ఛాంపియన్‌షిప్-2026 పోటీల్లో భారతజట్టు అద్భుత ప్రద ర్శన కనబర్చింది. హైదరాబాద్ ఆదిత్యా మెహతా ఫౌండే షన్‌లో శిక్షణ పొందిన గుజరాత్‌కు చెందిన విశ్వవసాని ఇండివిజువల్ టైమ్ ట్రయిల్ రోడ్‌రేస్ విభాగాల్లో రెండు రజత పతకాలు కైవసం చేసు కుంది. తొమ్మిది దేశాలకు చెందిన క్రీడాకారులు తలపడిన ఈ టోర్నీలో భారత్ నుంచి పలు వురు క్రీడాకారులు టాప్-5లో నిలిచారు. ప్రశాంత్ అర్కాల్ (హ్యాండ్ సైక్లింగ్ హెచ్4) 4వ స్థానం, షేక్ అర్షద్ (ఎంసీ2 )4వ స్థానం, కొమ్మోజి పవన్‌కుమార్(ఎంసీ 3) 5వ స్థానం, అన్షుమన్ (ఎంసీ1.14ఏళ్లు) 5వ స్థానం, చీలంపల్లి ఆర్యవర్ధన్ (ఎంసీ2) 6వ స్థానం, యోగేష్ అహిరే (హ్యాండ్ సైక్లింగ్ హెచ్3) 7వ స్థానం సాధించారు. ఈ సందర్భంగా ఆది త్యామెహతా మాట్లాడుతూ తమకు (వయోజన పారా సైక్లిస్టులకు మద్దతు) అండగా నిల్చిన ఇన్వెస్కో, ఆల్కాన్, జీఎంఎంసీఓ.ఫ్లట్టర్ ఎంటర్‌టైన్ మెంట్ ఇండియా సంస్థలకు కృతజ్ఞతలు తెలియజేసారు. పతకాలను సాధించిన భారత పారాసైక్లింగ్ జట్టు స్వదేశానికి తిరిగి వస్తుందని, పట్టుదల సరైన సంకల్పం ఉంటే విజయం దక్కుతుందని ఈ జట్టు మరోసారి నిరూపించిందన్నారు.



ఏషియన్ రోడ్ పారా సైక్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో రెండు రజత పతకాలతో సత్తా చాటిన విశ్వవసాని

# 19, 20 తేదీల్లో ఒయులో వర్సిటీ విసిల జాతీయ సదస్సు

## విద్యారంగ భవిష్యత్తు రూపకల్పనకు

## ఉన్నతస్థాయి విద్యా సదస్సు

**హైదరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** వందేళ్లకుపైగా చరిత్ర కలిగిన ఉస్మానియా విశ్వవిద్యాలయంలో మరో జాతీయ సదస్సుకు వేదిక కానుం ది. ఈ నెల 19, 20 తేదిల్లో ఓయూలో సెంట్రల్ జోన్ వైస్ ఛాన్స్ లర్ల సమావేశాన్ని నిర్వహించనున్నారు. అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూని వర్సిటీస్(ఏఐయు) తో కలిసి ఓయూ సంయుక్తంగా జాతీయ సదస్సును నిర్వ హించనుంది. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలను నేడు (సోమవారం) ఓయూ వీసీ ప్రొఫెసర్ ఎం కుమార్ మీడియాకు వివరించ నున్నారు. ఓయూలో సెంట్రల్ జోన్ వైస్‌ఛాన్సలర్ల సమావేశాన్ని నిర్వహించడం గౌరవంగా ఉందని యూనివర్సిటీ ప్రకటించింది. విద్యా సదస్సు యొక్క ప్రాముఖ్యత, అజెండా, ఎవరెవరూ హాజరు కానున్నారు అనే విషయాలకు సంబంధించిన సమగ్ర వివరాలను వీసీ మీడియాకు వివరించనున్నారు. విద్యారంగ భవిష్యత్తును రూపొందించడానికి భారతదేశం లోని ప్రముఖ ఉన్నత విద్యా సంస్థల నాయకత్వాన్ని ఒకచోట చేర్చి జాతీయ సదస్సును ఓయూ నిర్వహించనుంది.

# విశ్రాంత వైద్యుడికి సైబర్ నేరగాళ్ల టోకరా

## విదేశాల్లో ఉన్నత ఉద్యోగం పేరిట రూ.20 లక్షల లూటీ

**హైదరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** గాంధీ మెడికల్ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేసి పదవీవిరమణ చేసిన 72 యేళ్ల ఓ వైద్యుడిని సైబర్ నేరగాళ్లు విదేశాల్లో ఉన్నత ఉద్యోగం ఆశచూపి రూ. 20 లక్షలు దోచు కున్నారు. వివరాలు ఇలావున్నాయి. కుషాయిగూడకు చెందిన ఈ విశ్రాంత వైద్యుడికి ఇటీవలే వాట్సాప్‌లో ఓ మెసేజ్ వచ్చింది. ఖతార్ దేశంలో ఫోరెన్సిక్ విభా గంలో ఉన్నత ఉద్యోగం ఉందని, మంచి జీతం ఉంటుందని నమ్మబలికారు. దీనికి సదరు వైద్యుడు ఒకే చెప్పడంతో వెంటనే బయోడేటా పంపాలని మరో మెసేజ్ వచ్చింది. దీనికి కూడా వైద్యుడు సరేననడంతో ఆయనను ఆన్‌లైన్ లోనే సైబర్‌నేరగాళ్లు తమను తాము విదేశీ కన్సల్టెంట్లుగా చెప్పుకుని ఇంటర్వ్యూ చేశారు. దీని తరువాత మీరు ఖతార్ దేశంలో డాక్టర్ గా పని చేసేం దుకు ఎంపికైనట్లు మళ్లీ మెసేజ్ పెట్టారు. మీకు నెలకు ఐదు లక్షల రూపాయల జీతం లభిస్తుందని నమ్మించారు. ఇందుకు సంబంధించి కొన్ని క్లియరెన్స్ కోసం ముందుగా రూ. 20 లక్షలు చెల్లించాలని సైబర్ నేరగాళ్లు కోరారు. దీనిని కూడా నమ్మిన సదరు వైద్యుడు వారు కోరినట్లుగా 20 లక్షల రూపాయలను చెల్లించాడు. దీని తరువాత సదరు నేరగాళ్లు ఫోన్‌లు స్విచాఫ్ చేయడంతో తాను మోసపోయినట్లు గ్రహించిన వైద్యుడు దీనిపై సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై విచారణ చేబట్టిన పోలీసులు మ్యూల్ ఖాతాదారుల కోసం ఆరా తీస్తున్నారు.

# మాజీ ఎంఎల్‌సి ఐలాపురం వెంకయ్య మృతి

**విజయవాడ,ఫిబ్రవరి 15,ప్రభాతవార్తప్రతినిధి:** బిసి నేత, సీనియర్ రాజకీయవేత్త, మాజీ ఎంఎల్‌సీ ఐలాపురం వెంకయ్య అనారోగ్యం తో కన్నుమూసారు.సుదీర్ఘకాలం కాంగ్రెస్‌పార్టీ నేతగా విజయవాడ నగరంలో పలు ఉద్యమాలకు వెంకయ్య సారథ్యం వహించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డికి ఆయన సన్నిహి తునిగా పేరుపొందారు.రాజకీయంగా ఆయన కాంగ్రెస్ వాదిగా వ్యవహరించిన సందర్భంలోను ఇతర పార్టీల నేతలు, ప్రముఖులతో సత్సం బంధాలు కలిగి ఉన్నారు.1999లో విజ యవాడ నుంచి అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేసి స్వల్పతేడా ఓడిపోయారు.బిసి ఉద్యమాల్లో వెంకయ్య అత్యంత క్రియాశీలకంగా వ్యవహరించారు. విజయవాడలో స్టార్ స్థాయి గుర్తింపుగా పొందిన ఐలాపురం హోటల్‌ను వెంకయ్య నిర్మాణం చేసారు.ఆయన కు మారుడు రాజా సమాచార హక్కు చట్టం కమీషనర్‌గా పనిచేసారు. ఐలాపురం వెంకయ్య మృతి పట్ల మాజీ సీఎం జగన్,జనసేన ఎంఎల్‌ఏ మండలి బుద్ధప్రసాద్,ప్రజాశాంతి పార్టీ నా యకుడు కెఏపాల్ కాంగ్రెస్‌నాయకులు నరహరిశెట్టి నరసింహారావు, గుర్నాథంతదితరులు తీవ్ర సంతాపం వ్యక్తం చేసారు.



ఐలాపురం వెంకయ్య (ఫైల్)

**ఐలాపురం వెంకయ్య మృతి పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి:** మాజీ ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్య మృతి పట్ల సీఎం చంద్రబాబు విచారం వ్యక్తం చేశారు. బీసీ వర్గాల అభ్యున్నతి, హక్కుల సాధన కోసం వెంకయ్య నిరంతరం పనిచేశారని ముఖ్యమంత్రి అన్నారు. నిరాడంబర జీవితాన్ని గడు పుతూ, అందరితో సత్సంబంధాలు కలిగిన వెంకయ్య మృతికి చంద్ర బాబు సంతాపం తెలిపారు. వెంకయ్య కుటుంబ సభ్యులందరికీ ప్రగాఢ సాను భూతిని తెలిపారు. ఐలాపురం వెంకయ్య ఆత్మకు శాంతి చేకూరాలని భగవం తుడిని ప్రార్థిస్తున్నానని సీఎం చంద్రబాబు చెప్పారు.

# దేశాన్ని వెనక్కి లాగేందుకు రాహుల్ కుట్ర

## భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై రైతులు, ఎగుమతిదారుల్లో భయాందోళనలు

## అన్నదాతల పట్ల అన్యాయంగా వ్యవహరించినందుకు కాంగ్రెస్ పార్టీ సిగ్గుపడాలి : కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై విపక్షనేత రాహుల్ గాంధీ ఇటీవల చేసిన వ్యాఖ్యలు రైతులు, ఎగుమతిదారుల్లో అనవసర భయాందోళనలు కలిగించేందుకు చేసిన కుటిల ప్రయత్నమే అని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆదివారం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. నెగటివ్ రాజకీయాల ద్వారా దేశ పురోగతిని వెనక్కు లాగేందుకు రాహుల్ కుట్రలు పన్నుతున్నారని అన్నారు. కేంద్రమంత్రి వ్యాఖ్యలు వాస్తవాలకు విరుద్ధంగా ఉన్న కారణంగా, అన్నదాతలను, ఎగుమతిదారులను తప్పుదోవ పట్టించేందుకు రాహుల్ చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు అంగీకరించరు అన్నారు. ప్రస్తుతం భారత్ 4 లక్షల కోట్ల విలువైన వస్త్రాలను ఎగుమతి చేస్తుంది. 38 అభివృద్ధి చెందిన దేశాల పరిధిలోని 9 స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు ద్వారా 45 లక్షల కోట్ల విలువైన టెక్స్‌టైల్ మార్కెట్లుకు అవకాశాలు ఏర్పడ్డాయని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా 7 మెగా టెక్స్‌టైల్ పార్కులను అభివృద్ధి చేస్తుందన్నారు. ఇందులో ఒకటి తెలంగాణలోని వరంగల్లో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ పేరుతో అభివృద్ధి జరుగుతుందన్నారు. అమెరికా, ఇతర దేశాలతో కుదురుతున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల కారణంగా ఎగుమతులు గణనీయంగా పెరిగి, వేల సంఖ్యలో ఉద్యోగాల కల్పన జరుగుతుందని, దీనివల్ల తెలంగాణకు సైతం పెద్దమొత్తంలో లబ్ధిచేకూరనుందన్నారు. తెలంగాణ అభివృద్ధి చెందడం, ఇక్కడి యువతకు ఉద్యోగాలు రావడం రాహుల్ గాంధీకి ఇష్టం లేదా? రాహుల్ గాంధీ ఒకవైపు వస్త్ర పరిశ్రమ ఎగుమతిదారులను, మరోవైపు పత్తి డిమాండ్ తగ్గుతుందని రైతులను భయపెట్టేందుకు, వారిని ఆందోళనకు గురిచేసేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే భారత వస్త్ర పరిశ్రమ రంగంలో విస్తారమైన వృద్ధి అవకాశాలు ఉన్నందున భారత పత్తికి డిమాండ్ నిరంతరం పెరుగుతుందన్నారు. దీని ద్వారా రైతుల ఆదాయం కూడా పెరుగుతుందని, అందుకే భారతీయ



పత్తి రైతులు ఏమాత్రం ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. 2004 నుండి 2014 వరకు కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని యూపిఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా అనేక అంశాల్లో రాజీపడిన సంగతి మనందరికీ తెలుసు. 2013లో బాలీలో జరిగిన ప్రపంచ వాణిజ్య సంస్థ మంత్రివర్గ సమావేశంలో ధాన్యం, పత్తిపై కనీస మద్దతు ధర వ్యవస్థను 2017 నాటికి రద్దు చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం అంగీకరించిందన్నారు. అనంతరం నరేంద్రమోడీ నేతృత్వంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే ఆహార భద్రతను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి చెందుతున్న దేశాల పబ్లిక్ స్టాకోలింగ్ కార్యక్రమాలను డబ్ల్యుటిఓ సవాలు చేయకూడదని ఒప్పందం కుదిరింది. దేశ అన్నదాతల విషయంలో అన్యాయంగా వ్యవహరించినందుకు, కాంగ్రెస్ పార్టీ సిగ్గుపడాలన్నారు. డాక్టర్ ఎమ్మెస్ స్వామినాథన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన జాతీయ రైతు సంఘం సిఫారసులను అమలు చేసే ప్రసక్తే లేదని 2013లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపిఏ ప్రభుత్వం స్పష్టం చేసిందన్నారు. ఉత్పత్తి వ్యయం కంటే కనీసం 50శాతం కంటే ఎక్కువగా ఎంఎస్‌పి ఉండాలని స్వామినాథన్ కమిటీ సూచించిందన్నారు. దీన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అంగీకరించలేదు. అనంతరం, నరేంద్రమోడీ ప్రభుత్వం ఉత్పత్తి వ్యయాన్ని పరిగణనలోకి తీసుకుని ఎంఎస్‌పి నిర్ణయించే విధానాన్ని అమలు చేసింది. రైతుకు అయ్యే ఉత్పత్తి వ్యయానికి రెట్టింపు ఆదాయం అందించే లక్ష్యంతో కేంద్రం పనిచేస్తుందన్నారు. ఇప్పటివరకు వరుసగా 100 ఎన్నికల్లో వరుస పరాజయాల తర్వాత రాహుల్ గాంధీ నిరాశ, నిస్పృహలతో ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీపై ఉన్న వ్యతిరేకతను దేశంపై వ్యతిరేకతగా మలచుకున్నారు. అందుకే 11 ఏళ్లుగా దేశం సాధిస్తున్న ప్రగతిని చూసి జీర్ణించుకోలేక, అధికారం దక్కదన్న అసహనంతో దేశంలో అన్నదాతలను, ఎగుమతిదారులను రెచ్చగొట్టేందుకు విఫలయత్నం చేస్తున్నారు. వీటిని కూడా ప్రజలు తిప్పికొడతారు.

# కౌన్సిలర్ల కిడ్నాప్.. ఆపై ప్రలోభాలకు గురిచేస్తోంది

## కాంగ్రెస్‌పై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఆరోపణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 15:** మాజీ సీఎం కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అయ్యేందుకు మద్దతుగా నిలవాలంటూ బంజారాలకు బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పిలుపునిచ్చారు. గిరిజనులకు రిజర్వేషన్లు పెంచిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కుతుం దన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే సేవాలాల్ బంజారా భవన్‌ను బంజారాహిల్స్‌లో నిర్మించారని గుర్తు చేశారు. ఆదివారం నాడు తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి సందర్భంగా బంజారాలకు శుభాకాంక్షలు తెలిపారు. ఒకే రోజు నాలుగున్నర లక్షల ఎకరాలకు సంబంధించి గిరిజనులకు పోడు పట్టాలు అందించిన ఘనత కేసీఆర్‌దే అని తెలిపారు. మా తండాలో మా రాజ్యం ఉండాలన్న లాంబాడాల ఆత్మగౌరవాన్ని నిజం చేసింది బీఆర్ఎస్ అధినేత అని గుర్తు చేశారు. తండాలను గ్రామ పంచాయతీలుగా చేసిందీ కేసీఆర్ అని



చెప్పారు. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి ఇక కాంగ్రెస్, సీపీఐ పార్టీలు అలయన్స్‌లో ఉన్నాయని.. సింగరేణి దోపిడీని అరికట్టడానికి తాను సీపీఐకి మద్దతు ఇస్తానన్నారు. సింగరేణిలో కాంగ్రెస్, బీజేపీలు కలిసి పని చేస్తున్నాయని విమర్శించారు.

సీపీఐపైన ఏ ఒత్తిళ్లు వచ్చి కొత్తగూడెంలో కాంగ్రెస్‌తో పొత్తుకు ఒప్పుకుందో తనకు తెలియదని పేర్కొన్నారు.ఎవరు కలిసొచ్చినా, రాకున్నా తాము సింగరేణి అవినీతిపై పోరాటం చేస్తామని కుండబద్దలు కొట్టారు. హంగ్ వచ్చిన మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీ అరాచకాలు చేస్తోందంటూ మండిపడ్డారు.

తమ కౌన్సిలర్లను బెదిరిస్తున్నారని.. మరికొన్ని చోట్ల కిడ్నాప్ సైతం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కౌన్సిలర్లకు ప్రలోభ పెట్టడం, ఇళ్లకు పోలీసులను పంపడం, గూండాలను ఉపయోగించడం వంటి చర్యలకు దిగుతోందని ఆయన విమర్శించారు.తమకు ఉన్న అంచనా మేరకు హంగ్ మున్సిపాలిటీల్లో 10 వరకు బీఆర్ఎస్‌కు రావచ్చని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఓటు వేయలేదని వారి ఇళ్లపై బీరు సీసాలతో దాడి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఫిబ్రవరి15:** మున్సిపల్ ఎన్నికల ఫలితాలు కొన్ని చోట్ల తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీసున్నాయి. ప్రజాస్వామ్యంలో ఓటరు తీర్పును గౌరవించాల్సిందిపోయి ఓటమిని జీర్ణించుకోలేదని కొందరు అభ్యర్థులు ఏకంగా ఓటర్లపైనే దాడులకు దిగుతుండటం కలకలం రేపుతోంది. తాజాగా యాదాద్రి భువనగిరి జిల్లాలో ఇలాంటి ఒక విస్తుపోయే ఘటన వెలుగులోకి వచ్చింది. భువనగిరి మున్సిపాలిటీ 1వ వార్డులో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసిన అభ్యర్థి స్వరూపరాణి ఓటమి పాలయ్యారు.
తమకు ఓటు వేయలేదన్న కోపంతో ఆమె,ఆమె కుటుంబ సభ్యులు అర్థరాత్రి వేళ వార్డులో తీవ్ర హంగామా చేశారు.స్థానిక ఓటర్ల ఇళ్లపై ఖాళీ బీరు సీసాలతో దాడికి దిగారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.
ఓటర్లను భయభ్రాంతులకు గురిచేస్తూ వీధిలో బీభత్సం సృష్టించడంతో సామాన్య ప్రజలకు భయాందోళనకు గురయ్యారు. కాంగ్రెస్ అభ్యర్థి వర్గం చేసిన దాడులకు వార్డులోని మహిళలు కూడా అంతే ధీటుగా స్పందించారు. ఎన్నికలకు ముందు ప్రలోభాల్లో భాగంగా అభ్యర్థి తమకు పంచిన చీరలను, హాట్ బాక్సులను తీసుకువచ్చి రోడ్డుపైకి విసిరేస్తూ నిరసన తెలిపారు. ఓట్లు వేయలేదని దాడులు చేస్తారా? మీ గిఫ్టులు మాకు వద్దు అంటూ మహిళలు అభ్యర్థి తీరును తీవ్రంగా తప్పుపట్టారు. దీనికి సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

ప్రజాస్వామ్యంలో ఓటరు తీర్పును గౌరవించుకుండా ఇలా దాడులకు దిగడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షిస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

# మాండ్యలోని కెమికల్ ఫ్యాక్టరీలో పేలుడు

## ఇద్దరు మృతి, నలుగురికి గాయాలు

**బెంగళూరు, ఫిబ్రవరి 15:** కెమికల్ ఫ్యాక్టరీలో పేలుడు సంభవించింది. ఈ సంఘటనలో ఇద్దరు కార్మికులు మరణించారు. మరో నలుగురు గాయపడ్డారు. ఫైర్ సిబ్బంది వెంటనే అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. కర్ణాటకలోని మాండ్య జిల్లాలో ఈ సంఘటన జరిగింది. 2022లో కీర్తి కెమికల్స్ నుంచి విషపూరిత వాయువు లీకేజీ వల్ల ప్రజల ఆరోగ్యానికి హాని కలగడంతోపాటు పంటలకు నష్టం వాటిల్లింది. దీంతో గ్రామస్తులు, రైతులు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే, జిల్లా అధికారుల జోక్యంతో ఫ్యాక్టరీని మూసివేయాలని యజమానులు నిర్ణయించారు. కాగా, చాలా కాలంగా పని చేయని ఈ కెమికల్ ఫ్యాక్టరీలోని సామగ్రిని వేరే ప్రదేశానికి తరలిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం రసాయన ట్యాంక్ తొలగించేందుకు ప్రయత్నించగా పేలుడు జరిగింది. ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మరోవైపు ఈ ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మరణించగా మరో నలుగురు గాయపడ్డారు. గాయపడిన వారిని మెడికల్ కాలేజీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మరణించిన కార్మికులు బీహార్‌కు చెందిన వారని పోలీసులు తెలిపారు. ఈ పేలుడుపై దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.



# నేడు అమరావతికి బిల్‌గేట్స్ రాక

## సంజీవని సహా సాంకేతిక సాగు ప్రాజెక్టుల పరిశీలన

## రియల్ టైమ్ గవర్నెన్స్, వివిధ అంశాలపై

## ప్రజెంటేషన్ ఇవ్వనున్న ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబు

**విజయవాడ, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త ప్రతినిధి:** గేట్స్ ఫౌండేషన్ ఫౌండర్ చైర్మన్ బిల్ గేట్స్ సోమవారం రాష్ట్రంలో పర్యటించనున్నారు. బిల్ గేట్స్‌తో పాటు గేట్స్ ఫౌండేషన్‌కు చెందిన ఆరుగురు ప్రతినిధుల బృందం అమరావతిలోని రాష్ట్ర సచివాలయానికి రానుంది. సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌లతో కలిసి బిల్ గేట్స్ బృందం కొద్దిసేపు సమావేశం కానుంది. సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ కేంద్రాన్ని బిల్ గేట్స్ సందర్శించనున్నారు. రియల్ టైమ్ గవర్నెన్స్ విధానాలు, దాని ద్వారా సాధిస్తున్న ఫలితాలను ముఖ్యమంత్రి చంద్రబాబు బిల్ గేట్స్‌కు వివరించనున్నారు. ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి ప్రభుత్వ పాలనలో టెక్నాలజీ వినియోగాన్ని కూడా గేట్స్ పరిశీలించనున్నారు. అనంతరం ముఖ్యమంత్రి సమావేశ మందిరంలో బిల్ గేట్స్ సహా గేట్స్ ఫౌండేషన్ ప్రతినిధి బృందంతో ముఖ్యమంత్రి, మంత్రులు, వివిధ శాఖల కార్యదర్శులు సమావేశం కానున్నారు.
రాష్ట్రంలో గేట్స్ ఫౌండేషన్ సహకారంతో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులను మరింత విస్తరించే అంశంపై సమావేశంలో చర్చించనున్నారు. స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యాలు, ప్రజారోగ్యం, వ్యవసాయం, విద్య తదితర రంగాల్లో చేపట్టిన సంస్కరణలపై ముఖ్యమంత్రి చంద్రబాబు క్లుప్తంగా ప్రజంటేషన్ ఇవ్వనున్నారు. మెడ్ టెక్, డయాగ్నస్టిక్స్ సేవలు, సాంకేతిక సాగు సహా తదితర ప్రాజెక్టుల గురించి వివరించనున్నారు. ప్రత్యేకించి గేట్స్ ఫౌండేషన్ సహకారంతో నడుస్తున్న సంజీవని ప్రాజెక్టు గురించి రాష్ట్ర ప్రభుత్వం వివరించనుంది. అనంతరం అమరావతిలోని ఉండవల్లి గ్రామం వద్ద ఓ వ్యవసాయ క్షేత్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి బిల్ గేట్స్ బృందం సందర్శించనుంది. వ్యవసాయ క్షేత్రంలో డ్రోన్లు, ఏఐ టెక్నాలజీ సహకారంతో చేపడుతున్న సాగు విధానాన్ని బిల్ గేట్స్ పరిశీలించనుంది.

# ఎవ్వరితోనూ పొత్తుల్లేవ్..

## సొంతంగానే బరిలోకి: టివికె చీఫ్ విజయ్

**చెన్నై, ఫిబ్రవరి 15:** తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్నది. ఇప్పటికే ప్రధాన పార్టీలు ఎన్నికల వ్యూహ ప్రతివ్యూహాలు మొదలుపెట్టాయి. అక్కడ సాధారణంగా డీఎంకే, అన్నాడీఎంకే, పార్టీల మధ్య ప్రధాన పోటీ ఉంటుంది. కానీ రాబోయే ఎన్నికలు మరింత రసవత్తరంగా మారాయి. ప్రముఖ నటుడు విజయ్ తొలిసారి ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావడమే ఇందుకు కారణం. తమిళగ వెట్ర కళగం (టివికె) పార్టీని స్థాపించిన విజయ్ అధికార డీఎంకేను కూల్చడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు. తాజాగా ఆయన మాట్లాడుతూ పొత్తులపై ఫుల్ క్లారిటీ ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో రెండు ప్రధాన జాతీయ కూటములైన ఎన్డీయే, యూపీయేతో పొత్తు పెట్టుకోబోమని, స్వతంత్రంగానే ఎన్నికల్లో పోటీ చేస్తామని ప్రకటించారు. తమ పార్టీ రాష్ట్రంలో ప్రధాన రాజకీయ శక్తిగా అవతరిస్తుందని, సంప్రదాయ పార్టీలైన రెండు వ్యతిరేక పక్షాలకు ప్రత్యామ్నాయంగా ఆవిర్భవిస్తుందని ఆయన చెప్పారు. ఎన్నికల తర్వాత కూడా తమ పార్టీ ఏ కూటమిలో చేరబోదని స్పష్టంచేశారు. ఒంటరిగానే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ధీమా వ్యక్తంచేశారు.



# పంటలపై పురుగుల దాడి.. వరి, మిర్చి, మొక్కజొన్నకు నష్టం

## ఫలితమివ్వని క్రిమిసంహారకాలు

## దిగుబడిపై తీవ్ర ప్రభావం

## తెగుళ్లతో యాసంగి ఆగమాగం

## అన్నదాతల ఆందోళన

**హైదరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** ప్రస్తుత యాసంగి సీజనులో పంటలపై తెగుళ్లు విజృంభిస్తున్నాయి. రకరకాల తెగుళ్లు పట్టిపీడిస్తుండటంతో యాసంగి ఆగమాగం అవుతోందనే ఆందోళన అన్నదాతల్లో వ్యక్తమవుతోంది. ఎన్ని మందులు వాడినా ఫలితం కనిపించక భారీగా పంటలు దెబ్బతింటున్నాయని ఆవేదన చెందుతున్నారు. దీంతో లక్షలాది రూపాయలు ఖర్చు చేసినా ప్రయోజనం లేకపోగా రైతులు అప్పుల పాలవుతున్నారు.

రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో వరి, మిర్చి, వేరుశెనగ, శెనగ, మొక్కజొన్న తదితర పంటలపై పురుగుల దాడి ఉధృతంగా ఉంది. ఇప్పటికే వేసిన పైర్లను తెగుళ్లు, పురుగులు పాడుచేస్తున్నాయని రైతులు వాపోతున్నారు. వరి, మొక్కజొన్న పంటలపై తెగుళ్లు వ్యాపిస్తున్నాయి. దీంతో వరి పంట మొదటి దశలోనే ఎండిపోతోంది. వివిధ జిల్లాల్లో వాతావరణం సహకరించకపోవడంతో పాటు, పురుగులతో వరి చేలు ఎరుపు రంగులోకి మారుతున్నాయి. తెగుళ్లకు ఎన్నిసార్లు మందులు పిచికారీ చేసినా ఏమీ లాభం లేదంటూ చెబుతున్నారు. ఒక ఎకరానికి ఒకసారి మందు పిచికారీ చేస్తే 2 నుండి 3 వేల రూపాయలు ఖర్చవుతోందని, అయినా ఇవేమీ ప్రయోజనం లేకుండా పోతున్నాయని అంటున్నారు.

తెగుళ్ల ప్రభావంతో వరి సాగుపై ఆశలు వదులుకోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. కనీసం పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఆదిలాబాద్, ఖమ్మం, నిజామాబాద్, నల్లగొండ, సూర్యాపేట్, నిజామాబాద్ తదితర జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో వరి పంటను గత కొద్ది రోజులుగా పురుగు వెంటాడుతోంది. మొలక దశ నుండి వరి పంటను నాశనం చేస్తోందని రైతులు చెబుతున్నారు.
దీని కారణంగా ప్రతీసారీ ఎకరానికి 15 నుండి 20 క్వింటాళ్ల వరకూ దిగుబడి వచ్చే ధాన్యం, తెగుళ్ల కారణంగా 8 క్వింటాళ్లు కూడా వచ్చే అవకాశం కనిపించడం లేదని కన్నీటి పర్యాంతమవుతున్నారు. మరోపక్క వివిధ జిల్లాలో మొక్కజొన్న పంటకు చివరి దశలో కత్తెర పురుగు శాపంగా మారింది. జిల్లాలో ఈసారి ఎకరానికి 35 నుండి 40 క్వింటాళ్ల వరకూ దిగుబడి వస్తుందని అంచనా వేయగా, అనూహ్యంగా కత్తెర పెరుగు విజృంభించడంతో ఈసారి దిగుబడి కనీసం 20 క్వింటాళ్ల వరకూ కూడా రావడం కష్టమేనని అంటున్నారు.

ఇక వనపర్తి, గద్వాల తదితర జిల్లాల్లో వేరుశెనగ పంటకు ఆకుమచ్చ తెగులు, ఇతర ప్రాంతాల్లో పొగాకు లద్దె పురుగు ఎక్కువగా ఉన్నాయి. వరంగల్, నిర్మల్, ఖమ్మం, కరీంనగర్, హన్మకొండ వంటి జిల్లాల్లో మొక్కజొన్న పైరు కత్తెర పురుగుకు గురైంది. ఇది కంకులు, ఆకులను పూర్తిగా తినివేస్తుండడంతో రైతులకు మింగుడు పడడం లేదు.

మంచిర్యాల, ఖమ్మం, వికారాబాద్, ఆదిలాబాద్ వంటి జిల్లాల్లో కంది పంటపై శనపగపచ్చ పురుగు, మరుకా మచ్చల పురుగు, కాయ ఈగ వంటి తెగుళ్లు వ్యాపించాయి. వీటి వల్ల మొక్కలో మొగ్గ, పూత, పిందెల మీద గుడ్లు పెడుతుండగా, వీటి నుండి వచ్చిన లార్వా వాటిని తినడంతో పంట మొత్తం దెబ్బతింటున్నాయి.

రాష్ట్రంలోని ఖమ్మం, కొత్తగూడెం తదితర జిల్లాల్లో మిరప సాగు చేసిన రైతుల పరిస్థితి దయనీయంగా తయారైంది. వీటితో పాటు, మహబూబాబాద్, వరంగల్, గద్వాల, భూపాలపల్లి జిల్లాల్లో మిర్చి పంట తెగుళ్లతో దెబ్బతింటోందని కన్నీటి పర్యాంతమవుతున్నారు. మిర్చి పైరు ఎదుగుదల దశలో పలు ప్రాంతాల్లో ఎండు తెగులు కూడా సోకింది. ఫలితంగా వేరు కుళ్లడం, కొమ్మలు ఎండిపోవడంతో మిర్చి తోటలు దెబ్బతిన్నాయి. అంతలోనే తామర పురుగు పంటపై దాడి చేసింది.

కాగా మామిడి తోటలకు వైరస్ వ్యాపించింది. దీంతో మామిడి చెట్లపై పూత లేకపోవడం, కాస్తో కూస్తో ఉన్న పూత రాలిపోతోంది. ప్రస్తుత వాతావరణ ప్రభావం, మంచు కారణంగా ఇప్పటికే మామిడి తోటలకు 15 శాతం కూడా పూత రాలేదు. దీనికితోడు మామిడి చెట్లకు వైరస్ వ్యాపించడంతో పూత రావడం లేదని పలువురు రైతులు వాపోతున్నారు.

## టెన్త్ పరీక్షల షెడ్యూల్‌లో స్వల్ప మార్పు

### ఏప్రిల్ 4 నుంచి 10వ తరగతి మూల్యాంకనం

విజయవాడ, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రవ్యాప్తంగా మార్చి 16 నుంచి ఏప్రిల్ 1 వరకు 10వ తరగతి విద్యార్థులకు ఫైనల్ ఎగ్జామ్స్ నిర్వహించనున్నారు. అయితే విద్యాశాఖ తాజాగా ఈ పరీక్షల షెడ్యూల్‌లోనూ ఓ మార్పు చేసింది. ఉగాది, రంజాన్ పండుగల కారణంగా ఇంగ్లీష్ పరీక్షను మార్చి 21కి వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఏడాది షెడ్యూల్ ప్రకారం ప్రతీ పరీక్ష తర్వాత ఒకరోజు విరామం వచ్చింది. దీంతో విద్యార్థులు ఎంతగానో సంతోషిస్తున్నారు. ఇది వారికి ఎంతో ప్రయోజనకరం అవుతుందని నిపుణులు చెబుతున్నారు. తెలుగు, ఇంగ్లీష్, మ్యాథ్స్, ఫిజిక్స్, జీవశాస్త్రం, సామాజిక శాస్త్రం వంటి ప్రధాన సబ్జెక్టులు అన్నింటికీ మధ్యలో విరామం ఉండేలా షెడ్యూల్ రూపొందించారు. దీని వల్ల ప్రతి పరీక్ష పూర్తి అయ్యాక విద్యార్థులు తదుపరి సబ్జెక్ట్ పై దృష్టి పెట్టడానికి సమయం దొరుకుతుందని ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా గణితం, సైన్స్ వంటి సబ్జెక్టులను మళ్లీ చదువుకోవడానికి, చదివిన వాటిని మర్చిపోకుండా ఉండేందుకు ప్రాక్టీస్ చెయ్యడానికి ఈ విరామం ఎంతగానో ఉపయోగపడుతుందని నిపుణులు అంటున్నారు.
ఇక 10వ తరగతి పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం ఏప్రిల్ 4 నుంచి 13 వరకు నిర్వహించేందుకు ప్రభుత్వ పరీక్షల విభాగం ఆదేశాలు జారీ చేసింది. మూల్యాంకన సమయంలో తీసుకోవల్సిన జాగ్రత్తలపై జిల్లా విద్యాధికారులకు పలు సూచనలు చేసింది. మూల్యాంకనంపై ఏప్రిల్ 4న నిర్వహించే అవగాహన కార్యక్రమానికి హాజరు కావాలని పేర్కొంది. ఈ ఏడాది నుంచి మూల్యాంకనం కేంద్రాల్లోను కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు.



## గ్రామీణ పేదరిక నిర్మూలనకు రూ.1,872.23 కోట్లు

### మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయవాడ, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త ప్రతినిధి: 2026-27 ఆర్థిక సంవత్సరానికి గ్రామీణ పేదరిక నిర్మూలన కార్యక్రమాల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.1,872.23 కోట్లు కేటాయించినట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే రాష్ట్ర బడ్జెట్‌లో రూ.143 కోట్లు అధికంగా కేటాయించడం, స్వయం సహాయక సంఘాల మహిళల సాధికారిత, గ్రామీణ జీవనోపాధుల పురోగతి పట్ల రాష్ట్ర ప్రభుత్వ దృఢ సంకల్పాన్ని ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థలో పనిచేస్తున్న ప్రభుత్వ సిబ్బంది, సెర్ప్ ఉద్యోగులు, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది జీతభత్యాలు, గ్రామ సంఘాల సహాయకులకు గౌరవ వేతనాలు, అలాగే సెర్ప్, డిఆర్‌డిఏ కార్యాలయాల నిర్వహణ కోసం మొత్తంగా రూ.464.99 కోట్లు కేటాయించారని తెలిపారు. అదేవిధంగా దీనదయాల్ అంత్యోదయ యోజన- జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ కింద రూ.818 కోట్లు, స్టార్టప్ విలేజ్ ఎంటర్‌ప్రైజ్ ప్రోగ్రామ్ కింద రూ.30 కోట్లు, రూరల్ సెల్ఫ్ ఎంప్లాయ్మెంట్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ కోసం రూ.15 కోట్లు కేటాయించారని తెలిపారు. దీనదయాల్ అంత్యోదయ యోజన - జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ కింద రాష్ట్రానికి లభించే వాస్తవ కేటాయింపుల ఆధారంగా అదనంగా రూ.1200 కోట్లు వరకు పెంచేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించినట్లు మంత్రి తెలిపారు. దీంతో 2026-27 సంవత్సరంలో మొత్తం రూ.3000 కోట్ల వ్యయంతో స్వయం సహాయక సంఘాల సభ్యుల జీవనోపాధుల మెరుగుదల, ఆదాయ వృద్ధి మరియు స్థిరమైన ఉపాధి అవకాశాల సృష్టిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నదని చెప్పారు. ముఖ్యమంత్రి ప్రకటించిన ఒక కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్త మహత్తర లక్ష్యసాధనలో భాగంగా సుమారు 5లక్షల మహిళలను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడం, అలాగే రైతు ఉత్పత్తి సంస్థలను బలోపేతం చేయడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మరింత శక్తివంతం చేయాలని ప్రభుత్వం సంకల్పంతో ముందుకు సాగుతున్నదని తెలిపారు. గత సంవత్సరంతో పోలిస్తే గణనీయంగా అధిక బడ్జెట్ కేటాయించడమే కాకుండా, దీనదయాల్ అంత్యోదయ యోజన-జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ ద్వారా లభించే నిధుల ఆధారంగా మొత్తం వ్యయాన్ని రూ.3000 కోట్ల వరకు విస్తరించేందుకు దృఢ నిశ్చయంతో ముందుకు వస్తున్న ముఖ్యమంత్రికి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.



## క్షేత్రపాలకుడు రుద్రుడికి విశేష పూజలు

తిరుమల, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త ప్రతినిధి: శేషాచలం కొండల్లోని తిరుమలక్షేత్ర పాలకుడు రుద్రుడు కొలువై పూజలు అందుకుంటున్నాడు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆదివారం ఉదయం గోగర్భం డ్యామ్ సమీపంలో ఉన్న రుద్రుడికి విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ప్రతి ఏటా పర్వదినాన ప్రత్యేక అభిషేకం నిర్వహించడం ఆనవాయితీ. శ్రీవారి ఆలయం నుండి ఆలయ మర్యాదలతో అధికారులు, అర్చకులు కాలినడకన క్షేత్రపాలక శిల వద్దకు చేరుకున్నారు. పాలు, పెరుగు, చందనం, పన్నీరు. కొబ్బరినీళ్ళు తదితర సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. ఆ తరువాత నైవేద్యం సమర్పించారు. భక్తులకు ప్రసాదాల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయం పారుపత్తేదార్ హిమత్‌గిరి, అదనపు ఇఒ కార్యాలయం సూపరింటెండెంట్ రామచంద్ర, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## వికసిత్ భారత్ నిర్మాణానికి బడ్జెట్ పునాది



విజయవాడ, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త ప్రతినిధి: ఎపి బడ్జెట్ ప్రగతిశీల బడ్జెట్ అని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ అన్నారు. భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధులు, మీడియా ప్యానలిస్టులతో ఆయన ఆడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. భవిష్యత్ కార్యాచరణపై అధికార ప్రతినిధులకు దిశానిర్దేశం చేశారు. కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లను సమ్మిళితం చేస్తూ ప్రజలకు వివరించాలని సూచించారు. ఎపి అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్రాభివృద్ధికి ఒక స్పష్టమైన రోడ్‌మ్యాప్. సంపద సృష్టి, అభివృద్ధి, సంక్షేమం ఆధారంగా బడ్జెట్ రూపొందించారు. రూ.3.32 లక్షల కోట్లతో బడ్జెట్ ప్రతిపాదించడం సాహసోపేతమైన చర్య. రెవెన్యూ లోటును 1.86 శాతానికి పరిమితం చేయడం ఆర్థిక క్రమశిక్షణకు నిదర్శనమన్నారు. వికసిత్ ఎపి ద్వారా వికసిత్ భారత్ నిర్మాణానికి ఈ బడ్జెట్ పునాది వేస్తోంది అని మాధవ్ అన్నారు.

## కోవా బన్ వలీకి అండగా ఉంటామన్న మంత్రి లోకేష్

విజయవాడ, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త ప్రతినిధి: తెలంగాణలోని మేడారం జాతరలో కర్నూలుకు చెందిన ఓ చిరు వ్యాపారి వేధింపులకు గురికావడం పట్ల ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ తీవ్రంగా స్పందించారు. ఈ ఘటన పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, బాధితుడైన వలికి బహిరంగంగా క్షమాపణ చెప్పారు. కర్నూలు జిల్లాకు చెందిన వలీ అనే చిరు వ్యాపారి మేడారం జాతరలో కోవా బన్ అమ్ముకుంటున్నాడు. ఈ క్రమంలో కొందరు యూట్యూబర్లు అతడిని అడ్డుకుని, ఫుడ్ జిహాద్ చేస్తున్నావంటూ ఆరోపణలు చేశారు. అంతే కాకుండా, అతడితో బలవంతంగా కోవా బన్ తినిపించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. ఈ వీడియోపై స్పందించిన నారా లోకేశ్, తన అధికారిక ఎక్స్ ఖాతా ద్వారా ఒక పోస్ట్ చేశారు. "ప్రియమైన సోదరుడు వలీ గారూ, మీకు ఈ బాధ కలిగినందుకు చాలా విచారంగా ఉంది. ఇలాంటి విభజనకరమైన, మతతత్వ ప్రవర్తనకు మన తెలుగు సమాజంలో చోటు లేదు. మన సమాజం ఎల్లప్పుడూ సామరస్యం, పరస్పర గౌరవం, సోదరభావంతో నిలిచింది" అని లోకేశ్ పేర్కొన్నారు.
అంతేకాకుండా, "త్వరలో మిమ్మల్ని కలిసి మీ ఫేమస్ కోవా బన్ రుచి చూడాలని ఎదురు చూస్తున్నాను! మనమంతా కలిసి ఉందాం" అంటూ వలీకి భరోసా ఇచ్చారు. లోకేశ్ స్పందనపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## భోగితేరుపై భోలాశంకరుడు





తిరుమల, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త ప్రతినిధి: టిటిడికి అనుబంధంగా ఉన్న తిరుపతిలోని ప్రసిద్ధ శైవాలయం కపిలేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం మహాశివరాత్రి పర్వదినాన భక్తులు భారీగా దర్శనానికి వచ్చారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మహాశివరాత్రి వేడుక కావడంతో ఉదయం నుండి ఆలయం హరహరమహాదేవ శంభోశంకర, నమఃశ్శివాయ నామంతో మిన్నంటింది. మహాశివరాత్రి వేడుకలు కపిలేశ్వరుని ఆలయంలో అధికారులు అత్యంత కన్నులపండువగా జరిపించారు. బ్రహ్మోత్సవాల్లో ఉదయం వాహనసేవలో కపిలేశ్వరస్వామి, కామాక్షి అమ్మవారు నిత్య కైంకర్యాలు ముగించుకుని ఆలయంలోపల భోగితేరును అధిరోహించారు. ఆలయ అర్చకులు వేదమంత్రాల నడుమ స్వామిఅమ్మవార్లకు కర్పూర హారతులిచ్చారు. భోగితేరు ఆలయ పురవీదుల్లో భక్తుల ఓం నమః శివాయ నామస్మరణలతో కదిలింది. భజన మండళ్ళ కోలాటలు, భజనలు, మంగళవాయిద్యాల నడుమ కోలాహలంగా సాగింది. ఆత్మ రధికుడు, శరీరమే రథం. బుద్ధి సారధి, మనస్సు పగ్గం. ఇంద్రియాలే గుర్రాలు. విషయాలే వీధులు. అనంతరం స్వామిఅమ్మవార్లకు వేడుకగా స్నపనతిరుమంజనం నిర్వహించారు. ఉపచారాలు జరిపించారు. రాత్రి అధికార నందివాహనంపై సోమస్కంధమూర్తి అధిరోహించి భక్తులను కటాక్షించారు. నంది స్వామివారికి వాహనం. ఈ వాహనసేవల్లో టిటిడి సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, ఆలయ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, విఎస్ఒ అల్లం సురేంద్ర, అలిపిరి సిఐ పివిఎస్ రామకిశోర్, ఏవిఎస్ఒ రమేశ్‌కృష్ణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత



విజయవాడ, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త ప్రతినిధి: కూటమి ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి తగిన ప్రాధాన్యతనిస్తోందని ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అన్నారు. ఆదివారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'శాసనసభలో ప్రవేశపెట్టిన 2026-27 వార్షిక బడ్జెట్ రాష్ట్ర చరిత్రలో ఒక మైలు రాయిగా నిలుస్తుంది. సంకల్పం ఉన్నచోట సాధనకు మార్గముంటుందన్నట్లుగా నేటి బడ్జెట్ రాష్ట్ర ఉజ్వల భవిష్యత్తుకు ఉపయోగపడేలా ఉంది. ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించే విధంగా ఈ బడ్జెట్ ను భావించొచ్చు. కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాల్లో మైనార్టీలకు పెద్దపీట వస్తోంది. గత ప్రభుత్వం చెల్లించకుండా పెట్టిపోయిన ఇమాం, మోజన్ల గౌరవ వేతనాన్ని కూటమి ప్రభుత్వం చెల్లించింది. హజ్ యాత్రకు వెళ్లే ప్రతి హాజీకి లక్ష రూపాయలు కూటమి ప్రభుత్వం చెల్లిస్తోంది. ప్రధానమంత్రి జన్ వికాస్ యోజన ద్వారా రాష్ట్ర మైనార్టీల సంక్షేమానికి రూ.300 కోట్లు మంజూరు అయింది. ఉర్దూ భాషాభివృద్ధి, తదితరవాటికి రూ.7.78 కోట్లు కేటాయించాం. ఉర్దూ ఘర్, ఉర్దూ లైబ్రరీల అభివృద్ధికి రూ. 2.85 కోట్లు కేటాయించాం. మైనార్టీ నిరుద్యోగులకు నిష్ణాతులచే కోచింగ్ ఇప్పించి, వారిని ప్రయోజకులను చేయడానికి రూ.3.97 కోట్లు కేటాయించాం. ఉర్దూని రెండవ మాతృభాషగా ప్రకటించి గాలికొదలేసిన వైసీపీ ప్రభుత్వంలా కాకుండా ఉర్దూను అభివృద్ధి చేయాలి, ఉర్దూ పాఠశాలల్ని అభివృద్ధి చేయాలి, ఉర్దూలో చదువుకునే విద్యార్థులకు ఉద్యోగావకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం ఉర్దూ అభివృద్ధికి రూ. 7.83 కోట్లు కేటాయించడం జరిగింది. మైనార్టీలకు పెద్దపీట వేస్తూ.. తల్లికి వందనం పథకాన్ని 15 శాతం మైనార్టీలకు కేటాయించడం జరిగింది. సామాజిక పెన్షన్ల పంపిణీలో మైనార్టీలకు పెద్దపీట వేస్తున్నాం' అని వివరించారు.

## సూపర్ సిక్స్ హామీల ప్రస్తావనేదీ?



విజయవాడ, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త ప్రతినిధి: టిడిపి కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ బడాయి బడ్జెట్‌గా ఉందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య విమర్శించారు. సంక్షేమం, అభివృద్ధికి సమతుల్యత లేదని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో ఇంకా కదలిక లేకుండా పోయిందని, మిగిలిన హామీలు ఎప్పుడు అమలు చేస్తారనే ప్రస్తావన లేదన్నారు. నిరుద్యోగులను, మహిళలను, రైతులను, ఉద్యోగులను ఈ బడ్జెట్ మోసగించిందన్నారు. పోలవరం ప్రాజెక్టు 72శాతం పూర్తయ్యిందని గతంలో ప్రకటించుకున్న ప్రభుత్వం ఇప్పుడు 60 శాతమే పూర్తయ్యిందంటూ పేర్కొనడం హాస్యాస్పదంగా ఉందని తెలిపారు. బడుగు బలహీన వర్గాలకు బడ్జెట్‌లో కేటాయించిన నిధులు చాలా తక్కువన్నారు. ఏ ప్రాధాన్యతా రంగానికి బడ్జెట్‌లో నిధుల కేటాయింపు లేదన్నారు. బడ్జెట్ పూర్తిగా రాష్ట్ర ప్రజల ఆశలను ఒమ్ము చేసిందన్నారు.

## బడ్జెట్ అంతా అభూత కల్పనలే

విజయవాడ, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కొత్త సీసాలో పాత నీరు అన్న చందంగా ఉందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పేర్కొన్నారు. బడ్జెట్ అంతా ఊహాజనితం, అభూత కల్పనలేనన్నారు. ఎపి ప్రభుత్వానికి పేద, మధ్య తరగతి వర్గాలపై ప్రేమలేదన్నారు. వారి సంక్షేమానికి తగిన నిధులు కేటాయించలేదని "ఎక్స్"లో చేసిన పోస్టింగ్‌లో షర్మిల పేర్కొన్నారు. ఇచ్చిన వాగ్దానాలను పూర్తిగా విస్మరించి, సూపర్‌సిక్స్ హామీలకు పంగనామాలు పెట్టారని విమర్శించారు. ఇంది మంచి ప్రభుత్వం కాదు.. ముంచే ప్రభుత్వం అని మరోసారి స్పష్టమైందని పేర్కొన్నారు. ఆడబిడ్డ నిధి ప్రస్తావన లేకపోవడం విడ్డూరంగా ఉందని తెలిపారు. వడ్డీలేకుండా రూ.10 లక్షల వరకూ రుణాలు అని చెప్పి ఒక్క రూపాయి కేటాయించలేదని తెలిపారు. 50 లక్షల మంది నిరుద్యోగులను మరోసారి మోసం చేశారని పేర్కొన్నారు.

## కోవా బన్ వలీకి ఎమ్మెల్సీ నాగబాబు రూ.25 వేలు ఆర్థికసాయం

విజయవాడ, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలోని చిరు వ్యాపారులకు కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయిలో అండగా నిలుస్తుందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ నాగబాబు భరోసా ఇచ్చారు. పొట్టకూటి కోసం మేడారం జాతరలో కోవా బన్ అమ్ముకుంటున్న వలీ అనే చిరు వ్యాపారిని కొందరు భయభ్రాంతులకు గురిచేసిన ఘటనపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఇలాంటి సంఘటనలు సమాజానికి మంచివి కాదని ఆయన హితవు పలికారు. ఈ దాడి ఘటన తర్వాత ఎందరో చిరువ్యాపారులు ఆందోళనకు గురవుతున్నారని నాగబాబు తన ప్రకటనలో పేర్కొన్నారు. దాడి కారణంగా శివరాత్రి నాడు తాను వ్యాపారం చేసుకోలేకపోయానని బాధిత వ్యక్తి వలీ ఆవేదన వ్యక్తం చేయగా, అతనికి వ్యక్తిగతంగా రూ. 25 వేల ఆర్థిక సహాయం అందించినట్లు నాగబాబు తెలిపారు. వలీ వంటి ఎందరో చిరువ్యాపారులకు ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ దాడిని మంత్రులు లోకేశ్, అచ్చెన్నాయుడు, ఎకొండపల్లి శ్రీనివాస్ కూడా ఖండించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ ఘటనకు మతపరమైన రంగు పులమవద్దని నాగబాబు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. చిరువ్యాపారులు విక్రయించే ఆహార పదార్థాల నాణ్యతపై ఏమైనా సందేహాలుంటే, దానిని పరిశీలించడానికి ఫుడ్ సేఫ్టీ అథారిటీలు ఉన్నాయని, సంబంధిత అధికారులను సంప్రదించాలి తప్ప దాడులకు పాల్పడటం సరికాదని సూచించారు. దేశంలో కోట్ల మంది తమ కాళ్లపై తాము నిలబడాలనే సంకల్పంతో వ్యాపారాలు చేస్తున్నారని గుర్తుచేశారు. పట్టణ ప్రాంతాల్లో 40శాతానికి పైగా పేద ప్రజలు వీరు విక్రయించే ఆహారంపైనే ఆధారపడతారని, అలాంటి వారిని కాపాడుకోవడం ప్రభుత్వ బాధ్యత అని నాగబాబు వివరించారు.



## శ్రీవారి అనుగ్రహంతో శుభాలు

తిరుమల, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త ప్రతినిధి: కలియుగ ప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామి అనుగ్రహంతో అందరికీ శుభాలు కలగాలని, అందరూ సంతోషంగా ఉండాలని ప్రముఖులు ఆకాంక్షించారు. మహాశివరాత్రి పర్వదినాన ఆదివారం ఉదయం ప్రభుత్వ విప్ గణబాబు, మాజీ స్పీకర్ ప్రతిభాభారతి, ఎమ్మెల్యే గ్రీష్మ, ప్రముఖ గాయని డాక్టర్ శోభారాజు కుటుంబంతో కలసి శ్రీవారి ఆశీస్సులందుకున్నారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# కన్నుల పండువగా మల్లన్న పాగాలంకరణ



పాగాలంకరణతో మల్లన్న ఆలయం(ఫైల్ ఫోటో)

- కమనీయం శ్రీ స్వామి అమ్మవార్ల ప్రభోత్సవం
- నంది వాహనాధీశులైన శ్రీ స్వామి అమ్మవారు
- ఆది దంపతులకు వైభవంగా కల్యాణం

శ్రీశైలం ప్రాజెక్ట్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త: శ్రీశైలం మహా పుణ్యక్షేత్రంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని నవాహ్నికదీక్షతో పదకొండురోజుల పాటు నిర్వహింపబడే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఎనిమిదవ రోజైనా ఆదివారంనాడు శ్రీ స్వామి అమ్మవార్లకు విశేష పూజలు జరిపించారు. అనంతరం లోక కళ్యాణం కోసం జపాలు,పారాయణలు చేశారు. అనంతరం మండపారాధనలు పంచావరనార్చనలు, జపాను స్టానాలు. రుద్ర హోమం, చండీ హోమం, కార్యక్రమాలు ఆగమ శాస్త్రం ప్రకారంగా నిర్వహించారు. అదేవిధంగా సాయంకాలం ప్రదోషకాల పూజలు, జపాను స్థానాలు,రుద్ర పారాయణలు హోమాలు జరిపించబడ్డాయి.

**కమనీయం మల్లన్న ప్రభోత్సవం:** మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా సాయంకాలం శ్రీ స్వామి అమ్మవార్ల ప్రభోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. రథోత్సవంలో రథానికి చేసినట్లుగానే ప్రభోత్సవములో కూడా ప్రభకు పలు రకాల పుష్పాలతో పుష్పాలంకరణ చేయడం జరిగింది. ప్రభోత్సవములో నాదస్వరం, కోలాటం, చెక్కభజన, రాజభటుల వేషాలు, కేరళ చండీ మేళం, కొమ్ము కొయ్య నృత్యం, ముంబాయి డోల్ తాషా, మహిళ వీరగాసి, కన్నడ జానపద కళా ప్రదర్శన, పురుషులు వీరగాసి కన్నడ కళా ప్రదర్శన, కాలిక నృత్యం, జానపద పగటి వేషాలు, గోరవయ్య నృత్యం, బుట్ట బొమ్మలు, తప్పేటచిందు, బీరప్ప డోలు, నందికోల సేవ, డమరుకం, చిడతలు, శంఖం, పిల్లనగ్రోని, డోలు విన్యాసం, తదితర కళారూపాలను గ్రామోత్సవంలో ఏర్పాటు చేయడం జరిగింది, ఆలయ రాజగోపురం నుంచి ప్రారంభమైన గ్రామోత్సవం గంగాధర మండపం మీదుగా నందిమండపం, బయలు వీరభద్ర స్వామి ఆలయం వరకు కొనసాగింది. పుష్పపల్లకిపై దర్శనం ఇచ్చిన శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి అమ్మవార్లను భక్తులు కనులారా వీక్షించి మురిసిపోయారు. గ్రామోత్సవములో ధర్మకర్తల మండలి అధ్యక్షులు పి.రమేష్ నాయుడు, ఈవో ఎం.శ్రీనివాసరావు, అధికారులు, అర్చక స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

**నంది వాహనాధీశులైన శ్రీ స్వామి అమ్మవార్లు:** మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని నిర్వహిస్తున్న వాహన సేవలలో భాగంగా ఆదివారం నాడు శ్రీ స్వామి అమ్మవార్లకు నంది వాహన సేవ మరియు ఆలయ ఉత్సవం నిర్వహించారు. లింగోద్భవ కాల మహారుద్రాభిషేకం: మహా శివరాత్రి పర్వదినంను పురస్కరించుకొని ఆదివారము నాడు రాత్రి పది గంటల నుండి శ్రీ స్వామివారికి లింగోద్భవ కాల మహా రుద్రాభిషేకం జరిపించారు. నిష్ణాతులైన 11మంది అర్చక స్వాములు మహన్యాస పూర్వకంగా రుద్రమంత్రాలను పటిస్తుండగా దాదాపు నాలుగు గంటలకు పైగా జ్యోతిర్లింగ స్వరూపుడైన శ్రీ స్వామి వారికి అభిషేకం జరిపించారు. ఆలయ ప్రాంగణంలోని పవిత్రమైన మల్లికా గుండములోని జలంతోనూ, పంచామృతాలతోనూ,పలు ఫలోదకాలతోనూ అభిషేకం చేశారు. పెళ్లి కుమారునికి పాగాలంకరణ: లింగోద్భవ కాల మహా రుద్రాభిషేకం ప్రారంభమైన వెంటనే పాగాలంకరణ ప్రారంభించబడింది. బ్రహ్మోత్సవాలలో జరిగే ఈ పాగాలంకరణ ఎంతో ప్రత్యేకత ఉంది. మన వివాహాల్లో పెండ్లి కుమారునికి తల పాగా చుట్టడం ఒక సాంప్రదాయం. ఈ ఆచారమే శ్రీశైలం ఆలయములో పాగాలంకరణ పేరుతో ఆనువాయితీగా కొనసాగుతుంది. ఈపాగ స్వామివారి గర్భాలయ విమాన శిఖరము నుండి ముఖమండపంపై ఉండే నందులను అనుసంధానం చేస్తూ అలంకరించడం జరిగింది.పాగలను సమర్పించే భక్తులు నియమంతో భక్తిని మేలవించి రోజుకు ఒక మూర చొప్పున సంవత్సరములు 365 మూరల పొడవుతో ఈ పాగాను నేస్తారు. ఈ పాగాలంకారాలను అలంకరించే వ్యక్తి దిగంబరుడై పాగను అలంకరిస్తాడు. దిగంబరుడై పాగను అలంకరించవలసి ఉన్నందున పాగాలంకరణ సమయములో ఆలయంలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తారు. చిమ్మ చీకటిలో పాగ లంకరణ చేయడం ఎంతో నేర్పుతో కూడుకున్న పని. యధావిధిగా రాత్రి 10 గంటల నుండి ప్రకాశం జిల్లా చీరాల మండలం హస్తినాపురం గ్రామానికి చెందిన పృథ్వి వెంకటేశ్వర్లు తనయుడు పృథ్వి సుబ్బారావు స్వయంగా తెచ్చిన పాగతోపాటు ఇతర భక్తులు సమర్పించిన పాగలను కూడా స్వామివారికి అలంకరించారు.

**ఆది దంపతులకు ప్రత్యేక వేదికపై కల్యాణోత్సవం:** రాత్రి గం.12:00 లకు స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవం వైభవంగా జరిపించారు. కన్నుల పండుగ జరిగిన ఈ కల్యాణోత్సవములో స్వామివారు పట్టు వస్త్రాన్ని ధరించి తలపై ఒకవైపు గంగమ్మను, మరోవైపు నెలవంకను, మెడలో రుద్రాక్షమాలను, నుదుట విభూది రేఖలను, పట్టు వస్త్రాలను ధరించి పెండ్లి కుమారుడుగా ముస్తాబు అయ్యారు. కాగా అమ్మవారు కూడా పట్టు వస్త్రాలను ధరించి నుదుట కల్యాణ తిలకాన్ని బుగ్గన చుక్కను సర్వాభరణాలను ధరించి పెండ్లి కుమార్తె అయి స్వామికి సరి జోడి అనిపించుకున్నారు. మంగళ సూర్యనాదాలతో వేదమంత్రాల నడుమ నేత్రానందంగా ఈ కళ్యాణోత్సవం జరిగింది. అంతకు ముందు కంకణాలను స్వామి అమ్మవారి ఆభరణాలను యజ్ఞోపవీతానాన్ని బాషికలను ఊరేగింపుగా కళ్యాణ వేదిక వద్దకు తీసుకొని వచ్చారు. ఈ కల్యాణోత్సవములో లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ ముందుగా అర్చక స్వాములు కల్యాణోత్సవం సంకల్పాన్ని పటిస్తారు. తరువాత కల్యాణత్సవం నిర్విఘ్నంగా జరగాలని గణపతి పూజ జరిపించబడింది. ఆ తరువాత వృద్ధి అభ్యుదయాల కోసం పుణ్యాహవాచనం చేశారు. తర్వాత స్వామివారికి మధువర్కం సమర్పించబడి శ్రీ స్వామి అమ్మవార్లకు వస్త్రాలను సమర్పించబడ్డాయి. తరువాత భాషికా ధారణ కార్యక్రమం జరిగింది. ఆ తర్వాత గౌరీ పూజ జరిపించబడింది. స్వామి అమ్మవార్ల మధ్య తెర సెల్లను ఏర్పరచి మహా సంకల్ప పట్టణం చేయడం జరిగింది. అనంతరం సుముహూర్త సమయములో స్వామి అమ్మవార్లకు జీలకర్ర, బెల్లం సమర్పించారు. ఆ తరువాత మాంగల్య పూజలు జరిపించి అమ్మవారికి మాంగల్య ధారణ జరిపించబడింది. తరువాత తలంబ్రాలు బ్రహ్మముడి కార్యక్రమాలను జరిపి భక్తులకు ఆశీర్వచనాన్ని అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ సునీల్ శరణ్, ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షులు పి.రమేష్ నాయుడు, ఆలయ ఈవో ఎం.శ్రీనివాసరావు, ఉత్సవాల ప్రత్యేక అధికారి చంద్రశేఖర్ ఆజాద్, ప్రజా ప్రతినిధులు అధికారులు, అర్చక స్వాములు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## హరహర మహాదేవ.. శంభో శంకరా

### శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధిలో శివనామస్మరణ




క్యూలైన్లలో నిరీక్షిస్తున్న భక్త జనం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త: శ్రీకాళహస్తిలో వెలసిన స్వయంభువు వాయులింగేశ్వరునికి ఆదివారం మహాశివరాత్రి పర్వదినాన లక్షలాది మంది భక్తులు దర్శించుకున్నారు. వేకువ జాము 2గంటల నుంచే ఆలయంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఎస్‌పి సుబ్బారాయుడు, ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి వారి సిబ్బంది తిష్టవేసి భక్తులకు సుదర్శనం కోసం ప్రయత్నించారు. డిఎస్పీ నరసింహామూర్తి, ఇక్కడ గతంలో పనిచేసిన పోలీసు అధికారులు తిమ్మయ్య, నాగార్జున్‌రెడ్డి, సంజీవ కుమార్‌లను కంచుగడప వద్ద నియమించటంతో వివాదాలకు అతీతంగా భక్తులు దర్శనానికి వెళ్ళారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ సాదాసీదాగా ఓ సామాన్య భక్తుని వలె పర్యవేక్షించారు. ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టెసాయి ప్రసాద్, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ గర్భగుడిలో ఆగమశాస్త్ర పండితుల సూచనల మేరకు దర్శనాన్ని సుమగమం చేసారు. ఇఓ చొరవ, కలెక్టర్ పర్యవేక్షణలో వచ్చిన భక్తులు శివరాత్రి వేళ స్వయంభువును దర్శించుకున్నారు. భక్తజనం వేకువ జామున సువర్ణముఖి నదిలో చన్నీటి స్నాచమాచరించి 'కామ్యగోపురం ద్వారా భక్తజన కోటి 'కైలాసనాథ కరుణించవయ్యా అంటూ' స్వయంభువుని దర్శించుకున్నారు. 'హర హర మహాదేవ.. శంభో శంకర అంటూ శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమ్రోగింది.

## ఓంకార జ్యోతిర్లింగేశ్వర ఆలయంలో...



తిరుపతి, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త ప్రతినిధి: ఆదిదేవుడు పరమేశ్వరుడు మహాశివరాత్రి పర్వదినం ఎంతో విశిష్టమైందని, ఓంకార జ్యోతిర్లింగేశ్వర స్వామి ఆలయంలో ఆది వారం మహాశివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. తిరుపతి జిల్లా రేణిగుంట మండలం వెదళ్ళచెరువు గ్రామంలో వెలసిన పురాతన ఓంకార జ్యోతిర్లింగేశ్వరస్వామి ఆలయంలో శివలింగానికి భక్తులు అభిషేకించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలు, వజ్ర ఆభరణాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. తిరుపతి బిజెపి జిల్లా నేత, రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి కుటుంబసభ్యులతో హాజరై స్వామివారికి సారె సమర్పించారు. భక్తులకు పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించారు. క్యూలైన్లలో వచ్చిన భక్తులకు మజ్జిగ, పానకం పంపిణీ చేశారు. దర్శనానంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. మహాశివరాత్రి పర్వదినాన ఓంకార జ్యోతిర్లింగేశ్వర స్వామి అలంకారంలో పరమేశ్వరుడ్ని, పార్వతీదేవిని దర్శించుకుంటే సకల శుభాలు కలుగుతాయన్నారు. భక్తులకు అన్నీ శుభాలు జరగాలని ఆకాంక్షించారు. నేడు పార్వతీపరమేశ్వరుల కల్యాణం వేడుకగా జరగనుంది. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు కృష్ణయ్యస్వామి, చంద్రశేఖరస్వామి, సూరా రఘురామిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, శింగంశెట్టి సుబ్బరామయ్య, లోక ప్రభాకర్ నాయుడు, రెడ్డప్ప, జ్యోతి, అరుణ, చంద్ర, అమారావతమ్మ, లక్ష్మి, కల్యాణి, భక్తులు పాల్గొన్నారు.



# అన్ని ఆలయాలకూ రోడ్డు సౌకర్యం

### - శివరాత్రి శుభాకాంక్షలు తెలిపిన ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

విజయవాడ, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రధాని మోడీ సహకారంతో, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలోని చిన్న, పెద్ద ఆలయాలన్నింటికీ రోడ్డు సౌకర్యం కల్పించేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కృషి చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెల్లడించారు. "ఆలయాల అభివృద్ధికి, ధర్మ పరిరక్షణకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుంది. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ఆ పరమశివుని ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరుకుంటున్నాను" అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని కోరుకుంటూ భక్తులందరికీ పవన్ కల్యాణ్ మరోసారి శివరాత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. పరమేశ్వరుడి అనుగ్రహంతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ఒక సందేశాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పుణ్యభూమి అని పవన్ కల్యాణ్ కొనియాడారు. శ్రీశైల జ్యోతిర్లింగ క్షేత్రం, శ్రీకాళహస్తి వాయులింగ క్షేత్రం, పంచారామ క్షేత్రాల విశిష్టతను గుర్తు చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆలయాల పవిత్రతను కాపాడటమే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.

### ప్రభుత్వ ఆధ్వర్యంలో శివరాత్రి వేడుకలు

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 41 ప్రముఖ శైవ క్షేత్రాల్లో ప్రభుత్వం అధికారికంగా శివరాత్రి వేడుకలను నిర్వహిస్తోందని, ఇది తమ ప్రభుత్వ భక్తి భావానికి నిదర్శనమని డిప్యూటీ సిఎం పేర్కొన్నారు. భక్తుల సౌకర్యార్థం చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు.
శ్రీకాళహస్తి గిరి ప్రదక్షిణ మార్గంలో నూతన సిమెంటు రోడ్డు నిర్మాణం పూర్తి చేసి ప్రారంభించాం. కోటప్పకొండ భక్తుల సౌకర్యార్థం గిరి ప్రదక్షిణ మార్గం రోడ్డు నిర్మాణానికి అనుమతులు మంజూరు చేశామని డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ తెలిపారు.



ప్రసవం అయ్యాక బాలింతల్లో అనేక సమస్యలు తలెత్తుతాయి. బరువు పెరుగుతారు. సరిగా నిద్ర ఉండదు. తరచూ కోపం, చిరాకు వంటి వాటికి లోనవుతారు. అనుక్షణం పసి పిల్లల్ని కనిపెట్టుకుని ఉండటమే తప్ప తమ గురించి పట్టించుకునే తీరిక ఉండదు. కొందరిలో గుండెజబ్బులు, డయాబెటిస్ వంటివీ రావొచ్చు. వీటన్నింటితో వాళ్లు

# పెల్విక్ ఎక్సర్‌సైజులు

డిప్రెషన్‌కి లోనవుతారు. పరిస్థితి అంతవరకూ వెళ్లకూడదంటే ప్రసవం అయిన తొలి మూడు నెలలూ బాలింతలు చురుగ్గా ఉండటం చాలా అవసరమని అంటోంది బ్రిటిష్ కొలంబియా యూనివర్సిటీ, కెనడియన్ సొసైటీ ఫర్ ఎక్సర్‌సైజ్ సైకాలజీ సంస్థలు చేసిన అధ్యయనం. బాలింతలు తొలి మూడు నెలలు తప్పనిసరిగా నడవడం, వీలుంటే సైక్లింగ్, ఇతర తేలికపాటి వ్యాయామాలకి రెండు గంటల సమయం కేటాయిస్తే తీవ్ర భావోద్వేగాలకు దూరంగా ఉండటమే కాదు శారీరకంగా పూర్వపు స్థితికి రావడం తేలిక అవుతుందని పరిశోధకులు అంటున్నారు. సాధారణ వ్యాయామాలతో పాటు కండరాలకు సంబంధించిన పెల్విక్ ఎక్సర్‌సైజులు చేయడం, సరైన సమయానికి నిద్రపోవడం కూడా ముఖ్యమేనట. పెల్విక్ ఎక్సర్ సైజులు చేయడం ద్వారా ప్రసవం తర్వాత రికవరీకి సహాయంగా ఉంటుంది. నడుము భాగం బలంగా ఉంటుంది. ఈ ఎక్సర్‌సైజులు చేసేటప్పుడు ఖాళీ మూత్రాశయంతో చేయాలి. నొప్పి ఉంటే డాక్టర్‌ను సంప్రదించాలి.



# వీఆర్‌తో స్టేజ్ ఫియర్‌కు చెక్

కొంత మందికి స్టేజ్ ఎక్కాలంటే వణుకు పుడుతుంది. నలుగురిలోకి వచ్చి మాట్లాడాలంటే నోరు పెగలదు. నిజానికి చావు భయం తర్వాత అంతగా భయపెట్టే సందర్భం పబ్లిక్ స్పీకింగ్ సమస్యే అని గత అధ్యయనాలూ తేల్చాయి. ఈ భయాన్ని పోగొట్టుకుని కెరీర్‌లోనూ, వ్యక్తిగతంగానూ ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేసేందుకు అనేక రకాల పుస్తకాలూ మార్కెట్‌లోకి వచ్చాయి. వాటితోపాటు కోచింగ్‌లూ, సాధన చేయడం కొంతవరకూ ఈ సమస్యకు పరిష్కారం చూపించినా, వర్చువల్ రియాలిటీ పరిజ్ఞానం మరింత మెరుగైన ఫలితాలని అందిస్తోందట లండన్‌లోని కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో పనిచేస్తున్న 'వీ ఆర్ ప్లాట్‌ఫామ్' వీటిపైన ఇటీవల ఓ అధ్యయనం నిర్వహించింది. వెయ్యి మంది విద్యార్థులని తీసుకుని వాళ్లకు వర్చువల్ రియాలిటీలో సైన్స్‌ఫెయిర్లూ, పెద్ద పెద్ద ఆడిటోరియాలూ, కాన్ఫరెన్స్ హాళ్లను చూపిస్తూ ఆయా ప్రదేశాల్లో బెదురు లేకుండా ఎలా మాట్లాడాలో శిక్షణ ఇచ్చింది. వాళ్లు మాట్లాడుతున్నప్పుడు ఏఐ కోచ్ వారి హావభావాలనీ, ఆత్మవిశ్వాసాన్నీ పరీక్షిస్తుంది.



ఇలా వీఆర్ పద్ధతిలో మాట్లాడిన విద్యార్థులు ఒకటి, రెండు సెషన్ల తర్వాత క్రమంగా ఆత్మవిశ్వాసం పెంచుకుంటూ బెరుకు లేకుండా ధైర్యంగా మాట్లాడటాన్ని వీఆర్ ఫ్లాట్‌ఫామ్ టీమ్ గమనించింది. తక్కిన పద్ధతుల్లో పోలిస్తే వీఆర్ విధానంలో పబ్లిక్ స్పీకింగ్ నైపుణ్యాలు తొందరగా పట్టుబడుతున్నాయని ఈ అధ్యయనం తేల్చింది.

# ఆదర్శ మహిళ

ఆధ్యాత్మికం, పురాణాలు, చరిత్రలో చూసుకుంటే ఎందరో మహిళలు మహిళాలోకానికి ఆదర్శంగా నిలిచారు. వారిలో సీతమ్మతల్లికి సాటిగా ఉదాత్త వ్యక్తిత్వం కలిగిన స్త్రీ ఊర్మిళాదేవి. అయోధ్యలో ఆనాడు సీతారాముల పట్టాభిషేకం అనే మంగళకర సమాచారం విని ఎంతో సంబరపడుతూ, ఆనందంతో సీతారాముల వైభవాన్ని తలచుకొంటూ, అంతఃపురంలో ఒక ఊహాచిత్రాన్ని గీస్తూ ఉన్న సమయంలో లక్ష్మణుడు ఎంతో కలవరపాటుతో మందిరంలో అడుగు పెడతాడు. అది గమనించిన ఊర్మిళ మనసులో అలజడి మొదలై, తొట్రుపాటుతో వణికిపోగా, రంగులన్నీ ఒలికి ఆమె గీస్తున్న చిత్రం చెడిపోతుంది. "కైకమ్మ వల్ల శ్రీరామచంద్రుని పట్టాభిషేకమే భంగమైంది! ఇక ఈ చిత్రానిదేముంది?" అంటూ కుమిలిపోతాడు లక్ష్మణుడు. "అన్నగారితో తానూ 14 సం॥ వనవాసం వెళ్లి సీతారాముల సేవ చేసుకొంటాను" అని ఊర్మిళతో చెబుతాడు. భర్త తనను రమ్మని అనలేదు. తను కూడా వెంట వస్తాననీ పట్టుబట్టలేదు. పైగా, "మీ అన్నా వదినల సేవలో మీరు తరించండి. కానీ వనవాస కాలంలో నా గురించి ఆలోచించకండి" అని అంటుంది. అందుకే సీతారామ లక్ష్మణులకు వీడ్కోలు చెప్పేందుకు కూడా ఆమె అంతఃపురం విడచి బయటకు రాలేదు. భర్తతో అరణ్యవాసాన్ని అయోధ్య వాసంలా భావించి, చరించిన చరిత సీతమ్మతల్లిదైతే, భర్త చేసిన త్యాగానికి ప్రతిఫలంగా అయోధ్యనే అరణ్యంగా భావించి జీవనం సాగించి ఘనత ఊర్మిళది.

రామ-రావణ యుద్ధంలో లక్ష్మణ మూర్ఛతో రాముడు అల్లాడుతుండగా, హనుమంతుడు సంజీవని పర్వతాన్ని పెళ్లగించి, చేతబట్టి అయోధ్య మీదుగా వెళ్తుండగా, విషయం తెలుసుకోవాలనే కోరికతో భరతుడు పర్వతంతో సహా హనుమంతుడిని కిందికి తన దివ్యశక్తితో దించుతాడు. కౌసల్యతో సహా అందరూ హనుమంతుని ద్వారా లక్ష్మణుడి దుస్థితిని తెలుసుకొని దుఃఖిస్తూ ఉంటారు. కానీ ఊర్మిళ మాత్రం నిశ్చలంగా ఉండటాన్ని గమనించి హనుమంతుడు ఆశ్చర్యంగా "అమ్మా, నీవు ఇంత నిర్భయంగా ఎలా ఉండగలుగుతున్నావు? నేను సూర్యోదయం లోపలే నీ భర్త దగ్గరకు చేరకపోతే ఆయన ప్రాణాలకే ముప్పు కలుగుతుంది కదా! నీకు ఏమాత్రం ఆందోళన కలగటం లేదా?" అని అడుగుతాడు. అప్పుడు ఊర్మిళాదేవి "మీరు ఎంతో అమాయకులు. నిరంతరం రామ నామ 'అమృత' పానం చేసే



నా భర్తను ఆ రామచంద్రుడు రక్షించకుండా ఉంటాడా? మూర్ఛ పేరుతో నా భర్తకు కొంతసేపు విశ్రాంతి ఇచ్చాడు అంతే! అయినా నా మంగళసూత్రంపై ఒట్టు పెట్టి చెప్తున్నా. హనుమా! నీవు లంకకు చేరి నీ సంకల్పం నెరవేరేవరకు సూర్యోదయం కాదు" అన్నది. అక్కడ ఉన్న అందరూ ఆమె మనోధైర్యానికి ఆశ్చర్యపడతారు. పట్టాభిషేకం తరువాత శ్రీరాముడు ఊర్మిళతో "తల్లీ! నీవు చేసిన త్యాగంతోనే మేం అక్కడ అన్ని సమస్యలను తట్టుకొని నిలబడగలిగాం. అందుకే నా సీత, నా సోదరుడు లక్ష్మణుడితో పాటుగా నువ్వు కూడా మా పక్కనే ఆసీను రాలివై ఉండమని" అన్నాడు. అంతటి రామానుగ్రహానికి పాత్రమైన ఊర్మిళ కళ్లు చెమ్మగిల్లడంతో "ప్రభూ! మీ పాదాల వద్ద చోటు కన్నా పరపావనమైనది ఏదీ లేదు. ప్రతి రోజూ మీ అనుగ్రహాన్ని పొందే నైవేద్య రూపంలో నేను ఉండేలా నన్ను అనుగ్రహించండి" అని వేడుకొన్నది. అప్పుడు శ్రీరాముడు కలియుగంలో పూరీ క్షేత్రంలో నేను కృష్ణావతారంలో వెలుస్తాను. నా సోదరుడు బలరాముడి నాకు తోడుగా ఉంటాడు. నువ్వు విమలాదేవిగా, ఆ ఆలయ క్షేత్రపాలకురాలిగా, అక్కడ నిత్యం నైవేద్యం కోసం తయారు చేసే మహాప్రసాదంలో కొలువై ఉంటావు" అంటూ వరం ఇచ్చాడు. ఇప్పటికీ పూరీ జగన్నాథుని ఆలయం పక్కన విమలాదేవి ఉపాలయం కనిపిస్తుంది. అక్కడ నిత్యం తయారయ్యే ప్రసాదాన్ని ఆ అమ్మవారికి నివేదించిన తరువాతే భక్తులకు అందిస్తూ ఉంటారని ప్రతీతి.

**- పద్మ**

అతడు చాలా అందగాడు. యువకుడు. ధనం వుంది. గొప్ప కులంలో పుట్టాడు. అయినా అతను, అతని జీవితమూ వృథా చేస్తూ వున్నాడు. మంచి వర్ణంతో కూడినది ఆ పుష్పం. వికాసంగా వుంటుంది. కానీ దానికి వాసనయోగ్యం లేదు. అదే బాడిన పుష్పం. అలాగే హంసల గుంపులో కొంగ ఎలా ప్రకాశింపదో, ఆ విధంగానే విద్యావిహీనుడు సర్వ ఐశ్వర్యములుండి కూడా జనాల మధ్యలో శోభింపడు. మీరు గమనించే వుంటారు.. కొన్ని మేకలకు గళంలో స్తనాలుంటాయి. అవి పరిహాసపాత్రములేగానీ, పాలుమాత్రం వుండవు.

## ఎంత ఉంటే ఏమి ప్రయోజనం?

విద్యలేని జన్మం కూడా ఆ విధంగా రాణించదు. విద్య లేని మానవ జన్మ కుక్కతోకవలే వ్యర్థం. అంటే కుక్కతోక దాని మర్మస్థానమును మెరుగుపరచుటకు, దేహమును బాధించే ఈగలను తోలుకోడానికి కూడా ఉపయోగపడదు. కానీ ఇతర జంతు వుల తోకలు అలా కాదు. కనుక విద్యాహీనుడు కేవలం భూమికి భారమేగానీ దానివలన కొంచెం అయినా ఉపయోగం లేదు. విద్య అనేది రహస్యంగా దాచిపెట్టిన ధనం. విద్యయే సకల భోగాలను, కీర్తినీ, సుఖాన్నీ ఇస్తుంది. విద్య గురువు లాగా అన్నింటినీ బోధిస్తుంది. పరదేశంలో చుట్టం లాగా సహాయం చేస్తుంది. విద్యాధనమే అసలైన ధనం.



**- డా॥ పులివర్తి కృష్ణమూర్తి**



# ఉప్పుతో ముప్పు!

ఉప్పు తింటే బిపి పెరుగుతుందన్నది తెలిసిందే! కానీ ఉప్పుకీ మానసిక ఆరోగ్యానికి కూడా సంబంధం ఉందని చెబుతోంది చైనాలోని నాన్జింగ్ యూనివర్సిటీ చేసిన ఈ పరిశోధన. అతిగా ఉప్పు తీసుకోవడం కుంగుబాటుకీ దారితీస్తుందని హెచ్చరిస్తోంది. ఉప్పు మన శరీరంలోని ఐఎల్-17ఏ అనే ప్రొటీన్‌ని పెంచుతుండడాన్ని ఈ పరిశోధనలో పాల్గొన్న శాస్త్రవేత్తలు గమనించారు. ఇది ఆటో ఇమ్యూనిటీని పెంచే ప్రొటీన్. కొవిడ్ వంటివి వచ్చినప్పుడు శరీరంలోని రోగనిరోధక వ్యవస్థ అవసరాని కంటే ఎక్కువగా స్పందించి (సైటోకైన్ రియాక్షన్ అంటారు) మనకెక్కువ చెడు చేయడానికి ఇదే కారణం. అదొక్కటే కాదు.. మన మెదడులోని కుంగుబాటుకి కారణమయ్యే రసాయనాలన్నీ ఈ ప్రొటీన్ ప్రేరేపిస్తుందని శాస్త్రవేత్తలు నిరూపించారు. ఇన్ని సమస్యలకి కారణమయ్యే ఐఎల్-17ఏ ప్రొటీన్ ఉప్పుతో పెరుగుతోందని నాన్జింగ్ వర్సిటీ పరిశోధకులు గుర్తించారు. కాబట్టి మానసిక సమస్యలకి చికిత్స తీసుకుంటున్నవాళ్లు ఉప్పుని ఎంత తగ్గిస్తే అంత మేలని చెబుతున్నారు.

# పనీర్ బాదుషా

పనీర్ బాదుషా అనేది సాంప్రదాయ దక్షిణ భారతీయ మిఠాయి అయిన బాదుషాకి ఒక ప్రత్యేక రూపం. ఉత్తర భారతదేశంలో ఇదే మిఠాయిని బాలూశాహీ అని పిలుస్తారు. సాధారణ బాదుషాలో మైదా ప్రధాన పదార్థం కాగా, పనీర్ బాదుషాలో పనీర్ కలపడం వల్ల ఇది మరింత మృదువుగా, రిచ్‌గా ఉంటుంది. దీనికి కావలసినవి: **మైదా:** ఒకటిన్నర కప్పు, **పనీర్ తురుము:** రెండు వందల గ్రాములు, **నెయ్యి:** ఆరు టేబుల్ స్పూన్లు, **పెరుగు:** నాలుగు టేబుల్ స్పూన్లు, **పాలు:** అరకప్పు, **బేకింగ్ సోడా:** పావుచెంచా, **కుంకుమపువ్వు రేకలు:** పది, **యాలకుల పొడి:** పావుచెంచా, **చక్కెర:** రెండు కప్పులు, **నీళ్లు:** కప్పు, నూనె లేదా నెయ్యి వేయించేందుకు సరిపడా. **తయారు చేసే విధానం:** చక్కెర, నీళ్లు ఓ గిన్నెలో వేసుకొని స్టవ్‌మీద పెట్టాలి. చక్కెర కరిగాక కుంకుమపువ్వు రేకలు, యాలకులపొడి వేసి లేతపాకంగా ఉన్నప్పుడే



దింపేయాలి. ఓ గిన్నెలో మైదా, బేకింగ్‌సోడా వేసి కలుపుకోవాలి. తరువాత నెయ్యి వేస్తూ కలపాలి. ఇప్పుడు పనీర్ తురుము కూడా వేసుకుని బాగా కలిపి పాలు, పెరుగు వేసుకోవాలి. ఇవన్నీ బాగా కలిశాక నీళ్లు చల్లుకుంటూ గట్టి పిండిలా చేసుకుని మూత పెట్టాలి. అయిదు నిమిషాలయ్యాక కొద్దిగా పిండిని తీసుకుని వెడల్పుగా చేసి మధ్యలో చిల్లులా పెట్టుకోవాలి. ఇలా అన్నింటినీ చేసుకుని రెండు మూడు చొప్పున కాగుతున్న నూనె లేదా నెయ్యిలో వేస్తూ ఎర్రగా వేయించుకుని తీసుకోవాలి. వీటిని చక్కెర పాకంలో వేసుకుని అయిదు



## కుటుంబ విలువలు ప్రతిబింబించేలా

గ్రామీణ నేపథ్యంతో కుటుంబ బంధాల ప్రాముఖ్యతను ప్రతిబింబించేలా రూపొందుతున్న రాయుడి గారి తాలుకా చిత్రం ప్రేక్షకుల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది. ఉలిశెట్టి మూవీస్ బ్యానర్‌పై కొర్రపాటి నవీన్ శ్రీ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో శ్రీనివాస్ ఉలిశెట్టి, సత్య ఈషా జంటగా నటిస్తున్నారు. నిత్యశ్రీ, పునర్వికా వేద శ్రీ, నవీన్ శ్రీ, పీజే దేవి, కరణం పేరినాయుడు నిర్మిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో వేగంగా పనులు జరుపుకుంటోంది. మ్యూజిక్, ఎడిటింగ్, డబ్బింగ్ వంటి కార్యక్రమాలు పూర్తయ్యే దశకు చేరుకున్నట్లు చిత్ర యూనిట్ వెల్లడించింది. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను బంగార్రాజు ఫేమ్ దర్శకుడు కళ్యాణ్ కృష్ణ చేతుల మీదుగా విడుదల చేశారు. ట్రైలర్‌లో కుటుంబ బంధాలు, భావోద్వేగాలు, గ్రామీణ జీవనశైలి ప్రధానంగా కనిపించడంతో సినిమాపై ఆసక్తి పెరిగింది.

# కావేరితో ముద్దుగా



మాస్ మహారాజా రవితేజ హీరోగా శివ నిర్వాణ దర్శకత్వంలో ఇరుముడి చిత్రం చేస్తున్న సంగతి తెలిసిందే. రవితేజకు ఇది 77వ సినిమా. మైత్రి మూవీ మేకర్స్ పాన్ ఇండియా స్థాయిలో నిర్మిస్తోంది. ఇటీవల రవితేజ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ రిలీజ్ చేసిన టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌కు అద్భుతమైన స్పందన లభించింది. ఆదివారం మహా శివరాత్రి శుభ సందర్భంగా హీరోయిన్ ప్రియా భవానీ శంకర్ ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఇందులో ఆమె కావేరి పాత్రలో కనిపించనుంది. రవితేజ రగ్గడ్ లుక్‌లో ఆమె చెంపపై ప్రేమగా ముద్దుపెడుతూ కనిపించగా, ఇద్దరి మధ్య ఉన్న పోస్టర్ ఇద్దరి మధ్య ఇంటెన్స్‌ను చూపిస్తుంది. ఈ లుక్‌ను బట్టి చూస్తే గ్రామీణ నేపథ్యంలో సాగే సినిమా లాగా అనిపిస్తుంది. శివ నిర్వాణ ఇంటెన్స్, ఎమోషన్స్, కమర్షియల్ ఎలిమెంట్స్ పవర్ ఫుల్ కథని సిద్ధం చేశారు. ముఖ్యంగా తండ్రి-కూతురు అనుబంధం ఈ చిత్రానికి హైలెట్‌గా ఉండబోతోంది. రవితేజ గత సినిమాలకంటే భిన్నంగ కొత్త ఎమోషనల్ షేడ్స్‌తో కూడిన పాత్రలో కనిపించబోతున్నారు. బేబీ నక్షత్ర రవితేజ కుమార్తెగా నటిస్తుండగా, సాయి కుమార్, అజయ్ ఘోష్, రమేష్ ఇందిరా, స్వాసిక కీలక పాత్రల్లో కనిపించనున్నారు.

# తెర

## మహావతార్‌ను మించి...

కోట్ల రూపాయల కలెక్షన్లను రాబట్టుకున్న మహావతార్ చిత్రాన్ని మించిన అద్భుతాలతో మరో యానిమేటెడ్ ఫిల్మ్ తెరకెక్కుతోంది. దీని టైటిల్.. పినాకిన్. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఫస్ట్ లుక్ పోస్టర్‌ను నిర్మాతలు ఆవిష్కరించారు. ఈ ఏడాది దసరా దీపావళి పండగ సీజన్ సమయంలో విడుదల అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ సినిమాకు సంబంధించిన తొలి అధికారిక ప్రకటన ఇదే. ఈ చిత్రం విధి, విశ్వం, శివతత్వం వంటి అంశాలను ఇతివృత్తంగా తెరకెక్కుతున్నట్లు చెబుతుననారు. ఓ అద్భుతమైన దృశ్యరూపంగా చిత్రీకరణ జరుపుకొంటోంది. పినాకిన్ మూవీ దర్శకుడు నితిన్ జీ. ఆయనే రచనను కూడా సమకూర్చారు. ఈ చిత్రానికి కమల్ భారతి ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్



రూపొందిస్తోంది. హర్ష్ పండిట్, వామన్ రాణే నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. పినాకిన్ యానిమేటెడ్ ఫీచర్ ఫిల్మ్.. హిందీ, ఇంగ్లీష్, తమిళం, తెలుగు భాషల్లో విడుదల కానుంది. మహావతార్ నరసింహను మించిపోతుందనే అంచనాలు ఉన్నాయి.

# పూరీ ఆలయ నిగూఢ రహస్యాలతో

విరాట్ కర్ణ హీరోగా అభిషేక్ నామా దర్శకత్వం వహిస్తున్న పాన్ ఇండియా మూవీ నాగబంధం. నభా నటేష్, ఐశ్వర్య మీనన్ కథానాయికలు. కిషోర్ అన్నపురెడ్డి, నిషిత నాగిరెడ్డి నిర్మాతలు. మహా శివరాత్రి సందర్భంగా సూపర్‌స్టార్ మహేష్ బాబు టీజర్‌ను విడుదల చేశారు. రేబిలీ ఫేమ్ గరుడ రామ్ ఫస్ట్ లుక్‌ను విడుదల చేస్తూ ఆయన పాత్ర బైరాగిని పరిచయం చేశారు. బూడిదతో అలంకరించిన శరీరం, జటలతో కూడిన ఆతన లుక్ మిస్టికల్ టచ్ ఇచ్చింది. ఇంటెన్స్ లుక్స్, రుద్రాక్షలు, ఎముకలతో చేసిన మాలలు ఆయనను శక్తివంతమైన తాంత్రిక యోధుడిగా కనిపిస్తున్నారు. దర్శకుడు అభిషేక్ నామా మాట్లాడుతూ.. ఇది కేవలం రాసుకున్న కథ కాదని, ఏ చరిత్ర పుస్తకాల్లోనూ లేని ఒక అద్భుతమైన గాథ అని తెలిపారు. అనంత పద్మనాభ స్వామి ఆలయం, పూరీ జగన్నాథ ఆలయాల్లోని నిగూఢ రహస్యాలు, వాటిని రక్షించే నాగబంధం అనే ఆధ్యాత్మిక శక్తుల నేపథ్యంతో 1750 కాలంలో సాగే కథగా ఇది తెరకెక్కుతుందని తెలిపాడు. టీజర్‌లో విజువల్స్ ఉద్భుతంగా ఉన్నాయి. ప్రెజెంట్ జనరేషన్‌కి శివతత్వానికి లింక్ చేస్తూ వచ్చిన ఈ టీజర్ మైండ్ బ్లాంక్ చేసింది అనే చెప్పాలి.



ఇక శివుడిగా విరాట్ కర్ణ లుక్ అదిరిపోయింది. ఈ ఒక్క టీజర్ సినిమాపై అంచనాలను ఒక రేంజ్‌లో పెంచేసింది. ఇప్పటికే దాదాపు షూటింగ్ కంప్లీట్ చేసుకున్న ఈ సినిమా త్వరలోనే థియేటర్స్ లోకి రానుంది. ఇక నాగబంధం సినిమాలో జగపతి బాబు, నభా నటేశ్, ఐశ్వర్యా మేనన్ కీలక పాత్రల్లో కనిపిస్తున్నారు.



# మొదటి శుభలేఖ మామయ్యకే


యంగ్ హీరో అల్లు శిరీష్ పెళ్లి పనులు అధికారికంగా మొదలయ్యాయి. తన వివాహ మహోత్సవానికి సంబంధించిన తొలి శుభలేఖను ఆయన తన మామయ్య, మెగాస్టార్ చిరంజీవికి అందజేశారు. నయనికా రెడ్డితో త్వరలో ఏడడుగులు నడవనున్న శిరీష్, కుటుంబంలో పెళ్లి వేడుకలకు శ్రీకారం చుట్టారు. అల్లు శిరీష్ తన తల్లిదండ్రులైన అల్లు అరవింద్, నిర్మలతో కలిసి చిరంజీవి ఇంటికి వెళ్లారు. తన మేనత్త సురేఖ, చిరంజీవి దంపతులకు పెళ్లి పత్రికను ఇచ్చి, వారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ ఫొటోలను శిరీష్ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో పంచుకున్నారు. మా సంప్రదాయం ప్రకారం, మామయ్య చిరంజీవి గారికి, అత్త సురేఖ గారికి మొదటి పెళ్లి పత్రిక ఇచ్చాం.. అని పోస్ట్‌లో పేర్కొన్నారు.



# భయం గుప్పిట్లో సెలబ్రిటీలు..

కొన్నేళ్ల క్రితం బాలీవుడ్‌కి మాఫియా నుంచి బెదిరింపులు వచ్చేవి అని వార్తలు వచ్చేవి. ఇప్పుడు మళ్ళీ బాలీవుడ్‌కి వరుస బెదిరింపులు వస్తున్నాయి. మొన్నటి దాకా సల్మాన్ ఖాన్ ఒక్కడికే చంపేస్తామని లారెన్స్ బిష్ణోయ్ అనే గ్యాంగ్ బెదిరించేది. కానీ ఇప్పుడు వరుసగా దర్శకులు, హీరోలు, హీరోయిన్స్‌కి బెదిరింపులు వస్తున్నాయి. గత వారం రోజుల గ్యాప్‌లోనే బాలీవుడ్ స్టార్ హీరో రణవీర్ సింగ్, స్టార్ డైరెక్టర్ రోహిత్ శెట్టి, సల్మాన్ ఖాన్ బామ్మర్ది ఆయుష్ శర్మకు బెదిరింపులు వచ్చాయి. వాట్సాప్ లేదా ఈమెయిల్ ద్వారా వీళ్ళని బెదిరిస్తున్నారు. ఇందులో కొంతమంది లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ అనే చెప్తున్నారు.

కొంతమందికి అజ్ఞాత వ్యక్తుల నుంచి మెసేజ్‌లు వస్తున్నాయి. పోలీసులు ఇప్పటికే వీటిపై విచారణ చేస్తున్నారు. తాజాగా ఓ హీరోయిన్‌కి బెదిరింపులు వచ్చాయి. నటి, సింగర్ హిమాన్షీ ఖురానాని 10 కోట్లు ఇవ్వాలంటూ ఓ దుండగుడు ఈమెయిల్ ద్వారా వాయిస్ నోట్ పంపించాడు. లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని భయపెట్టాడు. దీంతో హిమన్షి పోలీసులకు ఫిర్యాదు చేయగా ఆ ఈమెయిల్‌తో పోలీసులు విచారణ చేపట్టారు. ఇలా వరుసగా రోజూ బాలీవుడ్ సెలబ్రిటీలకు బెదిరింపులు వస్తుండటంతో వాళ్ళ విజ్ఞప్తి మేరకు పోలీసులు వాళ్లకు సెక్యూరిటీని కూడా ఏర్పాటు చేస్తున్నారు. స్టార్ హీరోలకు, బాలీవుడ్ సెలబ్రిటీలకు ఇలా వరుస బెదిరింపులు రావడంతో మిగతా వాళ్ళు భయపడుతున్నారు. ఇదంతా లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ చేస్తుందా లేదా ఇంకెవరైనా చేస్తున్నారా అనేది పోలీసులు విచారణ చేస్తున్నారు. చాన్నాళ్ల తర్వాత ఇలా బాలీవుడ్ స్టార్స్‌కి బెదిరింపులు వస్తుండటంతో అంతా భయపడుతున్నారు.



## వాళ్లలా ఎఐ వాడలేదు

యంగ్ హీరో నిఖిల్ సిద్ధార్థ నటిస్తున్న తాజా చిత్రం స్వయంభు. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్ పై భువన్, శ్రీకర్ నిర్మించిన ఈ పాన్ ఇండియా సినిమాని ఠాగూర్ మధు సమర్పిస్తున్నారు. ఇటీవలే ఈ మూవీ టీజర్ రిలీజ్ అయింది. అయితే సాంకేతిక కారణాల వల్ల టీజర్‌ను రీఅప్‌లోడ్ చేస్తూ, హీరో నిఖిల్ పెట్టిన ఒక పోస్ట్ వివాదాస్పదంగా మారింది.

## రేవంత్‌రెడ్డికి విజయ్ దేవరకొండ పెళ్లి పిలుపు

టాలీవుడ్ ప్రేమ జంట విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న వివాహం ఈ నెల 26న రాజస్థాన్‌లోని ఉదయ్ పూర్‌లో వీరి వివాహం అత్యంత వైభవంగా జరగబోతోంది. ఉదయ్‌పూర్‌లోని ప్యాలస్‌లో ఇరువురి కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో వివాహం జరగనుంది. వివాహానంతరం ప్రముఖుల కోసం హైదరాబాద్‌లో రిసెప్షన్ ఏర్పాటు చేసే



అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. తాజాగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని విజయ్ కలిశాడు. హైదరాబాద్ లోని రేవంత్ నివాసానికి వెళ్లి స్వయంగా పెళ్లి పత్రికను అందించాడు. తన పెళ్లికి రావాలని ఆహ్వానించాడు. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండకు ముఖ్యమంత్రి ముందస్తు శుభాకాంక్షలు తెలియజేశారు.



ఆట

# ఇషాన్‌దార్

## కొలంబోలో భారత్ శివతాండవం

## బుమ్రా మ్యాజిక్ - చిత్తుగా ఓడిన పాక్

*దాయాది పాకిస్థాన్‌పై చరిత్ర పునరావృతమైంది. బంగ్లాదేశ్ సమస్యలో దూరి బాయ్ కాట్ చేస్తానంటూ అగ్నికి ఆజ్యం పోసిన పాకిస్థాన్‌పై కొలంబో ప్రేమదాస స్టేడియంలో భారత్ శివతాండవం చేసింది. మొదట బ్యాటింగ్‌లో, ఆ తర్వాత బౌలింగ్‌లో ఓ ఆటేసుకుంది. ఇషాన్ కిషన్ షాన్ ధార్ ఇన్నింగ్‌కు పాక్ బౌలింగ్ దాసోహం అంటే...బూమ్ బూమ్ బుమ్రా, హార్థిక్ మైసైల్స్‌కు పాక్ బ్యాట్స్‌మెన్ తోక ముడిచారు. ఇక స్పిన్నర్లు పాక్ చాపచుట్టేశారు.*

| భారత్ | ఓవర్లు | పాకిస్థాన్ |
|---|---|---|
| 1/1 | 1 | 0/1 |
| 16/1 | 2 | 13/3 |
| 25/1 | 3 | 21/3 |
| 30/1 | 4 | 25/3 |
| 41/1 | 5 | 34/4 |
| 52/1 | 6 | 38/4 |
| 65/1 | 7 | 47/4 |
| 82/1 | 8 | 57/4 |
| 89/2 | 9 | 66/4 |
| 92/2 | 10 | 71/4 |
| 98/2 | 11 | 73/5 |
| 108/2 | 12 | 78/5 |
| 118/2 | 13 | 84/7 |
| 125/2 | 14 | 89/7 |
| 127/4 | 15 | 94/7 |
| 136/4 | 16 | 97/9 |
| 140/4 | 17 | 106/9 |
| 154/5 | 18 | 114/10 |
| 159/5 | 19 | |
| 175/7 | 20 | |

**కొలంబో:** భారత అభిమానుల అంచనాలను నిలబెడుతూ టీ20 ప్రపంచకప్ హైవోల్టేజ్ మ్యాచ్‌లో టీమిండియా... చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై 61పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. 176 పరుగుల లక్ష్యచేధనలో దాయాది జట్టు బ్యాటింగ్ పేకమేడలా కూలింది. భారత బౌలర్ల ధాటికి మరో రెండు ఓవర్లు ఉండగానే 114 పరుగులకు కుప్పకూలింది.

**బూమ్ బూమ్ బుమ్రా**

176 రన్స్ టార్గెట్‌తో బరిలోకి దిగిన పాకిస్థాన్‌ను భారత బౌలర్లు ఆడుకున్నారు. ఫర్హాన్‌ను డకౌట్ చేసి హార్దిక్ పాండ్య పాక్ వికెట్ల పతనానికి నాంది పలికాడు. ఆ తర్వాతి ఓవర్లో యార్కర్ల కింగ్ బుమ్రా మ్యాజిక్ చేశాడు. మొదటి బంతికి అయూబ్‌కు లక్కీ సిక్స్ లభించినా, రెండో బంతికి పర్‌ఫెక్ట్ యార్కర్‌తో బోల్తా కొట్టించాడు. కెప్టెన్ సల్మాన్ ఆఘాను కూడా వచ్చిన దారినే పెవిలియన్‌కు పంపాడు. ఒకే ఓవర్లో రెండు వికెట్లు తీసి పాక్‌ను కోలుకోలేని దెబ్బతీశాడు. బౌలింగ్ మార్పుగా వచ్చిన అక్షర్ పటేల్ కూడా బాబర్ ఆజమ్‌ను క్లీన్‌బౌల్డ్ చేయడంతో పాకిస్థాన్ 34 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది.

**సరిపోని ఉస్మాన్ మెరుపులు**

పాక్ శిబిరంలో కాసేపైనా ఆనందం ఉందంటే ఉస్మాన్ ఖాన్ ఆడినంతసేపే. అతని మెరుపులు కూడా పాక్‌ను గట్టెక్కించలేకపోయాయి. 34బంతుల్లో 6 బౌండరీలు, ఒక సిక్స్‌తో 44 పరుగులు చేసిన అతన్ని అక్షర్ పటేల్ తెర దించాడు. ఆ తర్వాత పాక్ బ్యాటింగ్ పేకమేడలా కూలింది. వచ్చిన బౌలర్ వచ్చినట్లే వికెట్లు తీస్తూ పోయారు. ఆఖరుకు తిలక్ వర్మకు కూడా వికెట్ దక్కింది. దీంతో పాకిస్తాన్ ఇన్నింగ్స్ 114 రన్స్‌కే కుప్పకూలింది. భారత బౌలర్లలో బుమ్రా, హార్దిక్, అక్షర్, వరుణ్ చక్రవర్తిలు రెండేసి వికెట్లు.. కుల్‌దీప్, తిలక్ ఒక్కో వికెట్‌తీశారు.

**నిరాశపరిచిన అభిషేక్**

టాస్ నెగ్గి మొదట భారత్‌ను బ్యాటింగ్‌కు దింపిన పాక్ కెప్టెన్ సల్మాన్ అఘా.. సర్‌ప్రైజింగ్‌గా తనే బౌలింగ్‌కు దిగాడు. జట్టులోకి వచ్చిన అభిషేక్‌తో కలిసి ఇషాన్ కిషన్ భారత్ ఇన్నింగ్స్‌ను ప్రారంభించాడు. రెండో బంతికి సింగిల్ తీసి పరుగుల ఖాతా తెరిచాడు. తొలి బంతికే సిక్స్‌తో విరుచుకుపడే విధ్వంసకర ఓపెనర్ అభిషక్ తన శైలికి భిన్నంగా మొదటి మూడు బంతులు డాట్‌గా ఆడాడు. చివరి బంతికి భారీ షాట్ ఆడే ప్రయత్నంలో మిడాన్‌లో షహీన్ అఫ్రిదికి తేలికైన క్యాచ్ ఇచ్చి డకౌట్‌గా పెవిలియన్‌కు చేరాడు. దీంతో భారత్ ఒక పరుగుకే తొలి వికెట్ కోల్పోయింది.

**ఇషాన్‌ధార్ ఇన్నింగ్**

క్రీజ్‌లోకి వచ్చిన తిలక్‌వర్మతో కలిసి ఇషాన్ కిషన్ షాన్‌ధార్ ఇన్నింగ్ ఆడాడు. స్పిన్‌నే నమ్ముకున్న పాక్‌పై చెలరేగాడు. శివరాత్రి నాడు శివతాండవం చేశాడు. షహీన్ అఫ్రిదిని సిక్స్‌తో ఆహ్వానించిన ఇషాన్.. ఆ ఓవర్లో మరో రెండు బౌండరీలు బాదాడు. క్రీజ్‌లో ఉన్నంత సేపు ఇషాన్ విభిన్న షాట్లతో అలరించాడు. అయిదో ఓవర్లో బౌలింగ్‌కు దిగిన అబ్రార్‌ను సిక్స్, ఫోర్‌తో వెల్‌కమ్ చెప్పిన ఇషాన్... అయూబ్ ఓవర్లో మరో రెండు ఫోర్లతో భారత్ స్కోరును 50 పరుగులు దాటించాడు.

**శివతాండవం**

అబ్రార్ మరో ఓవర్‌లో ఇషాన్ వరుసగా మూడు ఫోర్లు కొట్టి టీ20ల్లో తొమ్మిదో హాఫ్ సెంచరీ నమోదుచేశాడు. ఆ తర్వాత కూడా ఇషాన్ జోరు తగ్గలేదు. షాదాబ్ వేసిన 8ఓవర్లో ఓ సిక్స్, ఓ ఫోర్‌తో సహా మొత్తం 17రన్స్ సాధించాడు. బౌలింగ్‌కు దిగిన మరో స్పిన్నర్ అయూబ్ ఓవర్లో రివర్స్‌షాట్ ఆడి బౌండరీ సాధించిన ఇషాన్.. తరువాతి బంతికి మరో భారీ షాట్ ఆడే ప్రయత్నంలో బౌల్డ్ అయ్యాడు. 40 బంతుల్లో 10 ఫోర్లు, మూడు సిక్స్‌లతో 77 పరుగుల ఇషాన్ మెరుపు ఇన్నింగ్ ఈ విధంగా ముగిసింది.

**ఒక్కసారిగా తడబాటు**

ఇషాన్ ఇన్నింగ్స్ తర్వాత భారత్ ఒక్కసారిగా తడబడింది. సూర్యకుమార్, తిలక్ మధ్యమధ్యలో బౌండ రీలు బాదినా అనుకున్న రీతిలో పరుగుల వేగం పెంచలేకపోయారు. 36బంతుల్లో కేవలం 38 పరుగులే చేశారు. అయూబ్ ఈ దశలో ఒక్కసారిగా ఝలక్ ఇచ్చా డు. 25 రన్స్ చేసిన తిలక్‌ను ఎల్బీ చేసిన అయూబ్... తరువాతి బంతికే హార్దిక్‌ను డకౌట్ చేశాడు. హాట్రిక్ మీదున్న అయూబ్.. దూబేను కూడా దాదాపు అవుట్ చేసినంత పనిచేశాడు. 15ఓవర్లకు భారత్ స్కోరు 127 పరుగులే.

**దూబే మెరుపులు**

స్లాగ్ ఓవర్లలో దూబే బ్యాట్‌కు పనిచెప్పాడు. 17 బంతుల్లోనే మూడు ఫోర్లు ఓ సిక్స్‌తో 27 రన్స్ చేశాడు. నిలకడగా ఆడిన సూర్యకుమార్ (29 బంతుల్లో 32) తారిక్ బౌలింగ్‌లో భారీ షాట్ ఆడి అవుటయ్యాడు. షహీన్ అఫ్రిది వేసిన చివరి ఓవర్లో రింకూ సింగ్ ఓ సిక్స్, బౌండరీ సాధించడంతో టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 175 రన్స్ చేసింది. పాక్ బౌలర్లలో అయూబ్ మూడు వికెట్లు తీశాడు.

**స్పిన్‌నే నమ్ముకున్న పాక్**

టీమిండియాతో మ్యాచ్‌లో పాకిస్థాన్ స్పిన్నర్లనే నమ్ముకుంది. ఎంతలా అంటే ఆజట్టు పేస్ అటాక్ షహీన్ అఫ్రిదిని కేవలం రెండు ఓవర్లకే పరిమితం చేసేంతగా. మిగతా 18 ఓవర్లంతా స్పిన్నర్లే. పాక్ ఏడుగురు బౌలర్లలో ఆరుగురు స్పిన్నర్లు.



## పాక్‌పై భారత్-ఎ విమెన్ టీమ్ ఘనవిజయం



తతతత **బ్యాంకాక్:** మహిళల ఆసియాకప్ రైజింగ్ స్టార్స్‌లోనూ పాకిస్థాన్‌కు భారత్ షాకిచ్చింది. దాయాదిని భారత్-ఎ మహిళల టీమ్ చిత్తు చిత్తుగా ఓడించింది. 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన పాక్-ఎ జట్టు 18.5 ఓవర్లలో 93 రన్స్‌కే ఆలౌటైంది. భారత బౌలర్లు సైమా, రాధా, ప్రేమా రావత్ తలో రెండు వికెట్లు తీసి పాక్ పతనాన్ని శాసించారు. ఈ స్వల్ప లక్షాన్ని భారత-ఎ మహిళల జట్టు 10 ఓవర్లలోనే రెండు వికెట్లు కోల్పొయి అందుకుంది. పరుగుల ఖాతా తెరవకుండానే వికెట్ కోల్పోయినా.. బ్రిందా దినేష్ 55 రన్స్, అనుష్క శర్మ 24 రన్స్‌తో రాణించి విజయాన్ని అందించారు.

## సూపర్-8లో వెస్టిండీస్

**ముంబయి:** వెస్టిండీస్ హ్యాట్రిక్ విజయాలతో టీ20 ప్రపంచకప్ సూపర్8లో ప్రవే శించింది. వాంఖడే స్టేడియం వేదికగా జరిగిన గ్రూప్-సీ మ్యాచ్‌లో వెస్టిండీస్ 9 వికెట్ల తేడాతో నేపాల్‌పై ఘనవిజ యం సాధించింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన నేపాల్‌ను విండీస్ బౌలర్లు కుప్పకూల్చారు. జాసన్ హోల్డర్ బౌలింగ్ ధాటికి నేపాల్ 46 పరుగులకే సగం వికెట్లు కోల్పోయింది. ఈ స్థితిలో దీపేంద్ర సింగ్ క్రీజ్‌లో నిలదొక్కుకుని 47 బంతుల్లో 58 రన్స్ చేశాడు. లోయర్ ఆర్డర్‌లో సోంపాల్ 26 పరుగుల మెరుపు ఇన్నింగ్స్‌తో నేపాల్ నిర్ణీత 20 ఓవర్లలో 133 రన్స్ చేసింది.

ఈ లక్ష్యాన్ని విండీస్ ఒక వికెట్ కోల్పోయి 15.2 ఓవర్లలోనే చేధించింది. బ్రాండమ్ కింగ్‌తో తొలి వికెట్‌కు 43 పరుగులు చేసిన షాయ్ హోప్... రెండో వికెట్‌కు హెట్మైర్‌తో కలిసి రెండో వికెట్ కు అజేయంగా 81 రన్స్ చేసి విండీస్‌కు విజయాన్ని అందించాడు.

## నమీబియాపై అమెరికా సూపర్ విక్టరీ



**చెన్నై:** క్రికెట్ కూనల మ్యాచ్‌లో అమెరికా సూపర్ విక్టరీ సాధించింది. గ్రూప్-ఎ లీగ్ మ్యాచ్‌లో నమీబియాపై 31 పరుగుల తేడాతో గెలుపొందింది. మొదట బ్యాటింగ్ చేసిన అమెరికా బ్యాటింగ్‌లో ఇరగ దీసింది. ఓపెనర్ మోనాక్ పటేల్ మెరుపు ఆరంభం ఇచ్చాడు. 30 బంతుల్లో 52 రన్స్ చేశాడు. మిడిల్ ఆర్డర్‌లో సంజయ్ కృష్ణమూర్తి కూడా ధాటిగా ఆడడంతో అమెరికా 20 ఓవర్లలో 4 వికెట్లకు 199 రన్స్ చేసింది. కృష్ణమూర్తి 33 బంతుల్లో వేగంగా 68 రన్స్ చేశాడు.

200 పరుగుల లక్ష్యాన్ని సాధించలేక నమీబియా చతికిలపడింది. 20 ఓవర్లలో 6 వికెట్లకు 168 రన్స్ మాత్రమే సాధించగలిగింది. ఓపెనర్ స్టీన్‌కంప్ 58 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అమెరికా బౌలర్లలో షాండ్లేవాన్ రెండు వికెట్లు తీశాడు.

## వింటర్ ఒలింపిక్స్‌లో నార్వే పతకాల పంట



**మిలాన్:** ఇటలీలో జరుగుతున్న వింటర్ ఒలింపిక్స్‌లో నార్వే దూసుకుపోతోంది. మొత్తం 22 మెడల్స్‌తో టాప్ ప్లేస్‌లో కొనసాగుతోంది. ఇందులో 11 స్వర్ణాలు, నాలుగు సిల్వర్, ఏడు బ్రాంజ్ మెడల్స్ ఉన్నాయి. అతిథ్య ఇటలీ ఆరు స్వర్ణాలతో సహా 17 మెడల్స్‌తో రెండో స్థానంలో ఉంది. అమెరికాకు ఈసారి మెడల్స్ సాధించడంలో వెనకబడిది. కేవలం అయిదు స్వర్ణాలు మాత్రమే అమెరికా సాధించింది. నార్వేకు చెందిన క్రాస్ కంట్రీ స్కియర్ జోహాన్స్ క్లీబో ఏకంగా నాలుగు గోల్డ్ మెడల్స్ సాధించాడు. స్విట్జర్లాండ్ కు చెందిన ఫ్రాంజజో వాన్ అల్మెన్.. ఆల్పైన్ స్కీయర్ విభాగంలో మూడు స్వర్ణాలు గెలుపొందాడు. భారత్ నుంచి నలుగురు క్రీడాకారులు పాల్గొంటున్నా... ఇప్పటివరకు మెడల్స్ బోణీ చేయలేదు.



వాణిజ్యం

## టాప్ ఆరు కంపెనీల్లో రూ.3లక్షల కోట్ల ఎంక్యాప్ కోత

**ముంబయి, ఫిబ్రవరి 15:** మార్కెట్‌లోని టాప్ పదికంపెనీల్లో ఆరు కంపెనీల మార్కెట్‌విలువలు రూ.3 లక్షలకోట్లు కోతకు గురయ్యాయి. ఐటి మేజర్ కంపెనీలు టిసిఎస్, ఇన్ఫోసిస్ వంటి రెండు కంపెనీలు కూడా భారీగా మార్కెట్ విలువలు కోల్పోయాయి. ఈక్విటీల్లో నెలకొన్న మందగమనమే ఇందుకు కారణమని తెలుస్తోంది. టిసిఎస్, ఇన్ఫోసిస్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, రిలయన్స్ ఇండస్ట్రీస్, లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, భారతి ఎయిర్‌టెల్ వంటివి వాటి మార్కెట్‌విలువల్లో తగ్గుదలను చవిచూసాయి. స్టేట్‌బ్యాంకు, బజాజ్‌ఫైనాన్స్, ఎల్‌అండ్‌టి, ఐసిఐసిఐబ్యాంకులు లాభాలు పొందినట్లుతెలుస్తోంది. టిసిఎస్ మార్కెట్ విలువలు 90,198.92 కోట్లు క్షీణించి రూ.9,74,043.43 కోట్లుగా ఉంది. ఇన్ఫోసిస్ విలువలు కూడా 70,780.23కోట్లు క్షీణించి రూ.5,55,287.72 కోట్లుగా ఉంది. ఇక హెచ్‌డిఎఫ్‌షిబ్యాంకు మారెనకట్ విలువలు రూ.54,627.71 కోట్లు క్షీణించింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ రూ.41,883 కోట్లు క్షీణించి రూ.19,21,475.79 కోట్లకు చేరింది. జీవితబీమా సంస్థ మార్కెట్ విలువలు కూడా 23,971.74 కోట్లు క్షీణించి 5,46,226.80 కోట్లకుచేరితే భారతి ఎయిర్‌టెల్ మార్కెట్‌క్యాప్ రూ.19,244.61 కోట్లు క్షీణించి రూ.11,43,044,03 కోట్లుగాఉంది. ఇక ఎస్‌బిఐ విలువలుమాత్రం రూ.1,22,213.38 కోట్లుపెరిగి రూ.11,06,566.44 కోట్లకు చేరింది. బజాజ్‌ఫైనాన్స్‌కూడా రూ.26,414.44కోట్లు పెరిగి రూ.6,37,244.64కోట్లకు చేరింది. ఎల్‌అండ్‌టి కూడా రూ.14,483.9కోట్లు పెరిగి రూ.5,74,028 కోట్లకు చేరింది. ఐసిఐసిఐ బ్యాంకు ఎంకాప్ కూడా 5719.95 కోట్లు పెరిగి రూ.10,11,978.77 కోట్లకు చేరినట్లు తేలింది. టాప్ పదికంపెనీల్లో ఇప్పటికీ రిలయన్స్ టాప్‌లోనే నిలిస్తే ఆ తర్వాత హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, భారతి ఎయిర్‌టెల్, ఎస్‌బిఐ, ఐసిఐసిఐబ్యాంకు, టిసిఎస్, బజాజ్‌ఫైనాన్స్, ఎల్‌అండ్‌టి ఇన్ఫోసిస్, ఎల్‌ఐసిలు నిలిచాయి.

## ఇండో యుఎస్ ట్రేడ్ డీల్‌తో ట్రాక్టర్ల ఎగుమతులకు మంచి ఛాన్స్



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15:** ఇండో యుఎస్ ట్రేడ్‌డీల్‌తో అమెరికాకు ట్రాక్టర్ల ఎగుమతికి పుష్కల అవకాశాలున్నట్లు కంపెనీలు చెపుతున్నాయి. ఎస్కార్ట్స్ కుబోటా కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ 2030 మద్యంతర వృద్ధి ప్రణాళికలో కంపెనీకి ఎగుమతులు మార్కెట్‌పెరుగుతుందని అంచనా వేసింది. కంపెనీ మాతృసంస్థ కుబోటా జపాన్‌కు చెందిన కంపెనీ ఇప్పటివరకూ అమెరికాకు ఎగుమతులుచేయడంలేదని, ఇపుడు సుంకాల సమస్య పరిష్కారం కావడంతో ఎస్కార్ట్ కుబోటా ట్రాక్టర్లను ఇకపై అమెరికాకు సైతం ఎగుమతులుచేస్తామని కంపెనీ పూర్తికాలపు డైరెక్టర్ సిఎఫ్ఒ భారత్ మదన్ తెలిపారు. ఇప్పటివరకూ మా మాతృసంస్థ కుబోటా జపాన్‌నుంచి ఎగుమతులుచేస్తోందని, సుమారు 15శాతం ఎగుమతులు నమోదయినట్లు ఆయన తెలిపారు. అలాగే భారత్‌నుంచి కూడా 18శాతం ఎగుమతులు వెళతాయన్నారు. ఎక్కువ వృద్ధికారక మార్కెట్లపైనే కుబోటా ఫోకస్ పెంచిందని భారత్‌ను తమకు గ్లోబల్ హబ్‌గా మార్చుకుంటుందని కూడా చెప్పారు. అమెరికాకు ఎగుమతులు పెరిగితే కంపెనీకి వ్యయభారం కూడా ఆదా అవుతుందన్న భావనతో సిఎఫ్ఒ ఉన్నారు. ఇక ఇండియా ఈయూ ఎఫ్‌టిఎ పరంగా చూస్తే ఇప్పటికే ట్రాక్టర్లపై సుంకాలు లేవని, ఈ ఒప్పందం తర్వాత ట్రాక్టర్ల ఎగుమతులకు సంబంధించి పెద్దగా ప్రభావం ఉండబోదన్నారు. ఇప్పటికే తాము ఈయూకు ఎగుమతులు చేస్తున్నామన్నారు. దేశీయ మార్కెట్ పరంగా ట్రాక్టర్ రంగం మంచి వృద్ధిపథంలోకి వస్తుందని, జీఎస్టీ రేట్ తగ్గింపుతో మూడోత్రైమాసికంలో 23శాతం వృద్ధిని నమోదుచేసినట్లు కంపెనీ డైరెక్టర్ తెలిపారు.

## లెనోవో నికరలాభం రూ.8145కోట్లు



**ముంబయి, ఫిబ్రవరి 15:** లెనోవో ఇండియా మూడో త్రైమాసికంలో తన నికరలాభాల్లో ఏడుశాతం నమోదుచేసింది. రూ.8145 కోట్లు లాభం ఆర్జించినట్లు ప్రకటించింది. భారత్‌లో ఎఐకి పెరుగుతున్న డిమాండ్, డిజిటైజేషన్‌వెల్లువల కారణంగాపటిష్టమైన పనితీరు చూపించగలిగామని మొబైల్; పిసి ఇతర మౌలికవనరుల బిజినెస్ విభాగాల్లో మంచి పనితీరుచూపింగలిగినట్లు కంపెనీ వైస్ ప్రెసిడెంట్ ఎండి శైలేంద్ర కత్యాల్ తెలిపారు. దీనికితోడు తమ ఉత్పత్తులకు డిమాండ్ పెరగడం కూడా కలిసొచ్చిందన్నారు. కంపెనీపరంగా మోటారోలా కీలక వృద్ధిని నమోదుచేసింది. మూడోత్రైమాసికంలో భారత్ లో 8.3శాతం మార్కెట్ వాటాను సాధించింది. ఇక కోర్ పిసి బిజినెస్; సర్వర్, ఇన్‌ఫ్రా విభాగాలు కూడా రెండంకెల వృద్ధిని నమోదుచేసాయి. గ్లోబల్ టెక్ జైంట్ అయిన లెనోవోకు భారత్ కీలక మార్కెట్ వనరుగా మారింది.

నాలుగుశాం లెనెవో గ్లోబల్ రరెవెన్యూలు, మొత్తం ఆసియా పసిఫిక్ రీజియన్ ఆదాయంలో 24శాతం భారత్‌నుంచే వస్తుందని తెలుస్తోంది. 2005నుంచే భారత్‌లో లెనోవో ఉత్పత్తిచేస్తూ వస్తోంది. స్థానికంగానే అమ్ముడుపోతున్నాయి. మోటారోలా ఫోన్లు, పిసిలు, సర్వర్లు, ట్యాబ్‌లు దేశీయ మార్కెట్‌లో మంచి దూకుడుగా ఉన్నాయి.

ఇక పిసిబిలు, మదర్‌బోర్డులపరంగా కూడా మరింత కృషిచేస్తున్నట్లు తెలిపారు. లెనోవో హైబ్రిడ్ ఎఐ వ్యూహాన్ని ప్రోత్సహిస్తున్నదని, పబ్లిక్ క్లౌడ్స్, ప్రైవేటు ఇన్‌ఫ్రా, ఎఐ పిసిలు వంటి వాటికి ఎక్కువ ప్రోత్సాహం ఇస్తున్నట్లు కనిపిస్తోంది.

భారత్‌లో కంపెనీకి ఆర్‌అండ్‌డి కూడా ఉంది మొత్తం 3400 మంది భారత్‌లోపనిచేస్తున్నారు. లెనోవో గ్రూప్ పరంగా చూస్తే 22.2 బిలియన్ డాలర్ల రాబడులు సాధించింది.

## మణప్పరం వాటాకొనుగోలులో బెయిన్ క్యాపిటల్స్‌కు ఆర్బీఐ ఆమోదం





**ముంబయి, ఫిబ్రవరి 15:** మణప్పురం ఫైనాన్స్‌లో 41.66శాతం వాటా కొనుగోలుచేయాలనుకన్న బెయిన్ క్యాపిటల్‌కు రిజర్వుబ్యాంకు ఆమోదం తెలిపింది. కంపెనీ అధీకృత మూలధనం, కన్వర్టిబుల్ ఉత్పత్తుల్లో బెయిన్ క్యాపిటల్ అనుబంధ సంస్థలు బిసి ఏసియా ఇన్వెస్ట్‌మెంట్ ఎక్స్‌ఎక్స్‌వి, బిసి ఏసియా ఇన్వెస్ట్‌మెంట్స్ ఎక్స్‌ఐవిలు పెట్టుబడులు పెడుతున్నాయి. గత ఏడాది మార్చిలోనే ఇందుకు సంబంధించిన ఒప్పందాలు జరిగాయి. గోల్డ్‌లోన్ మేజర్‌కంపెనీగా ఉనన మణప్పురానికి ఈ పెట్టుబడులతో యాజమాన్య వ్యవస్థకూడా పూర్తిగా మారుతుంది. కొన్ని షరతులకు లోబడి ఆర్బీఐ అనుతిచ్చింది. 26శాతానికి మించి అధీకృత మూలధనం, వారంట్లు మినహాయించి ఏడాది తర్వాత తీసుకోవాల నుకుంటే మళ్లీ ఆర్‌బిఐ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ఆశీర్వాద్ మైక్రోఫైనాన్స్, మణప్పురం హోమ్ ఫైనాన్స్ సంస్థలు కూడా దరఖాస్తులుచేసాయి. వీటి అనుమతులు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయి. ఒకసారి ఈ డీల్‌పూర్తయితే భారత్‌లోని నాన్‌బ్యాంకింగ్ రంగంలో అతిపెద్దప్రైవేటు ఈక్విటీ పెట్టుబడుల డీల్‌గా నిలుస్తుంది. అంతేకాకుండా మణప్పురం క్యాపిటల్‌బేస్‌ను పెంచుతుంది. రిటైల్ రుణ విభాగంలో మరింతగా వృద్ధి ప్రణాళికలు అమలుచేసే వీలుంటుంది.

## సాలిడ్‌రైజ్‌లో లోధా డెవలపర్స్‌కు 80%వాటా




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15:** రియాల్టీ సంస్థ లోధా డెవలపర్స పూణె కేంద్రంగా ఉన్న సాలిడ్‌రైజ్ రియాల్టీలో 80శాతం వాటాను రూ.294 కోట్లకు కొనుగోలు చేసింది. ముంబయి కేంద్రంగాపనిచేసే లోధా డెవలపర్స్ దేశంలోనే లీడింగ్ రియల్ ఎస్టేట్ కంపెనీల్లో ఒకటిగా కొనసాగింది. లోధా బ్రాండ్‌పై స్థిరాస్తులను విక్రయిస్తుంది. కంపెనీ సాలిడ్‌రూజ్ రియాల్టీనుంచి వాటాలకొనుగోలు ఒప్పందం చేసుకుందని వెల్లడించింది. ఈ డీల్‌పూర్తయితో సాలిడ్‌రైజ్ సంస్థ లోధా దవలపర్స్‌లో అనుబంధంగా కొనసాగుతుంది. గతనెలలోనే లోధా దవలపర్స్ ఒకటిశాతం నికరలాభాల్లో వృద్ధిని నమోదుచేసారు. నికరలాభం రూ.956.9 కోట్లు ఆర్జించినట్లు వెల్లడించింది. ఏడాది క్రితం ఇదే కాలంలో రూ.944.4 కోట్లు సాధించింది. మొత్తం రాబడులు కూడా 4775.4 కోట్లు ఉంది. అదే గత ఏడాది 4146.6 కోట్లు మాత్రమే ఆర్జించింది. ముంబయి, ఢిల్లీ, ఎన్సీఆర్, బెంగళూరుల్లో ఈత్రైమాసికంలో ఐదు స్థలాలను సేకరించింది. ఈ స్థలాల్లోనే వృద్ధిచేస్తే రూ.34 వేల కోట్ల విలువలు నమోదవుతాయని కంపెనీ చెపు తోంది. లోధా డెవలపర్స్ 100 మిలియన్ చదరపు అడుగుల స్థలాన్ని ఇప్పటివరకూ అభివృద్ధిచేసింది. ముంబయి మెట్రోపాలిటన్ రీజియన్, పూణె, బెంగళూరు హౌసింగ్ మార్కెట్‌లలో మంచి డిమాండ్‌తో ఉంది. ఇటీవలే ఢిల్లీ ఎన్సీఆర్ రెసిడెన్షియల్ మార్కెట్‌లోకి ప్రవేశించింది.

# అణు ఇంధన రంగంలోకి అదానీ



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15:** అణు విద్యుత్ ఉత్పత్తిలో ప్రైవేటురంగానికి కేంద్రం మద్దతిస్తుండటంతో ఇతర సంస్థలతోపాటు ఆదానిగ్రూప్ కూడా అణువిద్యుత్ రంగంలోకి ప్రవేశిస్తోంది. టాటా, జెఎస్‌డబ్ల్యు సంస్థలు ఇప్పటికే ఈ రంగంలో విద్యుత్ ఉత్పత్తికి ఆసక్తిచూపిస్తున్నాయి. గుజరాత్ కేంద్రంగాఉన్న ఆదాని గ్రూప్ కొత్త అనుబంధ సంస్థ ఆదాని ఆటమిక్ ఎనర్జీద్వారా ఈ రంగంలోకి వస్తోంది ఆదానిపవర్‌కు ఈ సంస్థ అనుబంధంగాపనిచేస్తుంది. ప్రభుత్వ విదాననిర్ణయాల్లో మార్పులు, సడలిం పులు చేర్పులు చేయడంతో ప్రైవేటురంగంలో కూడా అణు ఇంధన ఉత్పత్తికి అవకాశం వచ్చింది. దీర్ఘకా లిక స్వచ్ఛ ఇంధనం, ఇంధన భద్రత వ్యూహాలకు అనుగుణంగా కేంద్రం ఇపుడు ప్రైవేటు రంగాన్ని కూడా ప్రోత్సహిస్తోంది. బారత్‌కు ప్రస్తుతం 9 గిగావాట్ల అణుసామర్థ్యం ఉంది. మొత్తం విద్యుత్ ఉత్ప త్తిలో మూడుశాతం వాటాతో ఉంది. ప్రభుత్వం 2047 నాటికి 100 గిగావాట్ల అణువిద్యుత్ ఉత్పత్తి చేయాలన్న లక్ష్యంతో ఉంది. మొత్తం విద్యుత్‌లో పదిశాతానికిపైగా అణువిద్యుత్ మిక్స్ కూడా ఉంటుం దని అంచనా. ప్రైవేటు కంపెనీలు బిల్డ్, ఓన్, ఆపరేట్ న్యూక్లియర్ పవర్‌ప్లాంట్లు ఏర్పాటు చేయవచ్చు. చిన్నపాటి మాడ్యుల్ రియాక్టర్లను భాగస్వామ్య పద్ధతిలోకూడా ఏర్పాటుచేసుకోవచ్చు. విదేశీ పెట్టు బడుల్లో 49శాతం వాటాను అనుమతిస్తారు. యురేనియం తవ్వకాల్లో మాత్రం పూర్తిగా ప్రభుత్వ పట్టు కొనసాగుతుంది. ఇంధన మేనేజ్‌మెంట్‌కు సంబంధించి ప్రభుత్వ కస్టడీలోనే ఉంటుంది. అణు ఇంధన రంగంలో చేసిన మార్పులు కేవలం మోడీ సన్నిహితులకు, ఎన్డీయే కార్పొరేట్లకు ప్రయోజనం కల్పిం చేందుకు చేసినవిగానే ఉన్నాయని కాంగ్రెస్ పక్షనేత జైరామ్‌రమేష్ అన్నారు. 2070 నాటికి నెట్‌జీరో ఉద్గారాలు సాధించే లక్ష్యంతో భారత్ అణు ఇంధన ఉత్పత్తిని కూడా భారీస్థాయిలో ప్రైవేటును ప్రోత్సహిస్తోంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.